# యన్.టి.ఆర్.

**కె. చంద్రహాస్**

**కె. లక్ష్మీనారాయణ**

దాదాపు 600 పేజీలతో యన్.టి.ఆర్. బాల్యం నుంచి తుదివరకూ జీవితానికి అద్దంపట్టే పుస్తకం త్వరలో అన్ని పుస్తకాల షాపుల్లో లభిస్తుంది. ఈలోగా పుస్తకంలోని ఒక్కో ఆధ్యాయంలో నుంచి క్రింద సూచించిన ఒక భాగం ఈ చిన్న పుస్తకంలో మీకోసం ఉచితంగా అందిస్తున్నాం.

| | పేజీ |
|---|---|
| 1. అతడే ఒక సైన్యం | 3-23 |
| 2. రాజీవ్‌గాంధితో ఒప్పందం | 24-32 |
| 3. విద్యపట్ల విశేష గౌరవం | 33-42 |
| 4. బుద్ధ విగ్రహం | 43-47 |
| 5. ఆధిపత్యంకోసం పోరాటం | 48-64 |

పుస్తకం గురించి వార్తలకు www.ntrbiography.com చూడండి.

CLS PUBLISHERS LLP

NTR (Telugu Promotional Book)
by
K. Chandrahas
K. Lakshminarayana

Imprint April 2019

Published by
CLS Publishers LLP
G-3, Reliance Homes,
8-2-547/R, Road No. 7, Banjara Hills, Hyderabad,
Telangana -500034
e-mail: clspublishersllp@gmail.com
www.ntrbiography/tel.com
www.clspublishersllp.com
Ph : 63039 93642

© Authors

Note: All rights reserved. No part of the book may be reproduced, stored in a retrieval system, or trasmitted in any form or by any means (graphic, electronic or mechanical including photocopying, recording, taping or information retrieval system or produced on any disc, tape, perforated media or other information storage device) without the written permission of the publishers.

Cover design: Ch.Ramesh
Book layout: Ranganath B.K.Shastri

Printed by Sri Sarada Printers, Hyderabad

# అతడే ఒక సైన్యం

నటుడుగా ఎన్‌టీఆర్ వైవిధ్యాన్ని కోరుకునేవారు. విభిన్న పాత్రల పోషణకు ఉత్సాహం చూపెట్టేవారు. అన్నిరకాల పాత్రలూ చేయాలని, మూసపాత్రలకు తను పరిమితం కాకూడదని పట్టుదలతో ఉండేవారు. 1958లో విడుదలైన 'భూకైలాస్' ఆయనకు నటుడిగా తన పరిధిని పెంచుకునే ప్రయోగాలు చేయడానికి అవకాశమిచ్చింది. 'భూకైలాస్' చిత్రంలో రావణపాత్ర శివభక్తి, మాతృభక్తికి పరిమితమైంది. ఆ చిత్రం తరువాత రావణబ్రహ్మ పాత్రను పూర్తిస్థాయిలో ఆవిష్కరించాలనే కుతూహలం ఎన్‌టీఆర్‌లో కలిగింది. ఆ ఉత్సుకతే కొంత కాలానికి తన సొంత నిర్మాణ సంస్థలో 'సీతారామ కల్యాణం' చిత్రం నిర్మించడానికి కారణమైంది.

రావణ పాత్ర ప్రధానంగా సినిమా తీయాలన్న కుతూహలం ఒక ఊహగా ఉన్న దశలోనే ఎన్‌టీఆర్ తన అభిమాన దర్శకుడైన కె.వి.రెడ్డిని ఆ చిత్రానికి దర్శకత్వం వహించమని కోరారు. ఎన్‌టీఆర్ రావణ పాత్ర పోషించాలనుకుంటున్నారన్న విషయం తెలియని రెడ్డిగారు చిత్రానికి దర్శకత్వం చేయడానికి మౌఖికంగా సమ్మతించారు.

కథపై చర్చ జరుగుతున్నప్పుడు రావణ పాత్రను తులనాత్మక అధ్యయనం చేయడానికి ఎన్‌టీఆర్ తన పాఠశాల రోజులనాటి సహాధ్యాయుడు, స్నేహితుడు ధనేకుల బుచ్చి వెంకట కృష్ణ చౌదరి సహకారం తీసుకున్నారు. స్క్రిప్టు దాదాపుగా సిద్ధమైన దశలో సీతా పరిభ్రమణ విభవం అనే పుస్తకం చౌదరి దృష్టికి వచ్చింది. అందులో రామాయణం, శివపురాణం నుంచి అనేక విషయాలను పోగుచేసి రావణ పాత్రను సమగ్రంగా తీర్చిదిద్దిన విధానం చౌదరికి, ఎన్‌టీఆర్‌కు నచ్చింది. చివరకు ఆ పుస్తకం ఆధారంగా సముద్రాల రాఘవాచార్య స్క్రిప్టును తిరగరాశారు.

ఎన్‌టీఆర్ రామునిగా కాకుండా రావణ పాత్ర ధరిస్తున్నట్లు తెలిసిన కె.వి.రెడ్డి చిత్రానికి దర్శకత్వం చేయలేనన్నారు. 'మాయాబజార్'లో ఎన్‌టీఆర్‌ను శ్రీకృష్ణుడిగా ప్రేక్షకుల ఆరాధ్యదైవంగా నిలిపిన తాను అదే ఎన్టీఆర్‌ను రావణపాత్రలో ఊహించలేనని ఆయన చెప్పారు. ప్రజలు కూడా అది మెచ్చుకోరు. ఆ సినిమా తీయవద్దని ఎన్‌టీఆర్‌కు హితబోధ చేసారు. కానీ ఎన్‌టీఆర్ తన అభిప్రాయాన్ని మార్చుకోలేదు. ఎన్‌టీఆర్ తీసుకున్న నిర్ణయంతో ఆయన తమ్ముడు త్రివిక్రమరావు కూడా విస్మయం చెందారు. కనీసం ఎన్‌టీఆర్‌ను రాముడి పాత్ర కూడా వేయమని ప్రాధేయపడ్డారు. ఎన్‌టీఆర్ దానికి కూడా ఒప్పుకోలేదు. పెళ్లి చేసుకున్న సమయానికి రాముడు అప్పుడప్పుడే నూనూగుమీసాలు మొలుస్తున్న లేత వయస్కుడని, ఆ పాత్రకు తను సరికాదని త్రివిక్రమరావును ఒప్పించారు.

ఈ సినిమా చేయడానికి కె.వి.రెడ్డి అంగీకరించకపోవడంతో దర్శకునిగా తన ప్రతిభను

పరీక్షించుకోవాలనుకున్నారు ఎన్‌టీఆర్. అసమాన ప్రతిభావంతులైన కె.వి.రెడ్డి, బి.ఎన్.రెడ్డి, ఎల్.వి.ప్రసాద్ వంటి దర్శకుల దగ్గర నటునిగా పనిచేస్తూనే వారి దర్శకత్వ నైపుణ్యాన్ని ఎన్‌టీఆర్ నిశితంగా పరిశీలించేవారు. 'మల్లీశ్వరి' చిత్ర నిర్మాణం సమయంలో, స్క్రిప్టు తీసుకుని షాట్ డివిజన్ మొదలైన వివరాలు పరిశీలించి సాంకేతిక అవగాహన పెంచుకుంటూ ఉండే ఎన్‌టీఆర్‌తో "మిస్టర్ రామారావ్. నీవు గ్రాడ్యుయేట్‌వి. రేపు డైరెక్టర్, ప్రొడ్యూసర్ అయి మంచి చిత్రాలు తీయాలి" అని బి.ఎన్.రెడ్డి  సలహా ఇచ్చారు.

199వ దశకం ప్రారంభంలో ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో బి.ఎన్.రెడ్డి, కె.వి.రెడ్డి, ఎల్.వి.ప్రసాద్‌ల దర్శకత్వ ప్రతిభను ప్రస్తుతిస్తూ, వారే దర్శకత్వంలో తనకు ప్రేరణ అని ఎన్‌టీఆర్ అన్నారు. తాను సినీరంగంలో ప్రవేశించిన ప్రారంభ సంవత్సరాలను గుర్తు చేసుకుంటూ తాను కథ ఏమిటి అని బి.ఎన్.రెడ్డి గారిని అడిగితే ఆయన తన ప్రశ్నకు నవ్వేవారన్నారు. కథ ఏమిటని అడిగేకంటే స్క్రిప్టు చదవమని ఆయన సూచించేవారన్నారు. షాట్ ఏమిటని అడగడం కూడా ఆయన ముందు పొల్లుమాటే. ఆయన సినిమాలో స్క్రిప్టే సర్వస్వం. స్క్రీన్‌ప్లే (చిత్రానువాదం) సినిమాకు ఆయువుపట్టు.




కె.వి.రెడ్డి కూడా ఎప్పుడూ కథ చెప్పేవారు కాదని ఎన్‌టీఆర్ చెప్పారు. సీనిక్ ఆర్డర్ ఏమిటని కానీ, షాట్ డివిజన్ ఏమిటని కానీ ఆయన చెప్పేవారు కాదు. బదులుగా స్క్రిప్టు చేతికి ఇచ్చి చదవమనేవారు. వారి స్క్రిప్టులో సర్వ విషయాలూ వివరంగా ఉండేవి. హాలీవుడ్ దర్శకుడు ఆల్ఫ్రెడ్ హిచ్‌కాక్ స్క్రీన్‌ప్లేయే సర్వస్వం అనేవారు. స్క్రీన్‌ప్లే కుదుర్చుకున్నాక చిత్రీకరణ దాన్ని యాంత్రికంగా తెరపైకి మార్చే చిన్న పని మాత్రమే అనేవారు. ఎన్‌టీఆర్ కూడా స్క్రీన్‌ప్లేకు అత్యంత ప్రాముఖ్యత ఇచ్చేవారు.

"నా సినిమాలో ఆర్టిస్టులకు నేను కథ చెప్పను. ముందుగానే స్క్రిప్టు చేతికి అందించి సెట్టుకు వచ్చేముందే చదువుకుని రమ్మని చెబుతాను. ఇందులో ఎవరికీ ఎలాంటి మినహాయింపు లేదు. అతి కీలకమైన విషయాలు సైతం సెట్టుకు రావడానికి ముందే నిర్ణయించే వాళ్లం. సెట్టుకు వచ్చిన తరువాత అందరి ఆలోచనలు నటనపైన, తాము

పోషిస్తున్న పాత్ర తీరుతెన్నులపైన కేంద్రీకరించాలి. ఇతర విషయాలపైన కాదు" అన్నారు ఎన్టీఆర్.

కె.వి.రెడ్డి పద్ధతిలో ఎన్టీఆర్ 'సీతారామ కల్యాణం' స్క్రిప్టును పూర్తిస్థాయిలో సిద్ధం చేశారు. పూర్తయిన స్క్రిప్టు మొత్తాన్ని తన చేతితొ రాసుకోవడం ఎన్టీఆర్‌కు అలవాటు. అలా స్క్రిప్టును మళ్లీ రాసుకోవడం వల్ల తనకు సీన్లపైనా, పాత్రలపైన, సంభాషణలపైనా పట్టు వస్తుందనేది ఆయన నమ్మకం. మొదటి డైలాగు నుంచి చివరి డైలాగు వరకు, ఫస్ట్ షాట్ నుంచి చివరి షాట్ వరకు అన్నింటినీ ఆయన స్క్రిప్టు పుస్తకంలో వివరంగా రాసుకునేవారు. షూటింగ్ ప్రారంభించడానికి ముందుగానే ఆయన నటులను ఎన్నుకునేవారు. వారు వారి సంభాషణలు ఎలా చెప్పాలి, సన్నివేశాలు ఎలా చిత్రీకరించాలన్న విషయాలను నిర్ధారించుకుని, మొదటి షాటు కూడా తీయక మునుపే పూర్తి సినిమాను ఆయన తన మనోఫలకంపై దర్శించేవారు. సినిమాకు దర్శకుడే తొలి ప్రేక్షకుడని సినిమారంగంలో చెబుతారు. సినిమాపై పూర్తి అవగాహన లేని వాడు మంచి దర్శకుడు కాలేడు. ఇది ఎన్టీఆర్ నమ్మిన సత్యం.

స్క్రిప్టు సిద్ధమైన వెంటనే ఎన్టీఆర్ ప్రీప్రొడక్షన్ పనుల్లో తలమునకలయ్యారు. ఆర్ట్ డైరెక్టర్ టి.వి.ఎస్.శర్మ చేత సెట్లు డిజైన్ చేయించారు. డిజైనర్లతో కూర్చుని కాస్ట్యూమ్స్, నగలు డిజైన్ చేయించారు. చాలాసార్లు తానే సొంతంగా డిజైన్లు గీసి, డిజైనర్లకు మార్గదర్శనం చేసేవారు. ప్రతి పాత్రకూ కిరీటాలు సక్రమంగా రూపొందించారు.



సినిమాటోగ్రాఫర్‌గా ఈ సినిమాకు ఎ.రెహమాన్‌ను తీసుకున్నారు. రెహమాన్‌కు గుర్రప్పందాల పిచ్చి. ఎన్టీఆర్ మేకప్‌తో సిద్ధమై వచ్చేసరికి అతను సెట్లో ఉండేవాడు కాదు. ఇలా ఒకసారి కాదు, రెండుసార్లు జరిగింది. రెహమాన్ గొప్ప కెమెరామేన్. కానీ క్రమశిక్షణ లేని వ్యక్తితో వేగలేమని ఎన్టీఆర్ అనుకుని, కొత్త కెమెరామేన్‌ను తీసుకోవాలనుకున్నారు.

అప్పుడు ఆయనకు బాబూభాయ్ మిస్త్రీకి అసిస్టెంట్‌గా పనిచేసే రవికాంత్ నగాయిచ్ గుర్తుకు వచ్చారు. అతడు దక్షిణాది సినిమాల్లో పనిచేయాలని అవకాశం కోసం చూస్తున్నాడు.

అతన్ని తన సినిమాకు ఛాయాగ్రహణ దర్శకుడుగా తీసుకున్నారు. నగాయిచ్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఈ సినిమాలో తన నైపుణ్యాన్ని సంపూర్ణంగా ప్రదర్శించడానికి అవకాశముందని అతడు భావించాడు. ప్రత్యేకించి ట్రిక్ ఫోటోగ్రఫీలో అతడు గొప్ప నిపుణుడు. పదితలల రావణాసురుడు కైలాస పర్వతాన్ని పైకెత్తే సన్నివేశం అతని కళానైపుణ్యానికి చక్కటి ఉదాహరణగా నిలుస్తుంది. మామూలు కెమెరామెన్ అయితే తొమ్మిది డమ్మీ తలలతో ఎన్‌టీఆర్‌ను చూపించి ఆ సన్నివేశం తీసి ఉండేవారు. ఆరోజుల్లో దాన్నెవరూ తప్పు పట్టేవాళ్లు కూడా కాదు.

కానీ నగాయిచ్ అలా తృప్తి చెందదలచుకోలేదు. ఎన్‌టీఆర్ వివిధ రకాలైన ముఖ కవళికలను ప్రదర్శించేలా చేస్తూ మాస్క్ షాట్స్ చిత్రీకరించాడు. దాంతో పది నిజమైన శిరస్సులతో 'ఓం నమశ్శివాయ' జపిస్తూ పర్వతాన్ని ఎత్తినట్లుగా సన్నివేశం వచ్చింది. ఇది నటుడికి, కెమెరామేన్‌కి కూడా శ్రమతో కూడిన పని. ఈ సన్నివేశాన్ని తెరకెక్కించిన విధానం అద్భుతం. రావణుడు కైలాసపర్వతాన్ని ఎత్తే సన్నివేశం మరుపురాని సన్నివేశంగా సినిమా చరిత్రలో నిలిచిపోయింది.



ఈ సినిమాకు సంగీత దర్శకునిగా పనిచేసేందుకు ఒప్పుకున్న సాలూరు రాజేశ్వరరావు ఇందులో 'కానరార కైలాస నివాసా..' అన్న గీతాన్ని ఆ వెనువెంటనే వచ్చే 'జయత్వదభ్ర విభ్రమ..' అనే స్తోత్రాన్ని స్వరపరిచారు. తరువాత రాజేశ్వరరావు ఒక పాటను స్వరపరచడానికి కూర్చున్నప్పుడు ఎన్‌టీఆర్ ఒక ట్యూన్ అనుకుంటూ పాటను ఆ ట్యూనులో స్వరపరచమని అడిగారు. "మీ నోట వచ్చిన స్వరాలు నా హార్మోనియంలో పలకవు సార్" అని రాజేశ్వరరావు చెప్పి లేచి వెళ్లిపోయారు. ఆయనంతే! తనపనిలో ఎవరి ప్రమేయాన్నీ సహించేవారు కాదు. అప్పుడు గాలిపెంచల నరసింహారావు సంగీత దర్శకుడిగా ప్రవేశించారు. వారు ఆణిముత్యాల్లాంటి పాటలు అందించారు. పెళ్లిళ్లలోనూ, శ్రీరామనవమి పందిళ్లలోనూ నేటికీ తప్పనిసరిగా వినిపించే 'సీతారాముల కల్యాణం చూతము రారండీ..' అనే ఎవర్ గ్రీన్ పాట ఆయన స్వరపరిచిందే.

కైలాస పర్వతాన్ని ఎత్తి తరలించాలనుకుని ప్రయత్నం చేసి, ఆ ప్రయత్నం విఫలమైన తరువాత పరమశివుడు ప్రత్యక్షము కాలేదన్న అవేదనతో ఆత్మత్యాగానికి సిద్ధపడి, తన పొట్టను తన గోళ్లతో చీల్చి, ప్రేవులను బయటకు లాగి ఆ ప్రేవులనే వీణాతంత్రులుగా

మార్చి రావణుడు రుద్రవీణ వాయిస్తాడు. సుప్రసిద్ధ వీణా విద్వాంసులు ఈమని శంకరశాస్త్రి గారి వీణానాదం ఆర్ద్రతను బరువుగా ఆవిష్కరించి, ఎన్‌టీఆర్ అద్వితీయ నటనకు తోడై సినిమాకు ఆ సన్నివేశం తలమానికంగా నిలిచింది.

నిర్మాతగా ఎన్‌టీఆర్ వృథా ఖర్చులకు బద్ధ వ్యతిరేకి. "నేను సెట్స్ కోసం, తెరమీద కనిపించే ప్రతి చిన్న అందం కోసం కోట్ల రూపాయలు ఖర్చయినా లెక్కచేయను. కానీ కనిపించని విషయాలకు ఒక్క పైసా ఖర్చయినా నేను సహించను. ఇది నా సిద్ధాంతం. ఒక్క మాటలో చెప్పాలంటే లైట్స్ ఆన్ అయినప్పుడే ఏ విలాసమైనా. ఆఫ్ అయిన తరువాత జరిగే ఖర్చు నా ప్రొడక్షన్ ఖాతాలోకి ఎక్కదు" అన్నారు ఎన్‌టీఆర్. ఖర్చు విషయంలో ఎన్‌టీఆర్ చాలా నిక్కచ్చిగా ఉండేవారు.

ఎన్‌టీఆర్ క్రమశిక్షణే శ్వాసగా బ్రతికిన వ్యక్తి. తన సొంత బేనర్‌లో సినిమా షూటింగు జరుగుతున్నప్పుడు సెట్టులో కచ్చితంగా 7 గంటలకు పని మొదలయ్యేది. సాయంత్రం 6 గంటలకు ప్యాకప్ చెప్పేవారు. ప్రత్యేకమైన కారణం లేదా అత్యవసరం అయితే తప్ప రాత్రిపూట షూటింగ్‌కు అనుమతించేవారు కాదు. సెట్‌లో నిశ్శబ్దం అలుముకునేది. అనవసరమైన మాట ఒక్కటి కూడా వినిపించేది కాదు. షాటుకు అవసరమైన శబ్దాలు మాత్రమే వినబడేవి.

ఆయన తన ఆర్టిస్టులందరూ తాజాముఖాలతో కనిపించాలని కోరుకునేవారు. ఆర్టిస్టుల ముఖాలు అప్పుడే వికసించిన పువ్వులా తాజాగా ఉండాలని కె.వి.రెడ్డి చెప్పేవారు. అప్పుడే మొహంలో భావాలు సరిగ్గా ప్రతిఫలిస్తాయని చెప్పేవారు. ప్రత్యేకించి క్లోజప్ షాట్లు తీసేటప్పుడు ఆర్టిస్టు ముఖాన్ని జాగ్రత్తగా గమనించేవారు. ముఖంలో తాజాదనం ఉంటేనే ఆయన షాట్ తీసేవారు. ఎన్‌టీఆర్ కూడా అంతే.

ఆయన దర్శకత్వం చేబట్టిన తొలిదినాల్లో సెట్టులో చాలా ఎమోషనల్‌గా ఉండేవారు. ఏ చిన్న తప్పిదం జరిగినా ఆవేశపడి గట్టిగా అరిచేవారు. కానీ క్రమంగా ఆయన తన భావోద్వేగాలను నియంత్రించుకోవడం నేర్చుకున్నారు. తప్పులు దొర్లకుండా పనిచేయడం ఎలాగో తనకు అనుభవమే నేర్పిందని ఎన్‌టీఆర్ అనేవారు.

వేతనాలు చెల్లించే విషయంలో కూడా ఎన్‌టీఆర్ కచ్చితంగా ఉండేవారు. జీతభత్యాలు ఒక్కపూట కూడా ఆలస్యం కాకుండా అందచేసేవారు. జూనియర్ ఆర్టిస్టుల సమస్యలు ఆయనకు బాగా తెలుసు కనుక వారి చెల్లింపుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపించేవారు. జూనియర్ ఆర్టిస్టులు ఆయన సినిమాలో పని అంటే సాయంత్రం ఇంటికి తిరిగివెళ్ళే సమయానికి జేబులో చెక్కుతోనే తిరిగివెళ్తామని అఖండవిశ్వాసంతో పొద్దుటే వచ్చేవారు. హైదరాబాదులో ఆయన సినిమాలు తీస్తున్నప్పుడు మద్రాసు నుంచి ఉదయాన్నే వచ్చిన జూనియర్ ఆర్టిస్టులు రాత్రి రైలుకు మద్రాసు తిరిగి వెళ్లేవారు. సాయంత్రానికి రసీదుతో సహా చెక్కు వారి

చేతుల్లో ఉండేది. మేనేజర్ల చేతిలో మోసపోకూడదని వారికి ఆయన నగదు చెల్లించేవారు కాదు.


'సీతారామ కల్యాణం' చిత్రం విడుదలకు ముందు కె.వి.రెడ్డిగారి కోసం చిత్రం స్పెషల్ ప్రివ్యూ షో వేశారు. రెడ్డిగారు తన అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టినట్లు చెబుతారని ప్రతీతి. కె.వి.రెడ్డి ఏకాగ్రతతో సినిమా చూశారు. శుభం కార్డు పడిన తరువాత "వెరీ గుడ్" అన్నారు. ఆయన షూటింగ్ సమయంలో షాట్ సంతృప్తికరంగా వస్తే, 'పాస్' అనేవారు. అందువల్ల ఆయన "వెరీగుడ్" అని కామెంట్ చేశారంటే సినిమా 'డిస్టింక్షన్' స్థాయిని అందుకున్నట్లు లెక్క. ఆ రెండు మాటలు వినగానే పిడుగులాంటిదేదో చల్లగా ఎన్‌టీఆర్ గుండెలోకి దిగింది. జన్మ సాఫల్యమైంది అన్నట్లు ఆయన వొళ్లు జలదరించింది.

1961 జనవరి 6వ తేదీన విడుదలై 'సీతారామ కల్యాణం' సినిమా సూపర్ హిట్టయి 9 కేంద్రాల్లో 100 రోజులు ఆడింది. దర్శకుడిగా ఎన్‌టీఆర్ చేసిన కృషిని విమర్శకులు ప్రత్యేకంగా ప్రశంసించారు. ఎన్‌టీఆర్ బహుముఖ ప్రజ్ఞను సమీక్షకులు గొప్పగా మెచ్చుకున్నారు. "ఈ చిత్రంలో రావణుడుగా ఎన్‌టీఆర్ ఉన్నతశిఖరాలు అందుకున్నాడు. మరపురాని రీతిలో పాత్రపోషణ చేసి రక్తి కట్టించాడు. ఆ పాత్రపట్ల అతనికి గల అభిమానం, అందుకు తాను చేసిన కృషి, ప్రతిభ రావణ పాత్రపోషణలో కళ్లకు కట్టాయి" అని ఆంధ్రపత్రిక 1961 జనవరి 18 సమీక్షలో పేర్కొన్నారు. రావణ పాత్రను అనన్య సామాన్యంగా పోషిస్తూ ఎన్‌టీఆర్ ఆ పాత్రను ఆవిష్కరించిన తీరుకు ప్రేక్షకులు ముగ్ధులయ్యారు. ఎన్‌టీఆర్ రావణపాత్రతో గారడీ చేశారు. "రసజ్ఞుడుగా, కళాప్రపూర్ణుడుగా, సామవేద పండితుడుగా, శివపూజా దురంధరుడుగా రావణబ్రహ్మని తీర్చిదిద్ది, ఆ పాత్రలో ఎన్‌టీఆర్ జీవించి రావణబ్రహ్మని చిరంజీవిని చేశారు" అని శ్రీరమణ అన్నారు.



1961 జనవరి 18 ఆంధ్రపత్రిక వీక్లీలో ఎన్‌టీఆర్ స్వయంగా 'నా అభిమానపాత్ర రావణబ్రహ్మ' శీర్షికతో వ్యాసం రాశారు. రావణుడు పుట్టుకతో రాక్షసుడు. కానీ అతడు గొప్ప పండితుడు, సంగీతవేత్త, శివభక్తుడు. పరాక్రమవంతుడు. అంతటి సుగుణాలరాశి కనుకనే అతణ్ణి సంహరించడానికి సాక్షాత్తు శ్రీమహావిష్ణువే మానవుడిగా పుట్టవలసి వచ్చింది. అందుకే ఆ పాత్ర నా అభిమాన పాత్ర అన్నారు ఎన్‌టీఆర్. "రావణ పాత్ర సర్వావేశ సంకలితం. అనందం, ఆవేశం–అనుగ్రహం, ఆగ్రహం–సహనం, అసూయ–భక్తి, ధిక్కారం వంటి రావణుని పరస్పర విరుద్ధ ప్రవృత్తులన్నీ వ్యక్తీకరించడానికి ప్రయత్నించాను" అని ఎన్‌టీఆర్ చెప్పారు. దాదాపు ఒక దశాబ్దం తరువాత గుంటూరు జిల్లాలో ఒక సన్మాన సభలో మాట్లాడుతూ "రాముడి వేషం వేసినాయన రావణాసురుని వేషం వెయ్యడమేమిటి, రామారావు తప్పకుండా ఫెయిలవుతాడని చాలామంది అన్నారు. అయితే సినిమా విడుదలైన తరువాత శైవ మతాధిపతులంతా నన్ను మెచ్చుకుంటూ ఉత్తరాలు రాశారు. శృంగేరి స్వామి కూడా అభినవ రామరావణ పాత్రధారీ రామరాయా! అంటూ నన్ను అభినందిస్తూ ఉత్తరం రాశారు. దాంతో కళాకారునిగా నా ప్రయోగం విజయవంతమైందని సంతోషించాను" అని ఎన్‌టీఆర్ అన్నారు.

'సీతారామ కల్యాణం' సినిమాకు ఎన్‌టీఆర్ దర్శకత్వం వహించారు కానీ దర్శకుడుగా తన పేరు వేసుకోలేదు. సినిమాలో దర్శకుడు పేరుతో టైటిల్ కార్డే కనిపించదు. కారణం



రహస్యంగా ఉండిపోయింది. ఆ అంతుచిక్కని రహస్యం తరువాతి సినిమాలో కూడా కొనసాగింది. అరేబియన్ నైట్స్ ప్రేరణతో తెలుగులో వచ్చిన కాశీమజిలీ కథలు ఆధారంగా ఈసారి ఎన్‌టీఆర్ జానపద సినిమాకు శ్రీకారం చుట్టారు. అదే 'గులేబకావళి కథ' చిత్రం. ఎన్‌టీఆర్‌కు జంటగా జమున నటించింది. అప్పట్లో జమునను ఎన్‌టీఆర్, ఏఎన్నార్ తమ సినిమాల నుంచి రెండేళ్లకు పైగా బహిష్కరించారు. సర్దుబాటు జరిగిన తరువాత ఆమెను మొదటిగా ఎన్‌టీఆర్ తన సినిమాలోనే తీసుకున్నారు. ఈ సినిమాలో హీరోకి, విలన్లకు మధ్య పోరాట సన్నివేశాలు చిత్రీకరించడానికి దాదాపు ఎనిమిది కిలోల బరువుగల కత్తులు తయారుచేశారు. ఈ సినిమాకు పాటలు రాయడానికి డాక్టర్ సి.నారాయణరెడ్డి

(సినారె)ని ఎన్‌టీఆర్ ఆహ్వానించారు. తనను ఏవో ఒకటి రెండు పాటలకు పరిమితం చేయకుండా సినిమాలో అన్ని పాటలూ రాయనిస్తేనే తాను సినిమాలో పనిచేస్తానని సినారె షరతు పెట్టారు. దానికి ఎన్‌టీఆర్ అంగీకరించారు.

సినిమాకోసం పనిచేయడానికి సినారె మొదటిసారి మద్రాస్ వచ్చినప్పుడు ఎన్‌టీఆర్ స్వయంగా రైల్వే స్టేషన్‌కు వెళ్లి ఆయనను ఆహ్వానించారు. కవులకు ఆయన ఇచ్చే గౌరవానికి అదో ఉదాహరణ. ఈ సినిమాతో జోసెఫ్–కృష్ణమూర్తి ద్వయం సంగీతదర్శకులుగా పరిచయమయ్యారు. ఈ సినిమాలోని పాటలు వైవిధ్యభరితంగా ఉంటాయి. ఇందులో సినారె రాసిన తొలిపాట 'నన్ను దోచుకుందువటే వన్నెల దొరసాని' ఎన్‌టీఆర్, జమునలపై చిత్రీకరించారు. ఆడియోలోనూ, వీడియోలోనూ కూడా ఈ పాట ఎవర్‌గ్రీన్ రొమాంటిక్ హిట్. అద్భుతమైన జమున నటన, ఎన్‌టీఆర్ మనోజ్ఞమైన స్క్రీన్ ప్రెజెన్స్, హాయిగొలిపే పాటలు, అపూర్వమైన పోరాట సన్నివేశాలు, ఉత్తమ సాంకేతిక విలువలు కలగలిసి ఈ సినిమా విజయవంతం కావడానికి దోహదం చేశాయి. 1962 జనవరి 5వ తేదీన 'గులేబకావళి కథ' విడుదలైంది. ఎన్‌టీఆర్ దర్శకత్వం వహించిన తొలి సినిమా 'సీతారామ కల్యాణం' విడుదలైన తర్వాత సరిగ్గా ఏడాదికి వచ్చిన ఈ సినిమా 5 కేంద్రాల్లో 100 రోజులు ఆడి ఆర్థికంగా విజయం సాధించింది.




'సీతారామ కల్యాణం'లో రావణునిగా చేసిన ప్రయోగం నటునిగా, నిర్మాతగా, దర్శకునిగా ఎన్‌టీఆర్‌కు చక్కని ప్రారంభాన్నిచ్చింది. 1957లో 'మాయాబజార్' చిత్రంతో ప్రారంభించి, 1965 నాటికి ఆయన శ్రీకృష్ణునిగా అయిదు సినిమాల్లో నటించారు. మహాభారత ఇతిహాసానికి సంబంధించి ఆయన భీష్మ, భీమ, అర్జున పాత్రలు పోషించారు. రావణ పాత్రతో విజయాన్ని చవిచూసిన తరువాత మహాభారతంలోని అసూయాగ్రస్తుడైన సుయోధనుని పాత్రను అతని ప్రాభవాన్ని, పొరబాట్లను కూడా ఆవిష్కరిస్తూ

ధరించాలన్న కోరిక ఎన్‌టీఆర్‌లో పెరిగింది. ఆ కోరికకు సాఫల్యంగా 'శ్రీ క్రిష్ణపాండవీయం' రూపుదిద్దుకుంది. భారత, భాగవతాల్లో అనేకచోట్ల నుంచి తీసుకున్న కథతో, శ్రీకృష్ణ, భీమ, సుయోధన పాత్రలకు దాదాపుగా సమప్రాధాన్యం ఇస్తూ ఈ సినిమాను రూపొందించారు. ఇందులో ఆయన శ్రీకృష్ణ, సుయోధన పాత్రలను పోషించడమే కాకుండా దర్శకత్వ బాధ్యతను కూడా చేబట్టారు. పాండవుల పట్ల ద్వేషం తప్ప తనకు ఇంకొక దుర్గుణం లేదని, ఆ ద్వేషానికి కూడా కారణాన్ని చెప్పి, సుయోధనుని అభిమానధనాన్ని అధ్యయనం చేసి, అతని అంతరంగాన్ని తెరపై ఆవిష్కరించి, పండిత పామరులను మెప్పించి, సుయోధన పాత్రను హీరోను చేసిన ధీశాలి ఎన్‌టీఆర్.

"శ్రీ క్రిష్ణపాండవీయం చిత్రంలో సుయోధన పాత్రలో తాము ధరించిన కిరీటం బరువైనా లెక్కచేయక, చిత్రం ఆద్యంతం ముగిసేవరకూ అలానే వుంచారు. ఆ బరువు, పెరిగిన వారి కీర్తిభారానికి గుర్తుగా ఓ చిన్న మచ్చ నెన్నుదుట ఏర్పరచి పోయింది" అని పుండరీకాక్షయ్య అన్నారు.

డైరెక్టర్‌గా ఎన్‌టీఆర్‌కు ఇది మూడవ సినిమా. ఇంతకుముందు తను దర్శకత్వం వహించిన రెండు సినిమాలకు దర్శకునిగా తన పేరును ఎన్‌టీఆర్ ప్రకటించుకోలేదు. కానీ 'శ్రీ క్రిష్ణపాండవీయం' చిత్రానికి స్క్రీన్‌ప్లే–దర్శకత్వం తన పేరు వేసుకున్నారు. దర్శకుడు పేరు వేయకపోవడం దర్శకుని కుర్చీని అవమానించడమే అవుతుందని ఆ సమయంలో దక్షిణ భారత సినీదర్శకుల అసోసియేషన్ అధ్యక్షులు పి. పుల్లయ్య ఎన్‌టీఆర్‌తో చెప్పారు. ఆయన చెప్పిన మాటల్లోని తర్కాన్ని అంగీకరించిన ఎన్‌టీఆర్ 'శ్రీ క్రిష్ణపాండవీయం' చిత్రానికి దర్శకునిగా తన పేరు ప్రకటించుకున్నారు.

కళాకారుడు దేనికీ కట్టుబడి ఉండడని లోకోపవాదు. కానీ ఎన్‌టీఆర్ జీవితం అలా కాదు. ప్రకృతి గతిలాగా ఆయన జీవితం నియమబద్ధం. శ్రమఫల రహస్యాన్ని గుర్తించిన వ్యక్తి ఎన్‌టీఆర్. ఆయన కాలానికి విలువనిచ్చేవారు. గడచిన ఒక్క నిముషం తిరిగిరాదు అనేవారు. ఆయన సినిమా షూటింగుకు అందరూ సమయానికి సెట్టులో ఉండేవారు. ముందుగా చెప్పి ఏదైనా ముఖ్యమైన పని ఉండి ఆలస్యంగా వస్తే ఆయన సర్దుకుపోయేవారు. చెప్పక ఆలస్యంగా వస్తే మాత్రం సహించేవారు కాదు.

'శ్రీ క్రిష్ణపాండవీయం' సినిమాలో రుక్మిణిగా కె. ఆర్. విజయ నటించారు. తెలుగులో ఆమెకు అదే తొలిచిత్రం. ఒకసారి ఆమె వరుసగా మూడు రోజులపాటు షూటింగుకు ఆలస్యంగా వచ్చారు. నాలుగవ రోజు ఆమెకు లీగల్ నోటీసు పంపించారు. నష్టపోయిన షూటింగ్ సమయానికి పరిహారం చెల్లించమన్నారు. ఆమె తన తప్పును తెలుసుకుని రాజీకి వస్తే పెద్దమనసుతో ఆ వ్యవహారాన్ని ఎన్‌టీఆర్ సాగదీయలేదు. ఆ తరువాత ఎప్పుడూ ఆమె షూటింగుకు ఆలస్యంగా రాలేదు.

'శ్రీ క్రిష్ణపాండవీయం' అద్భుత దృశ్యకావ్యంగా రూపుదిద్దుకుంది. చిత్రంలో రుక్మిణీ కల్యాణం రమణీయంగా, మనసుకు హత్తుకునేలా చిత్రీకరించారు. ఈ సినిమా ప్రివ్యూ చూసిన తరువాత కొన్నాళ్ళకు ఎన్టీఆర్‌ను కలవడానికి సుప్రసిద్ధ సినీ విమర్శకుడు వి.ఎ.కె.రంగారావు వెళ్ళారు. ఎలా ఉంది సినిమా అని ఎన్‌టీఆర్ అడిగితే "చాలా బాగుంది. పాటలు, సన్నివేశాలు బాగున్నాయి. కానీ రుక్మిణీ కల్యాణం ఘట్టం మాత్రం మీరు దర్శకత్వం చేసినట్లుగా లేదు" అని రంగారావు అన్నారట. ఆమాట విన్న ఎన్‌టీఆర్ భ్రుకుటి ముడిపడింది. "ఆ సన్నివేశం మొత్తం బమ్మెర పోతన చేసినట్లుగా ఉంది" అన్నారు రంగారావు. ఎన్‌టీఆర్ మనస్ఫూర్తిగా నవ్వేశారు. రుక్మిణీ కల్యాణం భాగవతంలోని ఒక ఘట్టం. దీనిని తెలుగులో భక్తపోతన అపురూపంగా రచించారు. "బమ్మెర పోతన తీసినట్లుగా ఉందని చెప్పడంలో ఒక కావ్యాన్ని కావ్యంగా చిత్రీకరించారని రంగారావు గారు చెప్పకనే చెప్పారు" అని కాట్రగడ్డ మురారి తన పుస్తకం 'నవ్వి పోదురు గాక నాకేటి'లో రాశారు. వి.ఎ.కె.రంగారావుగారు ఒక పట్టాన దేన్నీ మెచ్చుకునే వ్యక్తి కారు. ముఖస్తుతి ఆయన నిఘంటువులో లేదు. అటువంటి విమర్శకులు అలా పొగడడం సాధారణమైన విషయం కాదు.

'శ్రీ క్రిష్ణపాండవీయం' సినిమా తొమ్మిది కేంద్రాల్లో 100 రోజులాడింది.

సొంత నిర్మాణ సంస్థలో తదుపరి చిత్రంగా 'వరకట్నం' వచ్చింది. సమాజాన్ని పీడిస్తున్న వరకట్న దురాచారానికి వ్యతిరేకంగా ఎన్‌టీఆర్ దర్శకత్వంలోనే వచ్చిన ఈ సినిమా 100 రోజులు ఆడింది. ఉత్తమ తెలుగు చలనచిత్రంగా జాతీయ అవార్డు కూడా గెలుచుకుంది.

తదుపరి సంవత్సరం జనవరి నెలలో 'తల్లా? పెళ్లామా?' చిత్రం విడుదలైంది. ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లేతో పాటు దర్శకత్వం కూడా ఎన్టీఆరే చేశారు. ఈ చిత్రం శతదినోత్సవం జరుపుకుంది. ఎన్‌టీఆర్‌కు మార్గదర్శకుడైన ఎల్.వి.ప్రసాద్ హిందీలో పలు విజయవంతమైన చిత్రాలు తీశారు. 1952లో ఆయన దర్శకత్వం వహించిన విజయా ప్రొడక్షన్స్ వారి సిల్వర్ జూబ్లీ చిత్రం 'పెళ్లి చేసి చూడు'ని 1972లో 'షాదీ కే బాద్' అనే పేరుతో హిందీలో తీశారు. ఆ సినిమా ఫ్లాప్ అయ్యింది. ఆ పరాజయం ఎల్.వి.ప్రసాద్‌ని కుంగదీసింది. ఒకరోజు ఎల్.వి.ప్రసాద్‌ని ఎన్‌టీఆర్ ఆయన ఇంటివద్దనే కలిసి మాటల సందర్భంలో 'తల్లా? పెళ్లామా?' చిత్రాన్ని హిందీలో తీయవచ్చు కదా అని చెప్పారు. ఎల్.వి.ప్రసాద్‌గారు ఆయన సూచనను అంగీకరించి దాన్ని హిందీలో 'బిదాయీ' పేరుతో సినిమా తీశారు. అది హిట్టయ్యింది. "హైదరాబాద్ నవరంగ్ థియేటర్లో 'బిదాయీ' సినిమా చూస్తున్న ఓ ప్రేక్షకుడు 'ఇది నా కథే' అని తలబాదుకుంటూ ఏడ్చాడు. ఆ ఇతివృత్తంతో ప్రేక్షకులు అంతగా కనెక్ట్ అయ్యారు. అందుకే ఆ సినిమా విజయాన్ని సాధించింది" అని ఎల్.వి.ప్రసాద్ తనయుడు రమేష్‌ప్రసాద్ చెప్పారు. 'బిదాయీ' సినిమా కథకుడుగా ఎన్‌టీఆర్‌కు ఉత్తమ కథా రచయితగా ఫిలింఫేర్ అవార్డు వచ్చింది.

1971 డిసెంబర్ 24వ తేదీన 'శ్రీకృష్ణ సత్య' విడుదలైంది. అందులో ఎన్టీఆర్ శ్రీకృష్ణునిగానూ, రామునిగానూ నటించారు. సత్యభామగా, చంద్రసేనగా జయలలిత నటించారు. ఈ చిత్రంలోని నటనకు ఆమెకు ఫిలింఫేర్ ఉత్తమనటి అవార్డు దక్కింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ సినిమాను ఉత్తమ చిత్రంగా ఎన్నికచేసి నంది అవార్డును బహూకరించింది.

'శ్రీకృష్ణ సత్య'కు దర్శకునిగా కె.వి.రెడ్డి పేరును అధికారికంగా ప్రకటించారు. కానీ 1970 నాటికే కె.వి.రెడ్డి డయాబెటిస్ (మధుమేహం) వల్ల వచ్చిన సమస్యలతో తీవ్రంగా జబ్బుపడివున్నారు. ఆయన కంటిచూపు కూడా తగ్గింది. 'హరిశ్చంద్ర', 'ఉమాచండీ గౌరీ శంకరుల కథ' చిత్రాలు వరుసగా పరాజయం పాలైన తరువాత విజయా ప్రొడక్షన్స్ నాగిరెడ్డి–చక్రపాణిలు తమ సంస్థలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న నెలజీతాల మీద పనిచేస్తున్న రచయిత పింగళి నాగేంద్రరావు, కళాదర్శకులు గోఖలే, కళాధర్‌లు, వారి అసిస్టెంట్స్‌తో సహా అందరికీ ఉద్వాసన పలికారు.

కె.వి.రెడ్డి తీసిన సినిమాలు విజయవంతం కాకపోవడం వల్లనే నాగిరెడ్డి–చక్రపాణిలు అలా చేశారని సినిమా పరిశ్రమ అంతా చెప్పుకున్నారు. కె.వి.రెడ్డిగారికి తన సహాయకులను అలా ఇంటికి పంపించివేయడం బాధ కలిగించింది. ఆయనకు ఉపశమనం కలిగిద్దామని ఎన్టీఆర్ కె.వి.రెడ్డిగారి ఇంటికి వెళ్లి ఆయన అభిమాన రచయిత పింగళి నాగేంద్రరావు స్క్రిప్టు తయారుచేసిన 'శ్రీకృష్ణ సత్య' లేదా 'చాణక్య చంద్రగుప్త' సినిమాని తమ సొంత సంస్థకు తీసిపెట్టమని ఆయనను కోరారు. ఎన్టీఆర్ మాట రెడ్డిగారికి నైతికబలం చేకూర్చింది. "శ్రీకృష్ణ సత్య చేస్తాను రామారావ్. ఒక విజయవంతమైన సినిమా తీశానన్న తృప్తితో నేను ఆనందంగా రిటైర్ అవుతాను" అని రెడ్డి ఎన్టీఆర్‌తో అన్నారని డి.వి.నరసరాజు చెప్పారు.

తెలుగు సినీ పరిశ్రమతో బాగా పరిచయం ఉన్నవారు చెప్పుకునే కథనం ప్రకారం కె.వి.రెడ్డి తన కొడుకును చదువుకోసం అమెరికా పంపించడానికి చేబదులు కోసమని ఎన్టీఆర్ వద్దకు వెళ్లారు. ఆయనకు అవసరమైన నలభై వేల రూపాయలను ఎన్టీఆర్ ఆయన చేతిలో అప్పటికప్పుడు పెట్టారు. పైకం తిరిగి చెల్లించే విషయాన్ని గురించి రెడ్డి మాట్లాడుతున్నప్పుడు ఎన్టీఆర్ ఆయనతో దాని గురించి ఆలోచించవద్దని చెప్పారు. కానీ కె.వి.రెడ్డి వంటి ఆత్మాభిమానం ఉన్న వ్యక్తి ఒకరికి రుణగ్రస్థుడవటం ఇష్టపడరని ఎన్టీఆర్‌కి తెలుసు. అందుకే ఎన్టీఆర్ ఆయనను తనకోసం ఓ సినిమాకు దర్శకత్వం చేయమని అడిగి ఆ నలభై వేలు దర్శకునిగా ఆయనకు ఇవ్వబోయే పారితోషికం అడ్వాన్సుగా భావించమని చెప్పారు. రెడ్డిగారు 'శ్రీకృష్ణ సత్య' చేస్తానన్నారు. 'శ్రీకృష్ణ సత్య' షూటింగ్ జరుగుతున్నప్పుడు కె.వి.రెడ్డి అప్పుడప్పుడూ సెట్టులో కూర్చునేవారు కాని ఎన్టీఆరే చిత్రీకరణ చేశారు. దర్శకునిగా కె.వి.రెడ్డిగారికి మూడు లక్షలు పారితోషికంగా చెల్లించారు. సినిమా పరిశ్రమలోని చాలామంది చెప్పే తెర వెనుక విషయం ఇది.

కానీ కె.వి.రెడ్డి గారి జీవిత కథ పుస్తకం విడుదల సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో కె.వి.రెడ్డి కుమారుడు సినిమా పరిశ్రమలో ప్రచారంలో ఉన్న కథను ఖండించారు. ఆయన కథనం ప్రకారం 1970 మే నెలలో ఒకరోజున తమ ఇంటినుంచి రెండు వీధుల అవతల ఉంటున్న ఎన్‌టీఆర్ వద్దకు తన తండ్రి వెళ్లారు. కబుర్లు చెప్పుకుంటున్న సమయంలో తన కుమారుడు ఐఐటి పూర్తి చేశాడని, అమెరికా వెళ్లాలనుకుంటున్నాడని ఎన్‌టీఆర్‌తో చెప్పారు. కాని అలా పంపడం తనకు ఇష్టం లేదని చెప్పారు. దీనికి ఎన్‌టీఆర్ మన కుటుంబాల్లో ఇంతవరకు ఎవరూ అమెరికా వెళ్లలేదు కనుక అతనికి వెళ్లేందుకు అనుమతి ఇవ్వమని చెప్పారు. కె.వి.రెడ్డి అంగీకరించే వరకు ఎన్‌టీఆర్ నచ్చజెప్పారు. ఆయన చేతిలో ఇరవైవేల రూపాయలు ఉంచి, ఆ రొక్కం తనకోసం ఓ సినిమా చేసిపెట్టేందుకు అడ్వాన్సుగా భావించమని చెప్పారు. ఇది జరుగుతున్నప్పుడు తాను అక్కడే ఉన్నానని, మిగతావారు చెప్పుకునేదంతా అసంబద్ధమేనని రెడ్డిగారి కుమారుడు చెప్పారు. అతని తరువాత అదే వేదికపై నుంచి మాట్లాడిన ఒకరిద్దరు ఆయన మాటలతో విభేదించారు. పరిశ్రమలో చెప్పుకుంటున్నదే నిజమని చెప్పారు.



నిర్మాతగా కె.వి.రెడ్డి నష్టపోయారు. ఆయన దర్శకత్వం వహించిన సినిమాలు పరాజయం పాలయ్యాయి. అది వాస్తవం. నాగిరెడ్డి–చక్రపాణిలు ఆయనంటే నిర్దయతో ప్రవర్తించారు. ఆయన ఆరోగ్యం కుదురుగా లేదు. మధుమేహం, రక్తపోటు అధికంగా ఉండేవి. ఆయన కంటిచూపు కూడా తీవ్రంగా బలహీనపడింది. అందువల్ల ఆ సమయంలో ఆయన సినిమాకు దర్శకత్వం వహించే స్థితిలో లేరు. కె.వి.రెడ్డి గారిని ఎన్‌టీఆర్ గురువుగా గౌరవించేవారనే విషయం రహస్యమేమీ కాదు. ఆర్థికంగా చితికిపోయినా అభిమానధనులైన రెడ్డిగారు దేహీ అని చెయ్యిచాపరని కూడా ఎన్‌టీఆర్‌కి బాగా తెలుసు. కె.వి.రెడ్డిగారికి కొంచెం సాయం చేసి ఆయనకు మనోధైర్యాన్ని ఇవ్వాలని ఎన్‌టీఆర్ భావించి ఉండవచ్చు. అందువల్లనే పని మొత్తం తానే చేసుకున్నా, కె.వి.రెడ్డి గారిని అధికారికంగా దర్శకునిగా ప్రకటించి ఆయనను ఎన్‌టీఆర్ సంతోషపెట్టారు. సినిమా షూటింగ్ జరుగుతున్నప్పుడు కె.వి.రెడ్డిగారి సూచనలు ఎన్‌టీఆర్ తీసుకుని ఉండవచ్చు. షూటింగ్

జరుగున్నప్పుడు కె.వి.రెడ్డి వస్తే సెట్టులో ఆయనను నిస్సందేహంగా డైరెక్టర్ కుర్చీలోనే కూర్చోబెట్టి ఉంటారు. అది ఎన్‌టీఆర్ సంస్కారం.

ఎన్‌టీఆర్ తమ సెట్లో జర్నలిస్టులను అనుమతించేవారు కాదు. ఇది జర్నలిస్టులకు తెలుసు. సినిమా పరిశ్రమలో అందరికీ తెలుసు. కాని ఈ విషయం 'శ్రీకృష్ణ సత్య' సినిమాలో నటిస్తున్న జయలలితకు తెలియదు. ఒకసారి జర్నలిస్టు బి.కె.ఈశ్వర్ ఆమెను ఇంటర్వ్యూ ఇమ్మని అడిగారు. ఆమె అందుకు ఒప్పుకుని వాహినీ స్టూడియోలో 'శ్రీకృష్ణ సత్య' సెట్టు వద్దకు రమ్మని చెప్పారు. ఎన్‌టీఆర్ సెట్లో జర్నలిస్టులకు అనుమతి ఉండదని ఆయనకు తెలిసినా, అలాగేనని ఆమెను సెట్ వద్ద కలుస్తానని ఆయన చెప్పారు.

ఆమె ఇంటర్వ్యూ ఇవ్వడమే మహద్భాగ్యం. ఆ అవకాశం జారవిడిస్తే ఆమె ఇంకొకసారి ఇంటర్వ్యూ ఇచ్చే అవకాశం లేదు. అందుకే భగవంతునిపై భారంవేసి ఆమె చెప్పిన టైంకు ముందే ఆయన ఆయన స్టూడియోకి వెళ్లి సెట్‌లోకి వెళ్తూంటే ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ అడ్డు చెప్పారు. జయలలిత ఇంటర్వ్యూ ఇవ్వడానికి అనుమతించారని చెప్పినా ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ వినలేదు. వారిద్దరి మధ్య జరుగున్న తతంగం చూసిన జయలలిత మేకప్ అసిస్టెంట్, ఒక రూంలో మేకప్ అవుతున్న జయలలిత వద్దకు వెళ్లారు. ఇచ్చిన సమయానికి ఈశ్వర్ ఎందుకు రాలేదో ఆమెకు చెప్పారు. అది విన్న జయలలిత రోషంతో బడబాగ్ని అయ్యారు.

ఇంతలో జయలలితపై తీయవలసిన షాట్ సిద్ధమయింది. ఆమెను సెట్‌కి రమ్మని కబురుపెట్టారు. ఆమె రాలేదు. ఎన్‌టీఆర్ ఫ్లోర్‌లో అసహనంగా వేచిచూస్తున్నారు. ఆమె అసాధారణ ప్రవర్తనకు కారణమేమిటో ఆయనకు తెలియదు. కానీ ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ ఎందుకు అలా జరుగుతోందో పసిగట్టి వెంటనే ఎన్‌టీఆర్ వద్దకు వెళ్లి జరిగినదంతా ఆయనకు చెప్పారు. ఎన్‌టీఆర్‌కు పరిస్థితి అర్థమయ్యింది. ఆయన రాజీపడ్డారు. ఆమె అలక ఫలించింది. షూటింగుకు అంతరాయం కలగకూడదని కొద్దిసేపు ఎన్‌టీఆర్ ఆలోచించి సందర్భానుసారంగా ప్రొడక్షన్ అసిస్టెంటును తప్పుబట్టారు. "ఆయన ఆమెకు అతిథి. ఆయనను ఆపడానికి మనకేం అధికారం ఉంది? ముందు మేడంకి క్షమాపణ చెప్పండి" అన్నారు. జయలలిత శాంతించారు. మళ్లీ సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి. ఎన్‌టీఆర్ సుదీర్ఘకాలంగా పాటిస్తూ వస్తున్న సంప్రదాయాన్ని విడిచిపెట్టి ఒక ప్రెస్ రిపోర్టర్‌ను తన సెట్టులోకి అనుమతించిన ఈ సంఘటన అరుదైనది. ఇది మొదటిసారి. బహుశా చివరిసారి కూడా.

కాకతాళీయంగా జయలలితే కాక ఆమె తల్లి సంధ్య కూడా ఎన్‌టీఆర్ వేసిన కృష్ణ పాత్రకు జంటగా నటించారు. ఎన్‌టీఆర్ తొలిసారి 1957లో పూర్తిస్థాయిలో శ్రీకృష్ణునిగా నటించిన 'మాయాబజార్' సినిమాలో జయలలిత తల్లి సంధ్య శ్రీకృష్ణుని భార్య రుక్మిణిగా నటించింది. 1971లో విడుదలైన 'శ్రీకృష్ణ సత్య' సినిమాలో ఎన్‌టీఆర్ శ్రీకృష్ణునిగా, జయలలిత సత్యభామగా నటించారు. ఆ రెండు సినిమాలకూ కె.వి.రెడ్డిగారే దర్శకుడు.

'తాతమ్మ కల' ఒక విభిన్నమైన సినిమా. ఆ కథను ఎన్‌టీఆర్ రాశారు. ద్విపాత్రాభినయం చేయడంతో పాటు దర్శకత్వం కూడా చేపట్టారు. ఎన్‌టీఆర్ కుమారులు




హరికృష్ణ, బాలకృష్ణ ముఖ్యపాత్రలు పోషించారు. ఈ సినిమాతోనే బాలకృష్ణ తన 14వ ఏట సినీరంగంలోకి అడుగుపెట్టారు. ఈ సినిమా ఇతివృత్తం రైతు సంక్షేమం. చిత్రంలో కథానుగుణంగా ఎన్టీఆర్ బహుకుటుంబీకుడు. నలుగురు కొడుకులు, ఒక కూతురుకు తండ్రి. కుటుంబ నియంత్రణ పథకాన్ని ఉద్యమస్థాయిలో ప్రభుత్వం అమలుచేస్తున్న రోజులవి. ఆ సమయంలో 'తాతమ్మ కల' సినిమాలో కుటుంబనియంత్రణ గురించి భానుమతి కొన్ని సంభాషణలు వల్లిస్తారు. ఆనాడు తల్లిదండ్రులు కుటుంబనియంత్రణ పాటించి ఉంటే ఎనిమిదో సంతానంగా శ్రీకృష్ణుడు, ఆరో సంతానంగా గాంధీ పుట్టేవారా అని ఆ పాత్ర ప్రశ్నిస్తుంది.

1974 ఆగస్టు 30వ తేదీన విడుదలైన ఈ సినిమా బాక్స్ ఆఫీసు వసూళ్లు పరవాలేదనిపించాయి. కానీ సినిమాలో కుటుంబనియంత్రణపై చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశాలయ్యాయి. అసెంబ్లీలో సైతం ఆ సంగతి చర్చకు వచ్చింది. ప్రభుత్వం సినిమాను నిషేధించబోతోందని వార్తలు వ్యాపించడంతో వాతావరణం వేడెక్కింది. సినిమా 50 రోజులు ప్రదర్శితమైన తరువాత ఎన్‌టీఆర్ తాను అనుకున్న అంశం జనానికి సరిగా చేరలేదని భావించి తనంత తానుగా థియేటర్ల నుంచి సినిమాను ఉపసంహరించుకుంటున్నానని పత్రికాముఖంగా ప్రకటించారు. తరువాత కొన్ని మార్పులు చేర్పులతో సినిమాను మరోమారు 1975 జనవరి 8న విడుదల చేశారు.

తొలిసారి విడుదలైనపుడు తాతమ్మ మొగుడు దేశాలు పట్టుకుపోయాడని చూపించారు. రెండోసారి తాతమ్మ మొగుడు దేశాలు తిరిగి మళ్ళీ ఇంటికి చేరేలా చిత్రీకరించారు. ఈ చిత్రం ఇలా రెండుసార్లు విడుదల కావడం ఆ రోజుల్లో విశేషంగా చర్చించుకున్నారు. విడుదలైన నాలుగు నెలల తరువాత ఇతివృత్తాన్ని పాక్షికంగా మార్చి, షూటింగ్ చేసి చిత్రాన్ని మళ్లీ విడుదల చేసిన చిత్రం తెలుగు సినిమా చరిత్రలో ఇదొక్కటే. రైతుల సమస్యలను చక్కగా చర్చించినందుకు ఈ సినిమాకు ఎన్‌టీఆర్ ఉత్తమ కథారచయితగా రాష్ట్రప్రభుత్వం అవార్డు పొందారు.

తరువాత ఎన్‌టీఆర్ 'దాన వీర శూర కర్ణ' రూపొందించారు. రామకృష్ణా సినీ స్టూడియోను 1976 జూన్ 7వ తేదీన ప్రారంభించిన తరువాత అక్కడ నిర్మితమైన మొదటి సినిమా ఇది. ఈ సందర్భంగా ఎన్‌టీర్ పత్రికల్లో పూర్తి పేజీ ప్రకటన ఇచ్చారు. ఈ స్టూడియోను నటునిగా తాను సంపాదించిన సొమ్ముతో (నట కృషితో) నిర్మించానని ఎన్‌టీఆర్ సగర్వంగా ప్రకటించారు. రామకృష్ణా స్టూడియో ప్రారంభోత్సవం కొత్తపుంతలు తొక్కింది. తనను సినిమాలకు పరిచయం చేసిన ఎల్.వి.ప్రసాద్ గారి చేతుల మీదుగా స్టూడియో ప్రారంభం జరిగింది. తనను సూపర్ స్టార్ చేసిన విజయా వారి బి.నాగిరెడ్డి కెమెరా స్విచ్చాన్ చేశారు.



తన స్నేహితుడు, మార్గదర్శకుడు ఎంజీఆర్ తొలి క్లాప్ ఇచ్చారు. అప్పటి ముఖ్యమంత్రి వెంగళరావు అధ్యక్షత వహించారు. 1976 జనవరి 14వ తేదీన అన్నపూర్ణా స్టూడియోస్ ప్రారంభోత్సవానికి అప్పటి రాష్ట్రపతి ఫక్రుద్దీన్ ఆలీ అహమ్మద్ ముఖ్య అతిథి. రెండు స్టూడియోల ప్రారంభోత్సవాల మధ్యనున్న అంతరాన్ని అందరూ పసిగట్టారు.

'దాన వీర శూర కర్ణ' చిత్రానికి సంగీత దర్శకులు సాలూరు రాజేశ్వరరావు 'ఏ తల్లి కన్నదో నిను..' పాటను స్వరపరిచారు. మరొక పాట కోసం ఎన్‌టీఆర్ ఏదో స్వరాన్ని సూచించగా ఆయన అలిగి వెళ్లిపోయారు. 'సీతారామ కల్యాణం' సినిమాకు పాటలు స్వరపరుస్తున్నప్పుడు కూడా ఇలాగే జరిగింది. సాలూరు రాజేశ్వరరావు సంగీత సరస్వతే గాని లౌక్యం ఎరుగరు. ఆయనది రాజీ తెలియని ఆభిజాత్యం.

హేతువాది అయిన కొండవీటి వెంకటకవి 'దాన వీర శూర కర్ణ' సినిమాకు మాటలు సమకూర్చారు. మహాభారతంలో కర్ణుడి పాత్ర ఉదాత్తమైనది. ఆ పాత్ర ఔచిత్యాన్ని, గొప్పతనాన్ని సామాన్యులకు సైతం అర్థమయ్యేలా తీర్చిదిద్దారు ఎన్‌టీఆర్. సుయోధనుడుగా మరోసారి తనకు తానే సాటి అని ఎన్‌టీఆర్ నిరూపించారు. ముఖ్యంగా విలువిద్యా ప్రదర్శనలో కర్ణుడి పుట్టుకను ప్రశ్నించి అతన్ని అవమానించినవారి జన్మరహస్యాలనే కాక తన జన్మ వృత్తాంతాన్ని కూడా బయటపెట్టి అందర్నీ ఎండగట్టిన సన్నివేశంలో ఎన్‌టీఆర్ హావభావాలు, మాట విరుపులూ అనన్యసామాన్యం. 'ఏమంటివి, ఏమంటివి?' అనే ప్రశ్నతో ప్రారంభించి అద్భుతమైన స్వరభేదాలను ప్రదర్శిస్తూ ఎన్‌టీఆర్ పలికిన సుదీర్ఘ ప్రబోధాత్మక డైలాగుల ఆడియో క్యాసెట్లు కొన్ని లక్షలు అమ్ముడుపోయాయి. సినిమా నాలుగు దశాబ్దాల క్రిందట రూపొందించినా గానీ సోషల్ మీడియాలోనూ, టెలివిజన్‌లో నేటికీ అత్యధికంగా వీక్షిస్తున్న సన్నివేశాలు, వింటున్న డైలాగులు ఇందులోనివే అని చెప్పవచ్చు.

ఎన్‌టీఆర్ ఈ సినిమా స్క్రిప్టు పనిపై ఉన్నప్పుడే హీరో కృష్ణ 'కురుక్షేత్రం' నిర్మించబోతున్నారనే వార్త పరిశ్రమలో గుప్పుమంది. ఆ వార్త ఎన్‌టీఆర్ చెవిన కూడా పడింది. తన పట్ల ఎంతో గౌరవంగా మెలిగే కృష్ణ తన సినిమాకు పోటీగా అదే ఇతివృత్తంతో సినిమా తీస్తున్నారన్న వార్త విని ఎన్‌టీఆర్ ఆశ్చర్యపోయారు. ఎన్‌టీఆర్ కృష్ణను పిలిచి మాట్లాడారు. తాను ఈ సినిమాను నిర్మించడం లేదని, అందులో తాను అర్జునునిగా నటించేందుకు మాత్రమే అంగీకరించానని కృష్ణ తెలిపారు. ఎన్‌టీఆర్ అదే కథను సినిమా తీయబోతున్నారని తనకు అప్పటివరకు తెలియదన్నారు. ఒకే ఇతివృత్తంతో రెండు సినిమాలు రావడం పరిశ్రమకు మేలు కాదని అంగీకరించారు. తరువాత 'కురుక్షేత్రం' నిర్మాత ఎ.ఎస్.ఆర్. ఆంజనేయులును పిలిచి ఆ ప్రాజెక్టు నిలిపివేయమని అడిగారు. అయితే తాను అప్పటికే రూ.15 లక్షలు 'కురుక్షేత్రం' ప్రాజెక్టుపై ఖర్చుపెట్టానని, ఈ దశలో సినిమా నిలిచిపోతే అంత పెద్ద మొత్తం నష్టం భరించడం తనవల్ల కాదని ఆయన తేల్చి చెప్పారు. దీంతో కృష్ణ

ఇరుకున పడ్డారు. ఆయన మళ్లీ ఎన్‌టీఆర్ వద్దకు వెళ్లి పరిస్థితిని వివరించారు. ఎన్‌టీఆర్ వారిని ఇంకేమీ అనలేకపోయారు. 'కురుక్షేత్రం' నిర్మాత శ్రీకృష్ణునిగా నటించమని ఏఎన్నార్‌ను సంప్రదించారు. కానీ అదే ఇతివృత్తంతో ఎన్‌టీఆర్ సినిమా తీయబోతున్నారని తెలిసి ఏఎన్నార్ తిరస్కరించారు. చివరకు ఆ పాత్ర పోషించేందుకు శోభన్ బాబు సిద్ధపడ్డారు. ఎన్‌టీఆర్ ఒకసారి శోభన్ బాబును తనవద్దకు పిలిపించుకుని, ఆ సినిమాలో నటించవద్దని చెప్పారు. అయితే తాను నిర్మాత వద్ద నుంచి అడ్వాన్స్ తీసుకున్నానని శోభన్ బాబు చెప్పారు. ఎన్‌టీఆర్ ఆ చర్చను ఇక పొడిగించలేదు.

'కురుక్షేత్రం' భారీ బడ్జెట్ సినిమా. జైపూర్, బెంగళూరుల్లో షూటింగ్ జరుపుకుంది. జైపూర్‌లో యుద్ధ సన్నివేశాలు చిత్రీకరిస్తున్నప్పుడు నిర్మాత ఆర్థిక సమస్యల్లో చిక్కుకున్నారు. అప్పుడు కృష్ణ సహకరించి సహ నిర్మాతగా మారారు. ఎన్‌టీఆర్ కాలంతో పోటీ పడ్డారు. 'కురుక్షేత్రం' సినిమాకు ముందే తన సినిమా విడుదల చేయాలని ఎన్‌టీఆర్ గట్టిగా పట్టుబట్టి శరవేగంగా చిత్రం పూర్తిచేశారు. 'దాన వీర శూర కర్ణ'లో ఆయన శ్రీకృష్ణునిగానూ, ప్రతినాయకుడైన సుయోధనునిగానూ, నాయక ప్రతినాయక ఛాయలు కలబోసిన కర్ణుని పాత్రలోనూ నటించారు. తెలుగు పరిశ్రమలో రాజకీయాలను బాహాటంగా చర్చించిన పౌరాణిక చిత్రం ఇది.

'దాన వీర శూర కర్ణ'లో ఎన్‌టీఆర్ మేకప్ కోసం వేసుకున్న గ్రీజ్ పెయింట్ తొలగించుకోవడానికే రోజూ రెండు గంటలు పట్టేది. సుయోధనుని పాత్రకోసం ప్రతిరోజూ ఉదయాన్నే సెట్టుకు వచ్చినప్పటి నుంచి రాత్రి పొద్దుపోయిన తరువాత ప్యాకప్ చెప్పేవరకు ఆయన మూడు కిలోల బరువైన కిరీటం అలాగే ధరించి ఉండేవారు. ఆ కిరీటం కలిగించిన రాపిడి వల్ల ఆయన నుదుటిపై ఏర్పడిన మచ్చ అలాగే ఉండిపోయింది. చిత్రం షూటింగ్ 43 రోజులు జరిగింది. ఆ సమయంలో ఆయన తెరపైనే కాకుండా తెరవెనుక కూడా అనేక పాత్రలు పోషించారు. నిర్మాతగానే కాకుండా దర్శకునిగా కూడా వ్యవహరించారు. 'దాన వీర శూర కర్ణ' సెట్లపై ఎడతెరిపిలేకుండా షూటింగ్ జరుగుతున్నప్పటికీ వాతావరణం ప్రశాంతంగా ఉండేది. ఎన్‌టీఆర్ ఒక పద్ధతి ప్రకారం చాలా వేగంగా సినిమాలు తీస్తారని పేరు. ప్రత్యేకించి ఈ సినిమా విషయంలో ఆయన అవిశ్రాంతిగా పనిచేసి తనను తాను హింసించుకున్నారని చెప్పవచ్చు. ఒకదశలో ఈ సినిమా షూటింగ్ నిరంతరాయంగా 72 గంటలపాటు కొనసాగింది. ఆయన ప్రతిరోజూ రషెస్ చూసేవారు కాదు. చిత్రం షూటింగు అయిపోయిన తరువాత ఎడిటింగ్ టేబిల్‌పై మాత్రమే చిత్రాన్ని చూసుకునేవారు. ఒకే ఒక వ్యక్తి బహుపాత్రలు ధరిస్తూనే తెరవెనుక కూడా అనేక పాత్రలు పోషిస్తూ కేవలం 43 రోజుల్లో ఈ సినిమా రూపొందించారంటే ఆశ్చర్యం కలుగుతుంది. రైతుకవి కొసరాజు చెప్పినట్లు ప్రపంచ సినీచరిత్రలో సినిమా గురించి 'అ' నుంచి 'హ' వరకూ వరకూ క్షుణ్ణంగా

తెలిసిన ఒకే ఒక వ్యక్తి ఎన్‌టీఆర్ కావడం వల్ల అటువంటి అసాధారణ కార్యాన్ని సాధించగలిగారు.

'దాన వీర శూర కర్ణ' నిడివి 4 గంటల 17 నిమిషాలు. రాజ్ కపూర్ తీసిన 'మేరా నామ్ జోకర్' కూడా పెద్ద సినిమానే. అది 4 గంటల 24 నిమిషాల నిడివి కలిగిన సినిమా. కానీ మొదటి వారం తరువాత ఆ సినిమా 40 నిమిషాలు తగ్గించారు. అందువల్ల 'దాన వీర శూర కర్ణ' ఎక్కువ నిడివి కలిగిన సినిమాగా రికార్డు సృష్టించింది. ఆ రికార్డును 1987లో వచ్చిన 'తమస్' సినిమా అధిగమించింది.

ముగ్గురు కథానాయికలతో రూపొందిన రాజ్ కపూర్ సినిమా 'మేరా నామ్ జోకర్' ఆర్థికంగా పరాజయం పాలైంది. కానీ ఎన్‌టీఆర్ మూడు పాత్రల్లో నాలుగు గంటలపాటు తానే అంతటా కనిపిస్తూ నటించిన 'దాన వీర శూర కర్ణ' ఆర్థికంగా విజయవంతమైంది.

1977 జనవరి 14న విడుదలైన ఈ సినిమా ఘనవిజయం సాధించింది. 'లవకుశ' కోటి రూపాయలు వసూలు చేసిన మొదటి తెలుగు చిత్రం కాగా, 'దాన వీర శూర కర్ణ' సినిమా రెండు కోట్ల రూపాయల గ్రాస్ వసూలు చేసి రికార్డు సృష్టించింది. ఈ సినిమా పెట్టుబడి సుమారు పది లక్షలు మాత్రమే.

ఈ సినిమా చూసిన తరువాత గొల్లపూడి మారుతీరావు మాట్లాడుతూ "ప్రపంచ సినిమా చరిత్రలో జూలియస్ సీజర్‌గా రెక్స్ హారిసన్, అక్బర్‌గా పృథ్వీరాజ్ కపూర్, సుయోధనునిగా ఎన్‌టీఆర్ అసమానంగా నటించారు. వారితో సరిపోల్చదగిన వారెవరూ లేరు" అని వ్యాఖ్యానించారు.

1963లో విడుదలైన 'శ్రీకృష్ణార్జున యుద్ధం' చిత్రం తరువాత దాదాపు 14 సంవత్సరాలు ఎన్‌టీఆర్, ఏఎన్నార్ కలిసి నటించలేదు. ఎన్‌టీఆర్ వద్ద చాలా సంవత్సరాలుగా 'చాణక్య చంద్రగుప్త' సినిమా స్క్రిప్టు ఉంది. అందులో తానే చాణక్యునిగా నటించాలనుకున్నారు ఎన్‌టీఆర్. కానీ ఆయన ఉదారంగా రెండింటిలో ఏదో ఒక పాత్రను ఎంచుకోమని ఏఎన్నార్‌ను అడగగా ఆయన చాణక్య పాత్రను ఎంపిక చేసుకున్నారు. చాణక్య పాత్ర ఎన్‌టీఆర్‌కు ఎంతో



ఇష్టమైనది. కానీ ఆయన ఆ పాత్రను వదులుకున్నారు. ఈ సినిమా ముహూర్తం సందర్భంలో ఎన్‌టీఆర్ మాట్లాడుతూ "ఈ సినిమాలో చాణక్య పాత్ర కీలకమైనది. ఈ సినిమాలో నాకంటే బ్రదర్‌కే ఎక్కువ పేరు రావాలని చాణక్య పాత్రను ఆయనను

వేయమని కోరాను. ఇప్పుడు దర్శకుడుగా నా బాధ్యత మరింత పెరిగింది. బ్రదర్ ఏఎన్నార్ దేవదాసుగా నటించి గొప్ప కీర్తిని సాధించారు. ఇప్పుడు ఈ చాణక్య పాత్ర ద్వారా ఆయనకు మరింత పేరు ప్రఖ్యాతులు రావాలన్నది నా కోరిక. అందుకు దర్శకునిగా నా వంతు కృషి చేస్తాను" అని చెప్పారు. 'చాణక్య చంద్రగుప్త'లో అలెగ్జాండర్ పాత్ర శివాజీ గణేశన్ పోషించారు.


ఎన్‌టీఆర్ కుమారుడు బాలకృష్ణ తాను చంద్రగుప్తునిగా, ఎన్‌టీఆర్ చాణక్యునిగా నటించాలని ఉవ్విళ్లూరారు. కానీ ఆ సినిమాను ఏఎన్నార్‌తోనే రూపొందించాలని ఎన్‌టీఆర్ అనుకున్నారు. 1977 ఆగస్టు 25వ తేదీన విడుదలైన ఆ సినిమా ఆర్థికంగా విజయం సాధించలేదు. "నటీనటుల ఎంపిక తప్పిదం కారణంగా సినిమా పరాజయం పొందింది" అని ఎన్‌టీఆర్ కుమారుడు బాలకృష్ణ అన్నారు.

1978లో ఎన్‌టీఆర్ దర్శక నిర్మాతగా 'శ్రీరామ పట్టాభిషేకం' వచ్చింది. ఇందులో ఎన్‌టీఆర్ రామ రావణ పాత్రలను పోషించారు. 1961లో 'సీతారామ కల్యాణం' తీసినప్పుడు ఆ సినిమాకు సహ నిర్మాత, సోదరుడు త్రివిక్రమరావు రామునిగా కూడా నటించమని ఆయనపై ఒత్తిడి తీసుకువచ్చినా ఎన్‌టీఆర్ అంగీకరించలేదు. అప్పట్లో తనకంటే వయసులో చిన్నవాణ్ణి ఇరవై ఏళ్ల హరనాథ్‌ను రాముని పాత్రకు ఎంపిక చేసుకున్నారు. కానీ దాదాపు రెండు దశాబ్దాల తరువాత 'శ్రీరామ పట్టాభిషేకం' సినిమా తీసేనాటికి రామునిగా తనను తప్ప ప్రేక్షకులు ఇంకొక నటుణ్ణి హర్షించరన్న దశకు చేరుకున్నారు ఎన్‌టీఆర్. 1978లో విడుదలైన ఈ సినిమా విజయం సాధించలేదు.

1979 మే 9న ఎన్‌టీఆర్ దర్శకత్వంలో 'సలీం అక్బర్ అనార్కలి' వచ్చింది. ఆయన అక్బర్‌గా నటించగా బాలకృష్ణ సలీం పాత్ర పోషించారు. సి. రామచంద్ర సంగీత దర్శకుడు కావడం, మహమ్మద్ రఫీ పాటలు పాడడం ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సినిమా ప్రేక్షకాదరణకు నోచుకోలేదు.

1979 మే 29న ఎన్‌టీఆర్ దర్శకత్వం వహించడంతో పాటు శ్రీకృష్ణ, అర్జున, బృహన్నల, సుయోధన, కీచక పాత్రలను పోషించిన 'శ్రీమద్విరాట పర్వం' విడుదలైంది. ఇది వంద రోజులు ఆడినా, ఆర్థికంగా విజయం సాధించలేదు. 1979 సెప్టెంబర్ 28వ తేదీన జయసుధ, జయప్రద కథానాయికలుగా ఆయన దర్శకత్వంలో 'శ్రీతిరుపతి వేంకటేశ్వర కల్యాణం' విడుదలైంది. ఇది కూడా 100 రోజులు ఆడినా హిట్టవ్వలేదు.

1981లో ఎన్‌టీఆర్ నిర్మాణ దర్శకత్వంలో వచ్చిన 'వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర' సినిమా ఆయన రాజకీయ జీవితానికి ఒక రూపాన్నివ్వడంలో కీలక పాత్ర పోషించింది. ఈ సినిమా సుదీర్ఘమైన ఉపోద్ఘాతంతో మొదలవుతుంది. అందులో బుద్ధుడు, ఆదిశంకరాచార్య, రామానుజుడు, వేమనల బోధనలను స్థూలంగా తెలుపుతూ వీరబ్రహ్మేంద్రస్వామి కూడా అదేకోవకు చెందిన మహనీయుడుగా పరిచయం చేశారు. ఈ పాత్రలన్నింటినీ ఎన్‌టీఆర్



పోషించారు. ఈ వరుసలోని మొదటి మూడు పాత్రలు తెరపై కొద్దిసేపు మాత్రమే కనిపిస్తాయి. వేమన తెలుగువాడు. ఆయన పద్యాలు, ప్రబోధాలు తెలుగునేలపై పండిత పామరులందరికీ బాగా తెలిసినవి. కనుక ఆయన కథను మాత్రం పదిహేను నిమిషాలపాటు చూపించారు. ఆ తరువాత కాలజ్ఞానవేత్త అయిన వీరబ్రహ్మేంద్ర స్వామి అసలు కథ మొదలవుతుంది. వీరబ్రహ్మేంద్రులను సంఘసంస్కర్తగానూ, భవిష్యత్తును దర్శించిన కాలజ్ఞానవేత్తగానూ ఎన్‌టీఆర్ తీర్చిదిద్దారు. నటులు రాజ్యాలు పాలిస్తారని ఆయన చెప్పిన జోస్యాల్లో ఒకటి. ఆ తత్త్వాన్ని స్వామి పాడుతుండగా సినిమాలో ఎంజీఆర్, రొనాల్డ్ రీగన్ బొమ్మలు చూపించారు. ఆ వరుసలో తరువాత ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఎన్‌టీఆర్ ప్రవేశించబోతున్నారన్న సూచన ఏదీ లేదు.

ఎన్‌టీఆర్ వేమనగా కనిపించిన భాగంలో ఓ సన్నివేశం గురించి ప్రత్యేకంగా చెప్పాలి. వదిన ముక్కుపుడకను వేశ్యకు ఇవ్వాలని వేమన కోరుకుంటాడు. అప్పుడామె వివస్త్రయై, వెనక్కు వంగి కాళ్లు రెండూ ఎడంగా జాపి వేమనను చూస్తుంది. అది చూసి విరక్తితో వేమన యోగిగా మారిపోతాడు. సెన్సార్ బోర్డు ఆ సన్నివేశానికి అభ్యంతరం చెప్పి, పూర్తిగా తొలగించమంది. కానీ ఆ సన్నివేశం వేమన జీవితంలో అతి కీలకమైనదని, దానిలో ఏమాత్రం అసభ్యత లేదని ఎన్‌టీఆర్ భావించారు. అలాగే వీరబ్రహ్మేంద్ర స్వామి చెప్పిన తత్త్వాల నేపథ్యంలో చూపించిన తమిళనాడు ముఖ్యమంత్రిగా ఎంజీఆర్, అమెరికా అధ్యక్షుడు రొనాల్డ్ రీగన్ క్లిప్పింగులను కూడా తొలగించాలని సెన్సార్ బోర్డు సూచించింది. దాంతో పాటు మొత్తం తొమ్మిది తొలగింపులు సెన్సారు బోర్డు ప్రతిపాదించింది.

ఎన్‌టీఆర్ వాటికి అంగీకరించలేదు. సెన్సార్ బోర్డు ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయం ఎన్‌టీఆర్‌ను కలత పెట్టింది. ప్రతిపాదించిన కట్స్‌కు కారణాలు చెప్పలేదు. నిర్మాతగా తనకు ఉన్న ప్రాథమిక హక్కు భావప్రకటనా స్వేచ్ఛ. సెన్సార్ బోర్డు నిర్ణయం ఆ హక్కును కాలరాచిందని ఎన్‌టీఆర్ కోర్టులో కేసు వేసారు. చివరికి కోర్టులో ఆయన గెలుపొందారు. ఈ న్యాయపోరాటం కొలిక్కి రావడానికి మూడేళ్లు పట్టింది.


ఎన్‌టీఆర్ ఈ సినిమాను సొంతంగా పంపిణీ చేద్దామనుకున్నారు. కానీ డిస్ట్రిబ్యూటర్ల నుంచి తీవ్రమైన ఒత్తిడి రావడంతో యాభై శాతం హక్కులు రెండున్నర కోట్ల రూపాయలకు అమ్మారు. సినిమా ఆర్థికంగా భారీవిజయం సాధించింది. సిల్వర్ జూబ్లీ జరుపుకుంది.

1983లో ఆయన ద్విపాత్రాభినయంతోపాటు 'చండశాసనుడు' సినిమాకు దర్శకత్వం

వహించారు.

ఆరోజు 'చండశాసనుడు' సినిమా షూటింగ్ చివరి రోజు హైదరాబాదు సమీపంలో దేవరయామిజాల గ్రామంలో జరుగుతోంది. ఎన్‌టీఆర్ ఎడ్లబండిపై విలన్ వెంటబడే సన్నివేశం చిత్రీకరిస్తున్నారు. రావుగోపాలరావు విలన్ పాత్ర పోషిస్తున్నారు. ఆ సన్నివేశం కోసం గుంటూరునుంచి రెండు ఒంగోలు జాతి గిత్తలను తీసుకువచ్చారు. ఎన్‌టీఆర్ బండెక్కి ఒక చేత్తో ఫొటోలో ఉన్న సింహంతల ఉన్న పెద్ద కర్ర పట్టుకుని, రెండో చేత్తో చెర్నాకోలతో గిత్తల్ని అదిలించారు. ఎడ్లు కదం తొక్కడం ప్రారంభించాయి. వాటిముందు విలన్ పరుగెడుతున్నాడు. మధ్యాహ్నం వేళకు కొన్ని షాట్లు చిత్రీకరించారు.

చివరి షాట్ చిత్రీకరణ ప్రారంభించారు. బండి 100 గజాల దూరం పరుగెత్తిందో లేదో రేండో చేతిలో ఉన్న కర్ర చక్రంలో ఇరుక్కుంది. చక్రం పెళపెళమని విరిగిపోయింది.



బండి పట్టుతప్పి ఓ రాయిపై ఎక్కింది. ఎన్‌టీఆర్ బండిలోంచి కిందపడ్డారు. చక్రం ఆయనపై నుంచి దొర్లుకుంటూ వెళ్లింది. క్షణకాలం ఆయన స్పృహ కోల్పోయారు. ఇదంతా రెప్పపాటులో జరిగిపోయింది. యూనిట్ సభ్యులంతా ఎన్‌టీఆర్ వద్దకు పరుగెత్తి, ఆయునను లేవనెత్తడానికి ప్రయత్నించారు. ఆయన స్పృహలోకి వచ్చి ఎవరి సాయమూ లేకుండానే పైకి లేచారు, "ఏం జరిగింది?" అని అడిగారు. రావు గోపాలరావు జరిగినదంతా వివరంగా చెప్పి, "అన్నగారూ! మీకేమైనా జరిగితే ముందు నా గుండె కొట్టుకోవడం ఆగిపోయేది" అన్నారు. అందుకు ఎన్‌టీఆర్ చెప్పిన జవాబు గుర్తుంచుకోదగినది. "మేం అంత తేలికగా చనిపోం బ్రదర్. దేవుడు మాకోసం నిర్ణయించిన లక్ష్యాన్ని పూర్తి చేసేంత వరకు మా కొచ్చిన భయం ఏమీ లేదు. భయపడకండి. మనం షూటింగ్ కొనసాగిద్దాం" అని చెప్పి మళ్లీ షూటింగుకు సిద్ధమయ్యారు ఆ మొండిమనిషి. అందరూ ఆయన వంక దిగ్భ్రమతో చూశారు.

ఎన్‌టీఆర్ అప్పటికే రాజకీయ రంగప్రవేశం చేశారు.

మొత్తంమీద ఎన్‌టీఆర్ పదహారు సినిమాలకు దర్శకత్వం వహించారు. 'శ్రీకృష్ణ సత్య'ను కూడా ఆ ఖాతాలో వేస్తే పదిహేడు అవుతాయి. వీటిలో కొన్ని సినిమాలు నిత్య నూతనంగా విరాజిల్లుతూ తెలుగు సినిమా ఉన్నంతకాలం ఉంటాయి.

# రాజీవ్‌గాంధితో ఒప్పందం

1984 అక్టోబర్ 31. ఢిల్లీలో మామూలుగానే సూర్యోదయం అయింది. కానీ కాసేపటికే ఆకాశం ఎరుపెక్కుతూ ఏదో శకునం చెబుతోంది. ఉదయం 9 గంటలు దాటి అప్పటికి కొద్దిసేపే అయింది. ప్రధానమంత్రి ఇందిరాగాంధి తన నివాసం నుంచి కార్యాలయం వైపు హుందాగా నడుచుకుంటూ వస్తున్నారు. ఆమె నివాసానికి, కార్యాలయానికి మధ్య ఒక వికెట్ గేట్ ఉంది. అక్కడ పీటర్ ఉస్తినోవ్ తన టెలివిజన్ సిబ్బందితో ఆమెను ఇంటర్వ్యూ చేయడానికి వేచివున్నారు. ఆమె ఎప్పుడు బయటకు వెళ్లినా భద్రతా కారణాల దృష్ట్యా బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ ధరించాలి. కానీ ఆ ఉదయం ఆమె టెలివిజన్ ఇంటర్వ్యూలో నాజూగ్గా కనిపించాలనుకుని బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ వేసుకోలేదు. ఆమె వికెట్ గేట్ వద్దకు వచ్చేసరికి ఆమె సెక్యూరిటీ గార్డ్ బియాంత్ సింగ్ తన తుపాకీ పైకెత్తాడు. ఆమె వైపుకు ఎక్కుపెట్టి, గురి చూసి అతడు అయిదు సార్లు గుళ్ళు కాల్చాడు. లాన్‌కు అవతల ఇంకొక సెక్యూరిటీ గార్డు సత్వంత్ సింగ్ ఇందిరాగాంధి దేహంలో ఇరవై అయిదు బుల్లెట్లు దింపాడు. ఆమె కుప్పకూలిపోయారు. అప్పటికప్పుడే ఆమె శ్వాస ఆగిపోయింది. కానీ ఆమె మరణాన్ని అధికారికంగా సాయంత్రం వరకు ప్రకటించలేదు.

ఇందిరాగాంధిపై సెక్యూరిటీ గార్డులు కాల్పులు జరిపారన్న వార్త అందినప్పుడు ఎన్టీఆర్ క్యాబినెట్ సమావేశం నిర్వహిస్తున్నారు. ఆయన దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఆరోజుల్లో హైదరాబాద్ నుంచి ఢిల్లీకి రోజుకి రెండే విమానాలు తిరిగేవి. ఒకటి పొద్దుటి పూట. రెండవది సాయంత్రం. వార్త విన్న వెంటనే ఎన్టీఆర్ ఢిల్లీ వెళ్ళాలనుకున్నారు. కానీ విమాన సర్వీసు లేదు. ఆరోజు అడ్మిరల్ డాసన్ భారతీయ నేవీ వారి ఆవ్రో విమానంలో హైదరాబాద్ వచ్చి ఉన్నారు. ఎన్టీఆర్, గవర్నర్ శంకర్ దయాళ్ శర్మ, మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి ఆ చిన్న విమానంలో హుటాహుటిన ఢిల్లీకి వెళ్లారు. తరువాతి కాలంలో కీలకపాత్ర వహించిన ఇన్స్పెక్టర్ జనరల్ (ఇంటెలిజెన్స్) హెచ్.జె.దొర కూడా ఆరోజున ఆ చిన్న విమానంలో ఎన్‌టీఆర్‌తో ఢిల్లీ వెళ్లారు. ఢిల్లీలో దిగిన తరువాతనే వారికి ఇందిరాగాంధి మరణవార్త తెలిసింది.

రాజీవ్‌గాంధి ఆ సాయంత్రమే ప్రధానమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు.

ఎన్టీఆర్ ఆ రాత్రి 10 గంటలకు దివంగత ప్రధానికి నివాళి అర్పించేందుకు వెళ్లారు. ఇందిరాగాంధి భౌతికదేహాన్ని చూడగానే ఆయన కళ్లనీళ్ల పర్యంతమయ్యారు. మరుసటి రోజున ఆమె మృతదేహాన్ని తీన్‌మూర్తి భవన్‌కు తరలించారు. జాతీయ నాయకులందరూ ఆమెకు నివాళి అర్పించారు. ఎన్టీఆర్ తీన్‌మూర్తి భవన్ వద్దకు కూడా వెళ్ళారు. కాషాయరంగు

దుస్తుల్లో ఉన్న ఎన్‌టీఆర్ అందరి దృష్టినీ ఆకర్షించారు. కొందరు కాంగ్రెస్ మద్దతుదారులు ఎన్టీఆర్‌కి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కొందరు ఆయనను తోశారు. కానీ రాజకీయాలకది సమయం కాదని ఆయన మౌనంగా, గంభీరంగా ఉండి ఆమెకు శ్రద్ధాంజలి ఘటించారు.

నాలుగు రోజుల తరువాత అంత్యక్రియలు నిర్వహించాలని నిర్ణయం. ఎన్టీఆర్ హైదరాబాదుకు తిరిగి వెళ్ళాలన్నారు. ఢిల్లీలో భయానక వాతావరణం నెలకొంది. రౌడీలు, గూండాలు కర్రలు, కత్తులు, బాకులతో షాపులు లూటీచేశారు. విచ్చలవిడిగా ప్రజల్ని దోచుకోవడం మొదలుపెట్టారు. వేలాది అమాయక సిక్కులను ఊచకోత కోశారు. కాంగ్రెస్ మూకలు ఢిల్లీ వీధుల్లో స్వైరవిహారం చేస్తున్నప్పుడు ఎన్టీఆర్‌ను సురక్షితంగా విమానాశ్రయానికి తీసుకుపోవడం ప్రమాదకరమైన సాహసం అయింది. వెనుక సీటులో హెచ్.జె.దొర, ఉపేంద్ర చెరొక వైపు, మధ్యలో ఎన్టీఆర్ కూర్చున్న వారి కారు విమానాశ్రయం వైపు దూసుకువెళ్లింది. అదృష్టవశాత్తూ ఎటువంటి ప్రమాదం జరుగకుండా వారు విమానాశ్రయం చేరారు.

ఒక ముఖ్యమైన పనిపైన దొరను ఢిల్లీలోనే ఉండమన్నారు ఎన్‌టీఆర్. తరువాతి మూడు రోజులు దొర కార్యసాధనకు నడుం బిగించారు. ముందుగా అప్పటి ఇన్వెస్టిగేషన్ బ్యూరో డిప్యూటీ డైరెక్టర్ నరసింహన్‌ను ఆయన కలిశారు. ఆయన ద్వారా బ్యూరో స్పెషల్ డైరెక్టర్ ఎమ్.కె. నారాయణన్‌ను కలిశారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీని రద్దు చేసి మళ్ళీ ఎన్నికలు జరపాలి. దానికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలి. అదీ హెచ్.జె. దొర గారి లక్ష్యం. కానీ అసెంబ్లీని రద్దుచేయాలన్న అభ్యర్థనను తిరస్కరించి, ఎన్టీఆర్ అభ్యర్థన వెనుక ఉన్న కారణాలు బయటికి పొక్కితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. చరిత్ర పునరావృతమై నాదెండ్ల అధికారం చేపట్టవచ్చు. అందువల్ల హెచ్.జె.దొర ఆచితూచి అడుగులు వేసారు. ఎన్‌టీఆర్‌కు న్యాయం జరుగుతుందని ఎమ్.కె.నారాయణన్ హామీ ఇచ్చిన తరువాతనే హెచ్.జె.దొర తాను కార్యార్థినని చెప్పారు. కేంద్రంలో ఏర్పడబోయే ప్రభుత్వంతో ఎన్టీఆర్ ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో స్నేహపాత్రంగా వ్యవహరిస్తారని ఎమ్.కె.నారాయణన్‌కు తెలియచేశారు. అసెంబ్లీ రద్దు ఎందుకని ఎమ్.కె.నారాయణన్ అడిగారు. "ఆగస్టు సంక్షోభం తరువాత ఎన్టీఆర్ మనోవేదనకు గురయ్యారు. కేవలం తనవల్లనే గెలుపొందిన మెజార్టీ శాసనసభ్యులు వ్యతిరేకంగా మారడాన్ని ఆయన జీర్ణించుకోలేక పోతున్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంలో తనతో పాటు నడిచిన ఎమ్మెల్యేలలో చాలామంది ఆయన తమకు రుణపడి ఉన్నారని భావించడం, తమ హక్కుగా అన్నిరకాల ఉపకారాలు ఆయన నుంచి పొందాలని ప్రయత్నించడం ఆయన భరించలేకపోతున్నారు. వారి బెదిరింపు ధోరణితో విసిగిపోయారు. మా ముఖ్యమంత్రి నీతిబద్ధమైన పరిపాలనకు కంకణం కట్టుకున్నారు. ఇప్పుడున్న ఎమ్మెల్యేలు దానికి అడ్డుగా

ఉన్నారు. అందువల్ల ఆయన అసెంబ్లీని రద్దుపరిచి తాజాగా ప్రజాతీర్పు కోరాలని భావిస్తున్నారు'' అని దొర వివరించారు. ఆయన అభ్యర్థన సహేతుకమైనదేనని ఎమ్.కె.నారాయణన్ భావించారు. పార్టీ ఫిరాయింపులు, అవినీతి అంటే రాజీవ్‌గాంధికి కూడా పరమ అసహ్యమని ఆయనకు తెలుసు. ఎన్టీఆర్ అభ్యర్థన గురించి రాజీవ్‌గాంధికి తెలుపుతానని మాట ఇచ్చారు.


ఇందిరాగాంధి అంత్యక్రియల కోసం ఎన్టీఆర్ మళ్లీ ఢిల్లీ వెళ్లారు. తీన్‌మూర్తి భవన్‌కు వెళ్ళి మూడవసారి శ్రద్ధాంజలి ఘటించారు.

హెచ్.జె.దొర రాయబారం ఫలించింది. రాజీవ్‌గాంధితో సంప్రదించిన తరువాత, రాజకీయంగా పరస్పర ప్రయోజనకరంగా ఉండేలా ఈ విషయాన్ని గురించి ఇద్దరు నేతలూ చర్చించాలని, ఒక అవగాహనకు రావాలని ఎమ్.కె.నారాయణన్ సూచించారు.

పార్లమెంటు ఎన్నికలు కొంచెం ముందస్తుగా డిసెంబర్ నెలలో నిర్వహించాలని రాజీవ్‌గాంధి తలచారు. ఎలెక్షన్ కమీషన్ కూడా అందుకు అంగీకరించింది. 1984 నవంబర్ 13వ తేదీన ఈ నిర్ణయం తీసుకున్నారు. నవంబర్ 15వ తేదీన ఎన్నికల ప్రకటన వెలువడింది. డిసెంబర్ 24, డిసెంబర్ 27వ తేదీల్లో లోక్‌సభకు రెండు విడతలుగా ఎన్నికలు జరగబోతున్నాయి. డిసెంబర్ 28న ఓట్ల లెక్కింపు చేపడతారు. నవంబర్ 20వ తేదీన ఎన్నికల షెడ్యూల్ గెజిట్లో విడుదల చేయాల్సిందిగా ఎలెక్షన్ కమీషన్ రాష్ట్రపతికి సిఫారసు చేసింది.

1984 నవంబర్ 14-15 తేదీల్లో తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు తీవ్రమైన తుపానుకు గురయ్యాయి. ముఖ్యంగా నెల్లూరు జిల్లా అతలాకుతలమై పోయింది. నవంబర్ 16వ తేదీన రాజీవ్‌గాంధి మద్రాసుకు వచ్చారు. తమిళనాడు గవర్నర్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ఆయనను విమానాశ్రయంలో కలిశారు. రాజీవ్‌గాంధి, ఎన్టీఆర్ రాజ్‌భవన్‌లో సమావేశమయ్యారు. అసెంబ్లీ రద్దును గురించి వారిద్దరూ చర్చించుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కొన్ని సీట్లను పంచుకునేందుకు ఒప్పుకునేట్లయితే ఎన్టీఆర్ తీసుకోబోయే చర్యకు మద్దతునిస్తానని రాజీవ్‌గాంధి చెప్పారు. ఎన్టీఆర్ అందుకు తన సమ్మతిని తెలియచేశారు. చర్చలు ఫలించాయి. కొన్ని చోట్ల రాజీధోరణితోనూ, కొన్నిచోట్ల సర్దుబాటు ధోరణితోనూ రెండు పార్టీలు పోటీచేయడానికి వారు అంగీకరించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో రాజీవ్‌గాంధి ఏరియల్ సర్వే నిర్వహించారు. ఆ పర్యటనలో ఎన్టీఆర్ రాజీవ్‌గాంధి వెంటనే ఉన్నారు.

ఒప్పందం ప్రకారం ఫిరాయింపుదారులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం చట్టం చేసే విషయంలో తెలుగుదేశం పార్టీ రాజీవ్‌గాంధికి మద్దతు ఇవ్వాలి. పి.వి.నరసింహారావు, పి.శివశంకర్, వెంగళరావులపై గట్టి పోటీ ఉండరాదు. దానికంటే ముఖ్యంగా ఎన్టీఆర్



బయటి రాష్ట్రాలలో ప్రచారం చేయకూడదు. ఎన్‌టీఆర్ అసెంబ్లీ రద్దు ప్రతిపాదనను గవర్నర్ అమోదించాలి. ఇవీ ఒప్పందంలోని ముఖ్యాంశాలు. సీట్ల సర్దుబాటుపై ఇద్దరు నేతల మధ్య ఒప్పందం కుదిరింది అని బహిరంగంగా ఎవరూ చెప్పలేదు. ఉపేంద్రకు కూడా ఈ ఒప్పందం గురించి తెలియదు.

రాజీవ్‌గాంధి, ఎన్టీఆర్ ఒడంబడికకు కారణాలు స్పష్టంగా తెలియవు కానీ అవి వూహకందనివి కావు. ఎమ్మెల్యేల ప్రవర్తన ఎన్‌టీఆర్‌కు కష్టం కల్గించిందన్నది వాస్తవం. కలుపుమొక్కలను ఏరి పారెయ్యాలని ఆయన పట్టుదలతో ఉన్నారు. అసెంబ్లీని రద్దుచేయమన్న తరువాత గవర్నర్ ఒప్పుకోకపోతే అసలుకే మోసం వస్తుంది. అందుకే ఎన్‌టీఆర్ ఒప్పందం కుదుర్చుకున్నారు. 1982లో ఎన్‌టీఆర్ ప్రచారసామర్థ్యం రాజీవ్‌గాంధి ప్రత్యక్షంగా చూశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంలో ప్రతిపక్షాలు సైద్ధాంతిక విభేదాలను విస్మరించి ఒకటిగా ఆయనకు బాసటగా నిలిచాయి. రాబోయే ఎన్నికల్లో ఎన్‌టీఆర్ ప్రతిపక్షాలను కూడగట్టితే తనకు నష్టం కలుగుతుందని రాజీవ్‌గాంధికి తెలుసు. అన్నిటికంటే ముఖ్యంగా రాజకీయాలకు పట్టిన మకిలిని తొలగించాలనే సత్సంకల్పంతో ఉన్న రాజీవ్‌గాంధి ఎన్టీఆర్ అభ్యర్థన వెనుక ఉన్న వేదన, ఆక్రోశం, దుఃఖం, ఆగ్రహం అర్థం చేసుకున్నారు. ప్రక్షాళన దిశగా అడుగు వేస్తున్న ఎన్‌టీఆర్‌కు తన వంతు సాయం అందించాలనుకున్నారు. అందుకే ఆయన ఎన్‌టీఆర్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. 1985 ఆగస్టు 3న నూతన అసెంబ్లీ భవనానికి శంకుస్థాపన చేసిన అనంతరం తన ప్రసంగంలో రాజీవ్‌గాంధి “మేం గతంలో మీకు చేసిన సహాయాన్ని మరిచిపోకూడదు” అని ఎన్‌టీఆర్‌కు నవ్వుతూ ఆ విషయం గుర్తుచేశారు.

రెండు పక్షాల వారూ కేవలం ఒకరిద్దరు వ్యక్తులకు మాత్రమే తెలిసే వీలున్నంతగా అతి రహస్యంగా సీట్ల సర్దుబాటు విషయంలో ఇంకా చర్చలు సాగిస్తుండగా, 1984 నవంబర్ 20వ తేదీన రాష్ట్రపతి లోక్‌సభ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేశారు. నామినేషన్లు వేయడానికి ఆఖరి తేది నవంబర్ 27. అంతకు ఒకరోజు ముందుగానే సీట్ల సర్దుబాటు సంగతి తేలాలి.

1984 నవంబర్ 22వ తేదీన ఉదయం 7 గంటలకు సంక్షోభం సమయంలో తనకు మద్దతుగా నిలిచిన ప్రతిపక్ష నేతలకు అసెంబ్లీ రద్దు నిర్ణయాన్ని ఎన్టీఆర్ తెలియచేశారు. ఉదయం 8 గంటలకు క్యాబినెట్ సమావేశం జరిగింది. అసెంబ్లీ రద్దు ఒక్కటే ఆనాటి ఎజెండా అంశం. తీర్మానానికి క్యాబినెట్ ఆమోదం లభించింది. ఉదయం 10 గంటల కల్లా తీర్మానం ప్రతి గవర్నర్ టేబుల్‌పై ఉంది. వెనువెంటనే గవర్నర్ తీర్మానాన్ని ఆమోదించారు. అసెంబ్లీ రద్దు జరిగిపోయింది.

క్యాబినెట్ తీర్మానం గురించి తెలుసుకున్న నాదెండ్ల హుటాహుటిన రోశయ్యతో కలిసి రాజ్ భవన్‌కు వెళ్లారు. ఆ తీర్మానాన్ని అంగీకరించవద్దని గవర్నర్‌ను ప్రాధేయపడ్డారు. తనకు ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం కల్పించమని కోరారు. “గవర్నర్ నన్ను వేచి వుండమన్నారు. రామారావుతో కలిసి వేరే గదిలో కూర్చుని అసెంబ్లీని రద్దుపరిచే ఆర్డర్‌పై సంతకం చేశారు. ఆ తరువాత నా దగ్గరకు వచ్చి తానేమీ చేయలేనన్నారు. ప్రధానమంత్రి సెక్రటరీ పి.సి.అలెగ్జాండర్ తనపై వత్తిడి తీసుకువచ్చారని చెప్పారు” అని నాదెండ్ల చెప్పారు. అసెంబ్లీని రద్దు చేసిన ఆర్డర్‌పై గవర్నర్ సంతకం చేసినట్లుగా తాను ఎన్టీఆర్‌కు టెలిఫోన్ ద్వారా తెలియచేశానని హెచ్.జె.దొర రాశారు. ఆరోజు ఉదయం క్యాబినెట్ తీర్మాన ప్రతితో ఎన్టీఆర్ స్వయంగా గవర్నర్ వద్దకు వెళ్లలేదు.

అసెంబ్లీని రద్దుపరిచిన తరువాత లోక్‌సభ ఎన్నికలతో పాటే అసెంబ్లీ ఎన్నికలు ఉంటాయని రాజీవ్‌గాంధి భావించారు. పొరుగు రాష్ట్రమైన తమిళనాడులో 1984 నవంబర్ 15న అసెంబ్లీ రద్దయింది. లోక్‌సభ ఎన్నికలతో పాటే తమ అసెంబ్లీ ఎన్నికలు కూడా జరిపించమని తమిళనాడు ప్రభుత్వం అభ్యర్థించింది. ఆ అభ్యర్థన ఆమోదింపబడింది. నిజానికి ఈ ఒప్పందం ఇందిరాగాంధి బ్రతికి ఉండగానే జరిగింది. 1984 అక్టోబర్ 20వ తేదీన ఎడిఎంకె పార్టీ చేసిన ప్రతిపాదన ప్రకారం రాష్ట్రంలో మూడోవంతు అసెంబ్లీ స్థానాలకు, మూడింట రెండోవంతు పార్లమెంటు స్థానాలకు కాంగ్రెస్ పార్టీ పోటీ చేయాల్సి ఉంది. “ఇందిరాగాంధి ఈ ప్రతిపాదనను ఆమోదించారు” అని పి.సి.అలెగ్జాండర్ రాశారు. ఎడిఎంకె ముందస్తు ఎన్నికలు కోరుకోవడానికి కారణం అమెరికాలో చికిత్స పొందుతున్న ఎంజీఆర్ కోలుకునే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయి. ఎంజీఆర్ మరణం తరువాత ఎన్నికలకు వెళ్ళే సాహసం పార్టీకి లేదు. అలాకాక ఆంధ్రప్రదేశ్ విషయంలో సీట్ల సర్దుబాటు ఇంకా ఒక

దశకు రాలేదు. ఆ అనిశ్చిత స్థితిని ఎన్టీఆర్ అవకాశంగా తీసుకున్నారు. అసెంబ్లీ రద్దు నిర్ణయం తీసుకోవడంలో ఆయన జాప్యం చేశారు. రద్దు తరువాత ప్రభుత్వం 1985 మార్చి 3వ తేదీన ఎన్నికలు నిర్వహించాల్సిందిగా సిఫారసు చేసింది. "ఎన్టీఆర్ కాంగ్రెస్ పార్టీతో ఎన్నికల ఒప్పందం చేసుకోవడానికి సుముఖంగా ఉన్నారు. కాని సుదీర్ఘమైన చర్చలు జరిగిన తరువాతే తెలుగుదేశం పార్టీ ఎన్ని స్థానాల్లో పోటీచేయకుండా ఉండాలనే విషయంలో అంగీకారం కుదురుతుంది. ఆ చర్చలు జరగలేదు. అందువల్ల సందర్భానుసారంగా కాంగ్రెస్ పార్టీ తన స్వంతబలంతో ఆంధ్రప్రదేశ్ ఎన్నికలను ఎదుర్కొంది" అని పి.సి.అలెగ్జాండర్ చెప్పారు.

తెలివిగా రెండు నెలల వ్యవధిలో రెండుసార్లు వేర్వేరుగా ఎన్నికలు జరిగేలా చేయడంలో ఎన్టీఆర్ కృతకృత్యులయ్యారు. ఇందిరాగాంధి మరణం అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయకూడదని ఆయన కోరుకున్నారు. అనైతికంగా అసెంబ్లీని రద్దు పరిచారని విమర్శకులు ఎన్టీఆర్‌పై కత్తులు దూశారు.

పార్లమెంటు ఎన్నికలతో సమాంతరంగా అసెంబ్లీ ఎన్నికలు కూడా నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తే ఎన్టీఆర్ తన ఎమ్మెల్యేలను నిలబెట్టుకోవడం కష్టసాధ్యమై పోతుందని వారు సవాల్ చేశారు. నిజానికి ఈ ప్రమాదాన్ని ఎన్టీఆర్ ముందుగానే పసిగట్టారు. నీతి నియమాలను పక్కన పెట్టి, ఆయన అప్పటి పరిస్థితిని రాజకీయ కోణంలోనే చూశారు. అసెంబ్లీ రద్దు ప్రకటించడంలో జాప్యం చేసి ఆయన తన స్థానాన్ని పదిలంగా కాపాడుకుని రాజీవ్‌గాంధిని ఆశ్చర్యంలో ముంచెత్తారు.

అసెంబ్లీని రద్దు పరచాలనే చరిత్రాత్మక నిర్ణయం ప్రతివారినీ గందరగోళంలో పడేసింది. తన నిర్ణయానికి వ్యతిరేకంగా మీడియాలో వస్తున్న విమర్శలను ఎన్టీఆర్ లక్ష్యపెట్టలేదు. సాధారణ ప్రజలు తన నిర్ణయానికి మద్దతు తెలియచేయడంతో ఆయన ఉత్సాహం ఇనుమడించింది. ఆయన ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా ఉన్నారు. పాలనా వ్యవహారాలతో పాటు పార్టీ వ్యవహారాల్లో తలమునకలై ఉన్నారు. చైతన్యరథంపై ఆయన మళ్లీ రోడ్డుపైకి వచ్చి, రాష్ట్రమంతటా సుడిగాలి పర్యటన చేశారు. ఆయన తన ప్రసంగాల్లో ఇందిరాగాంధి, రాజీవ్‌గాంధిని విమర్శించలేదు. నాదెండ్ల వెన్నుపోటే ఆయన ప్రధాన ప్రచారాస్త్రం.

ఇతర రాష్ట్రాలలో ఎన్టీఆర్ ఎన్నికల ప్రచారం నిర్వహించలేదు. రాజీవ్‌గాంధితో ఒప్పందంలో అది కీలకమైన షరతు. అయినప్పటికీ రామకృష్ణ హెగ్డే ప్రత్యేకంగా కోరడంతో ఎన్టీఆర్ తెలుగు ఓటర్లు అధికంగా ఉన్న కర్ణాటకలోని కోలార్ నియోజక వర్గంలో ప్రచారం చేశారు. కోలార్‌లో ఒక ఎన్నికల సభలో ఆయన ప్రసంగిస్తుండగా ఢిల్లీ నుంచి ఫోన్ కాల్ వచ్చింది. ఒప్పందాన్ని విస్మరించి అక్కడ ఎలా ప్రచారం చేస్తున్నారని ప్రశ్నిస్తే ఆయన వివరణ

ఇవ్వాల్సివచ్చింది.

ఎన్నికల ప్రచారంలో ఎన్టీఆర్ నైతిక విలువలను రాజీవ్‌గాంధి ప్రశ్నించారు. అసెంబ్లీ రద్దు తరువాత దాదాపు మూడునెలలకు పైగా ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగే నైతిక హక్కు ఎన్టీఆర్‌కు లేదని ఆయన వాదించారు. మీడియా, మేధావి వర్గాలు కూడా రాజీవ్‌గాంధికి వంత పాడాయి. ఎన్టీఆర్ చర్య 'చట్టపరంగా' మాత్రమే దోషరహితం అనే విషయాన్ని ఏకగ్రీవంగా అందరూ అంగీకరించారు. ఎన్టీఆర్‌పై రాజీవ్‌గాంధి విమర్శలు గుప్పిస్తుండడంతో ఎన్టీఆర్‌కు కూడా తన కాంగ్రెస్ వ్యతిరేక విధానాన్ని తిరగదోడే అవకాశం లభించింది.

సినిమాల్లో రాముని పాత్ర తనకు అభిమానపాత్ర అయినప్పటికీ రాజకీయాల్లో తాను కృష్ణుని పాత్రనే పోషించదల్చుకున్నానని 1983 ఫిబ్రవరిలో ఢిల్లీలో జర్నలిస్టులతో ఎన్టీఆర్ అన్నారు. నాదెండ్ల ఉదంతం ఆయన శ్రీకృష్ణునిగా వ్యవహరించాల్సిన అవసరం కల్పించింది. అటువంటి సందర్భమే ఇప్పుడు మళ్లీ వచ్చింది. ఆయన వాగ్దానభంగానికి పాల్పడ్డారు. నర్మగర్భంగా మాట్లాడారు. తన ప్రవర్తనలో మార్పుకు నాదెండ్ల ఉదంతమే కారణమని ఆయన చెప్పారు. సమకాలీన రాజకీయాల్లో ఎన్టీఆర్ నిఖార్సయిన పట్టు సాధించారు.

నాదెండ్ల తన 50 మంది ఎమ్మెల్యేలతో ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. కానీ ఆయన ఎమ్మెల్యేలు అందుకు అంగీకరించలేదు. నాదెండ్లను చేర్చుకునేందుకు రాజీవ్‌గాంధి సమ్మతిస్తారా అనేది సందేహాస్పదమైన విషయం. తానే టిడిపికి నాయకుడు కనుక తనకే సైకిల్ గుర్తును కేటాయించాలని నాదెండ్ల ఎన్నికల కమీషన్‌కు విజ్ఞప్తి చేశారు. ఒకవేళ అది సాధ్యం కాని పక్షంలో సైకిల్ గుర్తును ఎవరికీ కేటాయించకుండా నిలుపుదల చేయాలన్నారు. ఆయన తన పార్టీ సభ్యులతో కలిసి చీఫ్ ఎలక్షన్ కమీషనర్‌ను కలుసుకున్నారు. ఆయన అభ్యర్థనలను కమీషన్ తిరస్కరించింది.

1983 డిసెంబర్ నెలలో ఇందిరాగాంధి దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి పట్టు ఉన్న 50 నియోజక వర్గాల జాబితాను సిద్ధం చేశారని ఎం.ఎల్.ఫొతెదార్ గుర్తుచేసుకున్నారు. "వచ్చే క్యాబినెట్‌లో పి.వి.నరసింహారావు, శివశంకర్ తప్పకుండా ఉండాలి. కానీ ఎన్టీఆర్ వారిని గెలుపొందనీయరు. అందుకే వారిద్దరూ వేరే నియోజకవర్గాల నుంచి పోటీ చేయవచ్చు అని ఇందిరాగాంధి భావించారు" అని ఫొతెదార్ చెప్పారు. కానీ ఇందిరాగాంధి మరణంతో పరిస్థితులు మారిపోయాయి. ఎన్టీఆర్, రాజీవ్‌గాంధిల మధ్య ఒప్పందం కుదిరింది. పార్లమెంట్ ఎన్నికల్లో ముగ్గురు విలక్షణ నాయకులకు పోటీగా బలహీనులైన అభ్యర్థులను నిలబెట్టి ఎన్టీఆర్ తన మాట నిలుపుకున్నారు. పి.వి.నరసింహారావు పోటీచేస్తున్న హన్మకొండ స్థానాన్ని బిజెపికి ఇచ్చారు. శివశంకర్ పోటీ చేస్తున్న మెదక్ నియోజక వర్గానికి తాలూకా స్థాయి అభ్యర్థిని పోటీగా నిలబెట్టారు. వెంగళరావు పోటీచేస్తున్న ఖమ్మం సీటును సిపిఎంకు

కేటాయించారు. కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అయిన మహారాష్ట్రలోని రాంటెక్ నుంచి కూడా పి.వి.నరసింహారావు పోటీ చేశారు. మధ్యప్రదేశ్‌లోని మరొక గెలిచే సీటు నుంచి పోటీ చేయమని శివశంకర్‌ను అడిగారు కానీ ఇందిరాగాంధి గెలుపొందిన మెదక్ సీటు కూడా పక్కాయే అని ఆయన ఇంకొక చోటు నుంచి పోటీ చేయడానికి ఒప్పుకోలేదు.





ఎన్టీఆర్ చైతన్యరథంపై ప్రచారం చేశారు. ఆయన కొడుకు హరికృష్ణ రథసారథి. “ఆయన దృష్టంతా డ్రైవింగ్ పైనే ఉండేది. రోజంతా వ్యాన్‌ను ముందుకు ఉరికిస్తూనే ఉండేవారు. రాత్రిపూట ఎన్టీఆర్ నిద్రకు ఉపక్రమించిన తరువాత రోడ్డు పక్కగా చైతన్యరథాన్ని నిలిపి మెకానిక్కుల సహాయంతో రిపేర్లు నిర్వహించేవారు. ఆయన కార్యక్రమంలో మార్పు ఉండేది కాదు. తండ్రి సంరక్షణ, వ్యాన్ బాగోగులు మాత్రమే ఆయనకు పట్టేవి. అభ్యర్థులెవరో, తామెక్కడెక్కడ పర్యటిస్తున్నామో ఆయనకు అనవసరం. ఆయన ఏకైక లక్ష్యం వ్యాన్‌ను సురక్షితంగా నడిపి రాత్రికల్లా గమ్యానికి చేర్చడమే” అని హెచ్.జె.దొర అన్నారు.

ఎన్టీఆర్ నటించి, దర్శకత్వం వహించిన ‘వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర’ సినిమా ఎన్టీఆర్ ఎన్నికల ప్రచారానికి తోడ్పడింది. తెలుగులో మొట్టమొదటి సారిగా వందకు పైగా ప్రింట్లతో 1984 నవంబర్ 29న ఆ సినిమా విడుదలైంది. ఆ సినిమా 1981 లోనే చిత్రీకరించారు కానీ సెన్సార్ చిక్కుల్లో ఇరుక్కుంది. సెన్సార్ అభ్యంతరాలను కోర్టులో సవాల్ చేసి గెలవడానికి మూడు సంవత్సరాల కాలం పట్టింది. ఆ సినిమాలో యోగిగా, సంఘసంస్కర్తగా ఎన్టీఆర్ పోషించిన పాత్రకు ప్రేక్షకులు నీరాజనాలు పలికారు. సినిమా సెన్సేషనల్ హిట్టయింది.

దేశవ్యాప్తంగా లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఏకపక్షంగా గెలుపొందింది. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ఆ పార్టీకి సానుభూతి సెంటిమెంటు పనిచేయలేదు. మిత్రపక్షాలకు ఎనిమిది సీట్లను విడిచిపెట్టి, తెలుగుదేశం పార్టీ 34 స్థానాల్లో పోటీ చేసింది. సొంత పార్టీ

స్థాపించుకున్న చెన్నారెడ్డి తెలుగుదేశం పార్టీ మిత్రపక్షంగా కరీంనగర్ నియోజకవర్గం నుంచి పోటీచేశారు కానీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చొక్కారావు చేతిలో ఓటమి పాలయ్యారు. దేశం మొత్తం మీద బిజెపి కేవలం రెండుస్థానాల్లో గెలుపొందింది. ఆ పార్టీ అభ్యర్థి జంగారెడ్డి హన్మకొండలో పి.వి.నరసింహారావును ఓడించారు. రాంలాల్‌ని సమర్థించినందుకు ప్రజలు ఆయనను నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. మాణిక్ రెడ్డి చేతిలో శివశంకర్ ఘోర పరాజయం పాలయ్యారు. రెండు కమ్యూనిస్టు పార్టీల మధ్య పెనుగులాట కారణంగా ఖమ్మం నుంచి వెంగళరావు గెలుపొందారు. నిజానికి కమ్యూనిస్టు పార్టీల మధ్య సంఘీభావం లేని కారణంగా రాష్ట్రంలోని 42 నియోజకవర్గాలకు గానూ ఒక్క ఖమ్మం స్థానంలోనే ఎన్టీఆర్ ప్రచారం చేయలేదు. విజయభాస్కరరెడ్డి దారుణంగా ఓడిపోయారు. ఎన్టీఆర్‌ను దుమ్మెత్తి పోసిన పెండేకంటి వెంకటసుబ్బయ్య చిత్తుచిత్తుగా ఓడిపోయారు. సంక్షోభ సమయంలో ఎన్టీఆర్‌కు అండగా నిలిచిన జనతా పార్టీ నాయకులు జైపాల్ రెడ్డికి తెలుగుదేశం పార్టీ మద్దతు లభించినందువల్ల చెప్పుకోదగ్గ విజయం సాధించారు. అంజయ్య సికింద్రాబాద్ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీకి సాధించి పెట్టారు. హైదరాబాద్ స్థానాన్ని ఒవైసీ గెలుచుకున్నారు. మొత్తంమీద కాంగ్రెస్ పార్టీ ఆరు స్థానాల్లో గెలుపొందింది. రాష్ట్రానికి వెలుపల కర్ణాటకలోని కోలార్‌లో మాత్రమే ఎన్టీఆర్ ప్రచారం నిర్వహించారు. ఆ రాష్ట్రంలోని 28 స్థానాలకుగానూ నాలుగు స్థానాల్లోనే అధికార జనతా పార్టీ గెలుపొందగా, కోలార్ ఆ నాలుగింటిలో ఒకటి.

30 మంది ఎంపీలతో లోక్ సభలో తెలుగుదేశం పార్టీ అతి పెద్ద ప్రతిపక్ష పార్టీగా అవతరించింది.

# విద్యపట్ల విశేష గౌరవం

ఎన్టీర్‌కు విద్య అన్నా, ఉపాధ్యాయులన్నా విశేషమైన గౌరవం. తనకు చదువు నేర్పించిన ఉపాధ్యాయులను జీవిత పర్యంతం ఆయన వినమ్రంగా గుర్తుచేసుకునేవారు. విలువలను బోధించి వారు తన జీవితాన్ని ఎలా తీర్చిదిద్దినదీ ఎప్పుడూ చెబుతూండేవారు.

విజయవాడలో సరస్వతీ టాకిసులో 'అగ్గిరాముడు' శతదినోత్సవం జరిగింది. ఆ సభలో ఆయన ప్రసంగిస్తున్న సమయంలో ప్రేక్షకుల మధ్యలో దూరంగా ఎక్కడో ఒదిగి కూర్చున్న ఒకరిని ఎన్టీఆర్ గుర్తుపట్టి, తన ప్రసంగాన్ని అర్ధాంతరంగా ఆపి, వేదిక నుంచి దిగి, ఆయన వద్దకు వెళ్లి, వారిని ముందు వరుసలో కూర్చోబెట్టి పాద నమస్కారం చేశారు. తరువాత వేదికపైకి తిరిగి వచ్చి, ప్రసంగాన్ని కొనసాగిస్తూ తాను గౌరవించిన వ్యక్తి తన చిన్ననాట నిమ్మకూరులో చదువుతున్నప్పుడు తనకు తెలుగు భాషపై మమకారం కల్గించిన గురువు వల్లూరి వెంకట సుబ్బారావు అని ప్రేక్షకులకు చెప్పారు. ఆ ఆదర్శప్రాయమైన ప్రవర్తన ద్వారా ఆయన తన అభిమానులకు, ప్రేక్షకులకు చదువు నేర్పిన గురువులపట్ల భక్తిశ్రద్ధలతో, గౌరవంగా నడచుకోవాలన్న అవసరం ఉందన్న మహత్తర సందేశాన్ని అందచేశారు.

ఎన్టీఆర్ కొన్ని సినిమాల్లో ఉపాధ్యాయుని పాత్ర పోషించారు. 'బడిపంతులు' సినిమాలో విద్యార్థులను దేశభక్తి, త్యాగం వంటి సుగుణాలతో తీర్చిదిద్దే నడివయసు హెడ్మాస్టర్ పాత్రలో కనిపిస్తారు. 'విశ్వరూపం' సినిమాలో కోటిమందిలో ఒక్కనిగా, దేవునిగా విద్యార్థులు కీర్తించే స్ఫూర్తిదాయకుడైన అధ్యాపకుని పాత్రను పోషించారు. ఎన్టీఆర్ రాజకీయాల్లోకి ప్రవేశించినప్పుడు ఆయన ప్రజల కష్టసుఖాలను గురించి, వేదన గురించి అనుభవపూర్వకంగా ఎలా చెప్పగలుగుతున్నారా అని చాలామంది ఆశ్చర్యపోయారు. సినిమాల్లో పోషించిన పాత్రల్లో తాను జీవించానన్నదే ఆయన సమాధానం. సాంఘిక చిత్రాల్లో ఆయన ధరించిన పాత్రల్లో ఉపాధ్యాయుని పాత్రలను ప్రత్యేకమైనవిగా పేర్కొనేవారు.

దర్శకుడు కె.వి.రెడ్డి తన కుమారుణ్ణి ఉన్నత చదువుల కోసం విదేశాలకు పంపడానికి సంకోచిస్తుంటే, ఆ యువకుడికి తన కలలు సాకారం చేసుకునే అవకాశమివ్వమని ఎన్టీఆర్ ఆయనకు నచ్చచెప్పారు. కె.వి.రెడ్డి కుమారుడి విద్యాభ్యాసానికి అవసరమైన కొంత డబ్బు కూడా ఆయన సమకూర్చారు.

ఎన్టీఆర్ సినిమాలను డిస్ట్రిబ్యూషన్ చేసే నేషనల్ ఆర్ట్ పిక్చర్స్ సంస్థకు పరుచూరి శివప్రసాద్ మేనేజింగ్ పార్టనర్. ఆయన కొడుకు డాక్టర్ సురేంద్ర మెరిట్ విద్యార్థి. కాని ఆయనకు డాక్టర్ వృత్తిపై అభిరుచి తక్కువ. నాలుగైదేళ్లు డాక్టర్‌గా పనిచేసిన తరువాత సినిమారంగంలో అడుగుపెట్టాలని ఆయన అభిలాష. అందుకే ఆయన అమెరికా వెళ్ళడానికి

ఉత్సాహంగా లేరు. 1970ల్లో డాక్టర్లు అమెరికా వెళ్ళాలంటే ముందు సింగపూర్‌లో నిర్వహించే పరీక్షలో ఉత్తీర్ణులు కావాలి. ఆ పరీక్షకు వెళ్ళనని సురేంద్ర మొరాయించారు. కాని సురేంద్ర పైచదువుకు అమెరికా వెళ్ళాల్సిందేనని ఎన్టీఆర్ పట్టుబట్టి ఆయన సింగపూర్‌లో పరీక్ష రాయడానికి ఒప్పించారు. ప్రస్తుతం అమెరికాలో ఉంటున్న డాక్టర్ సురేంద్ర తన చదువుకోసం ఎన్‌టీఆర్ తాపత్రయపడ్డ రోజుల్ని గుర్తు చేసుకున్నారు. "ఎక్కడ నేను మనసు మార్చుకుంటానో అని ఎన్టీఆర్ స్వయంగా ఎయిర్‌పోర్టుకు వచ్చి నేను సింగపూర్ వెళ్లే విమానం ఎక్కేంతవరకు అక్కడే ఉన్నారు" అన్నారు డాక్టర్ సురేంద్ర.

ఎన్టీఆర్‌కు విద్యపట్ల ఉన్న ఆసక్తికి ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే.

నటుడిగా తన వృత్తిపట్ల అంకితభావంతో ఉన్న ఎన్టీఆర్ తన పిల్లల చదువు గురించి శ్రద్ధ తీసుకోలేక పోయారు. తన కొడుకులు ఉన్నత విద్యావంతులు కాలేదని ఎన్టీఆర్‌ను ఎప్పుడూ తొలుస్తూండేది. హరికృష్ణ హైస్కూల్ తర్వాత చదవలేదు. కొంతమంది కొడుకులు కాలేజీల్లో చదివారు గాని వారు చదువులో ప్రతిభ చూపెట్టలేదు. బాలకృష్ణ బి.ఏ. చదువుకున్నారు. అతను స్కూల్లో చదువుతున్నప్పుడు పద్నాలుగేళ్ళ వయసులో ఎన్‌టీఆర్ సొంత బేనర్‌పై నిర్మించిన 'తాతమ్మ కల' చిత్రంలో మొదటిసారి నటించారు. అందరి మన్ననలు పొందారు. అది మొదలు చాలామంది నిర్మాతలు తమ సినిమాల్లో బాలకృష్ణను నటించడానికి అనుమతి కోరుతూ ఎన్టీఆర్‌ను సంప్రదించారు. కానీ అతడు బి.ఏ. పూర్తి చేసేంతవరకు బయటి సినిమాల్లో నటించేందుకు ఎన్టీఆర్ అనుమతించలేదు. "అతని చదువు ముఖ్యం. దానికి అంతరాయం కలగడం నాకిష్టం లేదు. గ్రాడ్యుయేషన్ పూర్తి అయ్యేంతవరకు బాలయ్య బయటి చిత్రాలు చేయడు" అని ఎన్టీఆర్ వారికి చెప్పారు.

ఎన్టీఆర్ రాజకీయాల్లో ప్రవేశించి 1982లో తెలుగుదేశం పార్టీని స్థాపించిన పిదప ఆయన అన్ని స్థాయిలలో నాయకులను ఎంపిక చేసే విషయంలో శ్రద్ధ చూపించారు. పార్టీ పదవులకు, అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థులుగా అవకాశం ఉన్నంత వరకు గ్రాడ్యుయేట్లను, పోస్ట్ గ్రాడ్యుయేట్లనే ఎంపిక చేశారు. 1983 ఎన్నికల్లో గెలుపొందిన తెలుగుదేశం ఎమ్మెల్యేలలో చాలామంది రాజకీయాలకు కొత్త. అంతేకాక వారిలో గ్రాడ్యుయేట్లు రికార్డు సంఖ్యలో ఉన్నారు.

1983లో ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయిన తరువాత చేపట్టిన తొలిచర్యల్లో భాగంగా మెరిట్ ఒక్కటే వృత్తి కళాశాలల్లో ప్రవేశానికి ప్రాతిపదికగా ఉండాలని బలంగా విశ్వసించి, కాలేజీల్లో క్యాపిటేషన్ ఫీజుపై నిషేధం విధించారు. ఇది జరిగిన దాదాపు దశాబ్దం తరువాత గాని సుప్రీంకోర్టు క్యాపిటేషన్ ఫీజు ఏ రూపంలో కూడా వసూలు చేయరాదని తీర్పు ఇచ్చిందంటే ఎన్‌టీఆర్ ఎంత ముందుచూపుతో వ్యవహరించారో స్పష్టంగా అర్థమవుతుంది.

సివిల్ సర్వీసులో చేరకముందు ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న ప్రభుత్వ అధికార్లతో ఎన్టీఆర్ వినమ్రంగా ఉండేవారు. ఆయన చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా పనిచేసిన నరసయ్య

పోలీసు శాఖలో చేరడానికి ముందు అధ్యాపక వృత్తిలో ఉన్నారు. ఎన్టీఆర్ ఆయనను 'ప్రొఫెసర్ గారూ!' అని గౌరవంతో పిలిచేవారు. తనను సందర్శించడానికి వచ్చేవారి ఉపాధ్యాయులుంటే వారికి ముందస్తు అవకాశం ఇవ్వడం నియమంగా పెట్టారు.

ఎన్టీఆర్ మేధావి కాదు. ఆయన తాను మేధావినని ఎప్పుడూ చెప్పలేదు సరి కదా తాను మేధావిని కాననే చెపుతుండేవారు. అదేమీ ఆయన మాటవరుసకు చెప్పింది కాదు. దానర్థం ఆయనకు తెలుసు. అందుకే నిపుణులైన వారితో సంప్రదించడానికి, వారి విజ్ఞత వల్ల ప్రయోజనం పొందడానికి ఆయన ఏమాత్రం సంకోచం చెందేవారు కాదు. ఆ విధంగా ఆయన నిత్య విద్యార్థే.

ఎన్టీఆర్ స్వయంగా విద్యావేత్త కాదు గాని విద్య వల్ల కలిగే ప్రయోజనం ఆయనకు క్షుణ్ణంగా తెలుసు. అందుకే విద్యావేత్తలతో ఆయన తరచుగా సమావేశమయ్యేవారు. విద్యావ్యవస్థను అర్థవంతంగా, ప్రయోజనకరంగా తీర్చిదిద్దడానికి కావలసిన ఆలోచనలు చేయమని ఆయన వారిని పదేపదే కోరేవారు. ఆ రకమైన తృష్ణ ఫలితంగా, అచంచలమైన చిత్తశుద్ధితో ఆయన సంప్రదాయేతర, ప్రత్యామ్నాయ విశ్వవిద్యాలయాలు స్థాపించడానికి కారకులయ్యారు.

మహిళల కోసం ప్రత్యేకంగా ఒక విశ్వవిద్యాలయం అవసరమని ఎన్టీఆర్ నమ్మి 1983లో తిరుపతిలో పద్మావతి మహిళా యూనివర్సిటీని స్థాపించారు. మహిళల కోసం ప్రత్యేకంగా యూనివర్సిటీ ఏర్పాటు చేయాల్సిన అవసరమేముందని కొందరు ప్రశ్నించారు. కానీ ప్రారంభమైన రోజుల నుంచే విజయవంతమై, మహిళా యూనివర్సిటీ మహిళా సాధికారతకు గొప్ప ఉదాహరణగా నిలిచింది.

తెలుగు భాషపట్ల ఎన్టీఆర్‌కు వల్లమాలిన ప్రేమ, అభిమానం. తనకు తెలుగు భాషపట్ల ప్రేమను పెంచిన గురువు, ప్రసిద్ధ రచయిత, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత విశ్వనాథ సత్యనారాయణ గురించి ఎన్టీఆర్ విసుగు, విరామం లేకుండా చెప్పేవారు. "కాలేజీ విద్యార్థిగా ఆయన తెలుగు మీద ప్రాణాలు నిలిపి, తన గురువు శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారిని సేవించాడు. ఆయన మాటలు, పద్యాలు, ప్రవర్తనా ధోరణులు, వ్యక్తిత్వంలో ఉన్న విలక్షణ లక్షణాలను ఆరాధించారు. ఆయన విద్యార్థి జీవితంలో ఆయనను తీర్చిదిద్దినదీ తెలుగుతనమే. రాయప్రోలు, విశ్వనాథ, గరిమెళ్ళ, జాషువా, కరుణశ్రీ వంటి కవుల రచనల వల్ల ఉత్తేజితమైనది ఆయన వ్యక్తిత్వం. తుదిశ్వాస విడిచే వరకు రామారావు గారిలో ఉచ్ఛ్వాస నిశ్వాసాలుగా డోలలూగింది ఈ ఆంధ్రాభిమానమే. ఆ విషయంలో ఆయన సార్థకజన్ముడై ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రాణప్రతిష్ట చేశాడు" అని ఎన్టీఆర్ గురించి ప్రఖ్యాత సినీ గేయ రచయిత వేటూరి సుందరరామమూర్తి అన్నారు.

'తెలుగదేల యన్న...దేశభాషలందు తెలుగు లెస్స' అన్న శ్రీకృష్ణదేవరాయల పద్యమంటే ఎన్టీఆర్‌కు ప్రాణం. "ఈ పద్యం రామారావుగారు ఎన్నిసార్లు చదివినా మళ్ళీ

వినాలనిపిస్తుంది. శ్రోతల చప్పట్ల మధ్య వారు ఆ పద్యాన్ని తాదాత్మ్యం చెంది చదువుతారు. 'యేను తెలుగు వల్లభుండ' అనేచోట వారి ఉచ్ఛారణ మాడ్యులేషన్ వింటుంటే శ్రీకృష్ణదేవరాయలే ఈ పద్యాన్ని మన కళ్ల ఎదుట చదువుతున్నాడా అనే భ్రాంతి అభిమానులకు కలుగుతుంది" అని డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు అన్నారు.

తెలుగు లోగిళ్లను భాషా సంస్కృతులతో సుసంపన్నం చేయడానికి 1985లో తెలుగు విశ్వవిద్యాలయం చట్టాన్ని రూపొందించి, తెలుగు భాషకు గౌరవ చిహ్నంగా తెలుగు విశ్వవిద్యాలయం స్థాపనకు ఎన్‌టీఆర్ కారకులయ్యారు. 1988లో ఆ యూనివర్సిటీని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంగా నామకరణం చేశారు. యూనివర్సిటీ గ్రాంట్సు కమీషన్ (యుజిసి) ఆ విద్యాసంస్థకు గుర్తింపునిచ్చింది. కానీ రాష్ట్ర గవర్నర్ కాకుండా ముఖ్యమంత్రి విశ్వవిద్యాలయానికి ఛాన్సలర్ కారణంగా ఆ యూనివర్సిటీకి నిధులు మంజూరు చేయడానికి యుజిసి అభ్యంతరం వ్యక్తం చేసింది. యూనివర్సిటీకి మొదటి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ తూమాటి దోణప్ప తెలుగు భాషకు సేవ చేయడానికే ఆ యూనివర్సిటీని స్థాపించుకున్నామని, గవర్నర్లుగా వచ్చే రాష్ట్రేతరులు ఛాన్సలర్‌లైతే వారికి తెలుగు భాష, తెలుగు సంస్కృతిపైన అభిరుచి ఉండడం చాలా అరుదని యుజిసితో వాదించారు. చివరికి ఆ వాదన సరైందని అంగీకరించి యుజిసి యూనివర్సిటీకి ఆర్థిక గుర్తింపును ఇచ్చింది.

చట్టం ద్వారా దేశంలోనే మొదటి ఓపెన్ యూనివర్సిటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1982లో ఏర్పడినా గాని దానికి కార్యరూపం కలిగించిన వ్యక్తిగా ఎన్‌టీఆర్‌ను గుర్తించాలి. "సమాచార వ్యవస్థలో మార్పులు విద్యారంగానికి బహువిధాలా ఉపయుక్తమౌతాయని ఎన్‌టీఆర్ గ్రహించారు. అందుకే ఆయన ఓపెన్ యూనివర్సిటీ విద్యావిధానంపై శ్రద్ధ చూపారు" అని ఓపెన్ యూనివర్సిటీ మొదటి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రామిరెడ్డి అన్నారు. సామాజికంగా వెనుకబడిన వర్గాల వారికి, భౌగోళికంగా విద్యాసదుపాయాలు లేని ప్రజలకు ఈ రకమైన యూనివర్సిటీ ఉన్నత విద్యకు అవకాశం కల్పిస్తుందని ఎన్టీఆర్‌కు తెలుసు కానీ కొందరు ప్రభుత్వాధికారులు, విద్యావేత్తలు, జర్నలిస్టులు ఓపెన్ యూనివర్సిటీ విద్యావిధానాన్ని వ్యతిరేకించారు. ఆ విధంగా నేర్చుకునే చదువును 'చెత్త'గా అభివర్ణించారు. కాని విస్పష్టమైన కారణంతో, సాంఘిక, ఆర్థిక సమన్యాయం ప్రాతిపదికగా ఎన్టీఆర్ ఓపెన్ యూనివర్సిటీ విద్యను సమర్థించారు. "ఓపెన్ యూనివర్సిటీ విద్యావిధానం చెత్త అయితే, నా ముఖ్యమంత్రిత్వం కూడా చెత్తే" అని ఎన్టీఆర్ దృఢ విశ్వాసంతో ప్రకటించారు.

విశ్వవిద్యాలయాలకు స్వతంత్ర ప్రతిపత్తి ఉంటే బాధ్యత, జవాబుదారీతనం పెరుగుతాయని ఎన్టీఆర్ విశ్వసించేవారు. విద్యాలయాలు పవిత్రస్థలాలని ఆయన దృఢవిశ్వాసం. అందుకే ఆయన వాటిని రాజకీయాలకు అతీతంగా ఉంచారు. యూనివర్సిటీలు, ఉన్నత విద్యా మండళ్లలో నియామకాల విషయంలో ఆయన ఎప్పుడూ రాజీ పడలేదు. విద్యాసంస్థలకు మంచి అధ్యాపకులు ఆలంబన అని, వైస్ ఛాన్సలర్ల ఎంపికలో నైతిక నిష్ఠ,

అర్హత, మంచి ట్రాక్ రికార్డు ప్రాతిపదికలుగా ఎన్టీఆర్ తీసుకున్నారు. ఆ ఎంపికల్లో ఆయన సంకుచిత, ప్రాంతీయ ప్రయోజనాలను ఎప్పుడూ పరిగణనలోకి తీసుకోలేదు. గొప్ప విద్యావేత్తలకోసం ఎన్టీఆర్ దేశవ్యాప్తంగా గాలించేవారు. తనకు ముందు, తరువాత రాష్ట్రాన్ని పాలించిన ముఖ్యమంత్రులకు భిన్నంగా ముఖ్యమైన పదవుల నియామకంలో ఎన్టీఆర్ రాజకీయాలకు తావివ్వలేదు. ఉదాహరణకు హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీకి వైస్ ఛాన్సలర్ పదవికి తగిన వ్యక్తి కోసం విస్తృతంగా ఎన్టీఆర్ సంప్రదింపులు జరిపారు. నిష్ణాతులైన విద్యావేత్తల సలహాలు కోరారు. చివరికి అంతకుముందు కాన్పూర్ ఐఐటిలో పనిచేసిన ప్రొఫెసర్ దయారత్నంగారు ఆ పదవికి వన్నె తెస్తారని ఎన్టీఆర్ భావించి, ఆయన్ని ఆ పదవిలో చేరమని ఆహ్వానించారు. ప్రొఫెసర్ దయారత్నం ఎంపిక ఎవరూ ఊహించలేదు. అర్హతే ప్రాతిపదికగా వైస్ ఛాన్సలర్‌గా ఎంపిక చేయబడ్డ ప్రొఫెసర్ దయారత్నం జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీకి విశిష్టమైన సేవలందించి ఆ పదవికే వన్నె తెచ్చారు. అలాగే రెండుసార్లు ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా ప్రొఫెసర్ నవనీత రావు ఎంపిక కూడా పూర్తిగా అర్హత ఆధారంగానే జరిగింది. ఆయన విశిష్ట విద్యావేత్తయే కాక యూనివర్సిటీకి చెందిన ఎన్నో విలువైన ఆస్తులను కాపాడిన వ్యక్తిగా పేరు పొందారు. ఓపెన్ యూనివర్సిటీకి వైస్ ఛాన్సలర్‌గా ప్రొఫెసర్ చంద్రశేఖరరావు ఎంపిక కూడా ఆదర్శప్రాయమైనదే. గతంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మహోన్నతంగా నిర్వహించిన ఆంధ్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ పదవిని చేపట్టవలసిందిగా ఆయన కుమారుడు ప్రొఫెసర్ సర్వేపల్లి గోపాల్‌ను ఎన్టీఆర్ స్వయంగా ఆహ్వానించారు. కానీ సొంత కారణాల వల్ల ప్రొఫెసర్ గోపాల్ ఆ ఆహ్వానాన్ని మన్నించలేదు.

సుదీర్ఘకాలం పాటు రాజకీయ నాయకులను యూనివర్సిటీల ఎగ్జిక్యూటివ్ కౌన్సిళ్లలో, సెనేట్లలో సభ్యులుగా ప్రభుత్వం నియమించేది. ఈ నియామకాల వల్ల విద్యాసంస్థలకు ఒనగూడే ప్రయోజనమేమిటో ఎన్టీఆర్‌కు తెలియలేదు. పాత పద్ధతిని కాదని విద్యావేత్తలు, మేధావులు ఈ సంస్థలకు సభ్యులుగా నామినేట్ అయ్యేలా ఎన్టీఆర్ చూశారు.

ఉన్నత విద్యకోసం ప్రణాళికలు మార్గనిర్దేశకాలు రచించడానికి, వాటిని పర్యవేక్షించడానికి ఒక స్వతంత్ర ప్రతిపత్తి గల వ్యవస్థను రూపొందించుకున్న మొదటి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ భారతదేశంలో గుర్తింపు పొందింది. అట్టి వ్యవస్థను సంస్థాగతం చేసిన ఖ్యాతి ఎన్టీఆర్‌కు చెందాలి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్‌గా విద్యామంత్రిని కాదని ఒక విద్యావేత్తను నియమించాలని ఆయన పట్టుబట్టి ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ కె.రామకృష్ణారావును విద్యామండలి ఛైర్మన్‌గా నియమించారు.

నాణ్యతతో కూడిన విద్య అందరికీ అందుబాటులో ఉండాలనే సదాశయంతో విద్యారంగంలో ఎన్టీఆర్ సంస్కరణలు చేపట్టారు. పాఠశాల స్థాయిలో నాణ్యమైన విద్యను అందిస్తే విద్యార్థులు ఉన్నత విద్యపట్ల మొగ్గు చూపుతారని ఆయన విశ్వసించారు.

విద్యావ్యవస్థలో సాంకేతిక విద్య, వృత్తివిద్యలను ప్రభుత్వం ప్రవేటు సంస్థల భాగస్వామ్యంతో ప్రోత్సహించాలని నిర్ణయించారు. ఆనాటికి ఇదొక విప్లవాత్మకమైన ఆలోచన.

ఎన్టీఆర్ ప్రధానంగా ప్రాథమిక విద్యపై దృష్టి పెట్టారు. పాఠశాల విద్యార్హతలు సంపాదించునే చోటు మాత్రమే కాక విద్యార్థులు విలువలను, సంస్కృతిని పెంపొందించుకుని, వారిని బాధ్యతాయుతమైన పౌరులుగా తయారుచేసే దేవాలయం కావాలని ఆయన ఆకాంక్షించారు. రాష్ట్రంలో అక్షరాస్యుల శాతం తక్కువగా ఉండడం, బడిచదువులు మానేస్తున్న పిల్లల సంఖ్య పెరుగుతుండడం కూడా ఆయనను కలత పెట్టింది. పాఠశాలల్లో బోధన పిల్లలకు విద్యపై అభిరుచి పెంచేలా, ఆనందదాయకంగా ఉండాలని ఎన్టీఆర్ తలచారు. సినిమా నటునిగా శ్రవణ, దృశ్య మాధ్యమం శక్తివంతమైనదని ఎన్‌టీఆర్‌కు తెలుసు.

స్కూలు పిల్లల కోసం పాఠాలను రూపొందించమని అడగడానికి సినీరంగంలో కళాత్మకమైన చిత్రాల నిర్మాణానికి పేరొందిన బాపు, ముళ్లపూడి వెంకటరమణలను ఎన్‌టీఆర్ పిలిపించారు. 1986లో తెల్లవారుజామున 5 గంటలకు ఎన్‌టీఆర్ ఇంట్లో సాంబ్రాణి అగరువత్తుల పొగ ఆవరించి ఉంది. "పిల్లలకు, ముఖ్యంగా పల్లెల్లో చదువుసంధ్యలందక వెనుకబడిపోతున్న పసిబిడ్డలకు ప్రాథమిక విద్యాబోధన ఏర్పాటుచేయాలనుకుంటున్నాం. అంటే అ ఆల నుంచి అయిదో తరగతి వరకూ అందరికీ ఒకేవిధమైన విద్య శక్తివంతంగా అందాలి. పిల్లలకు తేటతెలుగులో చెప్పడం కష్టమైన పని. పాఠాలన్నీ ఫిల్ము తియ్యాలి. చెయ్యగలరా? చెప్పండి" అన్నారు ఎన్‌టీఆర్.

ఎన్‌టీఆర్ చెప్పిన పనిలో సాధక బాధకాలు తెలుసుకుని అప్పటి స్థితిగతులపై రిపోర్టు ఇవ్వడానికి బాపు రమణలు పదిరోజులు సమయం అడిగారు. వారు కృష్ణా గోదావరి జిల్లాల్లో తిరిగి పల్లెటూళ్ళలో చదువుల గురించి వీడియో ఫిల్ములు తీశారు. "చాలా ఊళ్ళలో పాడుబడ్డ పెంకుటిళ్ళు, పూరిపాకలే స్కూళ్ళు. నాలుగైదు క్లాసులకి ఒకరిద్దరే మాస్టార్లు. స్కూలంతా గోలగోల. ఒక స్కూల్లో బ్లాక్‌బోర్డు లేక తలుపుల మీదనే సుద్దముక్కతో అక్షరాలూ, గుణింతాలూ, అంకెలూ రాసి చెప్తున్నారు. ఆ వచ్చిన పిల్లల్లో కూడా ఏడెనిమిదేళ్ళ పిల్ల చంకలో రెండేళ్ళ పసిబిడ్డ ఉంది. వీళ్ళని స్కూలుకి పంపిన తల్లి తను కూలికి వెళ్ళింది. ఇక్కడ వీళ్ళు చదివేస్తారని కాదు. తను పొట్టకోసం కూలికి వెళ్తే వీళ్ళు ఇక్కడ నీడపట్టున ఉంటారనీ, మద్దినేళ (మధ్యాహ్నం) పట్టెడన్నం పెడతారనీ ఆశ" అని ముళ్ళపూడి చెప్పారు.

మొత్తం నలభై అయిదు నిమిషాల వీడియో ఫిల్ముతో బాపు-రమణలు హైదరాబాదుకు తిరిగి వచ్చి, ఎన్‌టీఆర్‌కు, ఆయన వేసిన కమిటీకి వీడియో చూపెట్టారు. పిల్లల పాఠాలు 16 ఎంఎం ఫిలింలో తీయాలన్నారు ఎన్‌టీఆర్. "ప్రొజెక్టర్లలో ఫిల్ము ఎక్కించడం, తెగిపోతే అతికించడం ఎలిమెంటరీ స్కూలు టీచర్లకు చాలా కష్టమైన పని... వీడియో అయితే టేపు ముందుకీ వెనక్కీ నడపవచ్చు. మూడు గంటల పాఠాలు చూపే వీడియో టేపు ధర రెండు వందలు. అదే సినిమా ఫిలిం అయితే యాభై లక్షలు. ప్రతి స్కూలుకీ ఒక ప్రొజెక్టరూ, స్క్రీనూ

కొనిచ్చే బదులు వీడియో అయితే ఒక టీవీ, ఒక వీడియో ప్లేయరూ కొనిస్తారు” అని కమిటీకి ముళ్ళపూడి చెప్పారు.

ఆ మర్నాడు బాపు–రమణలను మళ్ళీ పిలిచారు. ప్రాజెక్టు బడ్జెట్ ఎంతో, ఇద్దరికీ ఫీజెంతో చెప్పమన్నారు. బాపు–రమణలు ఫీజులు వద్దన్నారు. “అదేమిటి? ఊరికే ఎందుకు చెయ్యడం? విద్యాదానం కాబట్టి వీలునిబట్టి కొంచెం తగ్గించి ఎంతో కొంత చెప్పండి” అన్నారు. “విద్యాదానం అని మీరే అన్నారు గదా. మేము ఊరికే పని చేస్తాం” అన్నారు బాపు–రమణలు.

“అప్పుడు ఎన్‌టీఆర్ ఆయన సెక్రెటరీ రాఘవేంద్రరావు గారిని పిలిచి ‘డబ్బు తీసుకోరట. ఉచితంగా చేస్తారట’ అన్నారు. ఆ మసక వెల్తురులో ఆయన కళ్ళు చెమ్మగిల్లడం చూడలేదుగాని గొంతు గద్గదమవడం గమనించాను” అన్నారు ముళ్ళపూడి.

పిల్లలు బడికి పరుగెత్తేలా చెయ్యాలి అన్న లక్ష్యంతో బాపు–రమణలు వీడియో పాఠాల షూటింగ్ మొదలుపెట్టారు. పిల్లలని స్కూలుకి రప్పించి, ఆటపాటలతో అక్షరాలు, అంకెలు గుర్తించడం, రాయడం తెలిపారు. సముద్రం, అలలు షూట్ చేసి చూపించారు. ఆనకట్టలు చూపించారు. జూకి తీసుకెళ్ళి పులులూ, సింహాలూ, లేళ్ళూ చూపించారు. కూడికలూ, తీసివేతలూ, భాగహారాలూ సులువుగా అర్థమయ్యే రీతిలో చెప్పారు. పద్యాలు చెప్పించారు. పాటలు పాడించారు. సైన్సు, భూగోళం సిలబస్ ప్రకారం పాఠాలు చిత్రీకరించారు. తరువాతికాలంలో ఎ.ఆర్.రహమాన్‌గా ప్రసిద్ధికెక్కిన దిలీప్ వీడియో పాఠాలకు హాయైన జింగిల్స్ అందించారు. అప్పటికింకా మణిరత్నం సినిమా ‘రోజా’ రాలేదు.

32 గంటల వీడియో పాఠాలు తయారయ్యాయి. వాటిలో 20 గంటల పాఠాలు చూసి ఎన్టీఆర్ పులకించిపోయారు. నాలుగువేల మంది ప్రేక్షకుల సమక్షంలో లలిత కళాతోరణం ప్రాంగణంలో బాపు–రమణలను ప్రతిష్ఠాత్మక రఘుపతి వెంకయ్య అవార్డుతో సత్కరించారు.



వీడియో ప్రాజెక్టు గురించి హిందూ దినపత్రిక వీడియో పాఠాల వల్ల పిల్లలకు మేలు జరుగుతుందని పొగుడుతూ రాసింది. ప్రాజెక్టు గురించి ఢిల్లీకి రిపోర్టులు చేరాయి. ఎన్.సి.ఇ.ఆర్.టి. వాళ్ళు వీడియోలు చూడాలన్నారు. బాపు-రమణలు, విద్యాశాఖ సెక్రటరీ బి.వి.రామారావు టేపులతో ఢిల్లీ వెళ్తున్నప్పుడు ఎన్టీఆర్ గర్వంతో పొంగిపోయారు. వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చిన ఇరవై అయిదుమంది నిపుణులు ఢిల్లీలో వీడియోలు చూసి మెచ్చుకున్నారు. అప్పటి కేంద్ర విద్యామంత్రి పి.వి.నరసింహారావు కూడా వీడియోలు చూసి, వాటిని అన్ని భాషల్లోనూ డబ్బింగ్ చేయాలని ప్రతిపాదించారు. కానీ బాపు-రమణలు అలా వద్దన్నారు. ప్రతిభాషకు తనదైన సొగసు ఉంటుందని, అందువల్ల పాఠాలను ప్రతి భాషలో విడిగా చేస్తే మేలని వారు సూచించారు. ఈ విషయంలో ఉచితంగా సాయం చేస్తామన్నారు. "కాని ఈ ప్రతిపాదన ఢిల్లీవారికి నచ్చలేదు. దక్షిణాది వారు మనకి (ఉత్తరాది) నేర్పేదేమిటని చెప్పారుట. అమిత మితభాషి పివిగారు తల పొదుపుగా పంకించారు" అని ముళ్ళపూడి రాశారు. అలా దేశవ్యాప్తంగా పిల్లలు చూడాల్సిన వీడియో పాఠాలు తెలుగు పిల్లలకు మాత్రమే చూసే భాగ్యం దక్కింది.


ఇక రెండు గంటలు తీస్తే మూడవ తరగతి వరకు వీడియో పాఠాలు పూర్తవుతాయి. ఆ తరువాత నాలుగు, అయిదు తరగతుల పాఠాలు చేయాలి. అప్పుడు ప్రభుత్వం మారిపోయింది. చెన్నారెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. "రాయబేరాలు వచ్చాయి. ఇలాటివి మాకిష్టం లేదు. చేతకాదు అన్నాం" అన్నారు ముళ్ళపూడి. ప్రాజెక్టు కొనసాగించాలా లేదా అని ప్రభుత్వం చెప్పలేదు. తరువాత జనార్ధనరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మూడవ తరగతి కొరవ పూర్తిచేయమని నిధులు మంజూరుచేశారు. నాలుగు, అయిదు తరగతుల పాఠాలు పట్టించుకోలేదు. చివరకి ఒక మహత్తరమైన ప్రాజెక్టు పరిపాలకుల హ్రస్వదృష్టి కారణంగా మూలన పడిపోయింది. తెలుగు పిల్లలకి తీరని అన్యాయం జరిగింది.

ఒకరోజు ఎన్టీఆర్ తన వ్యక్తిగత ఉత్తరాలు చూసుకుంటుండగా ఆయనను కలుసుకోవడానికి కవి నాగభైరవ కోటేశ్వరరావు వెళ్ళారు. తాను చదువుతున్న ఒక పోస్టుకార్డు ఆయన చేతికిచ్చి చదవమని ఎన్టీఆర్ చెప్పారు. అది పదవ తరగతి చదువుతున్న ఓ బంధువుల అబ్బాయి రాసిన ఉత్తరం. 'చిరంజీవి పెదనాన్నగారికి ఆశీస్సులతో..' అలా ఆ ఉత్తరం మొదలవుతుంది. "మనం నేర్పుతున్న చదువులు ఇలా ఉన్నాయి. మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలు మట్టి కలిసిపోతున్నాయి. పెద్దవారిని ఎలా సంబోధించాలో తెలియని స్థితిలో మనం విద్యాబోధన చేస్తున్నాం" అని ఎన్టీఆర్ వాపోయారు.

"మనం ప్రాథమిక వాచకాలను మొదట మార్పిద్దాం. కొత్తవి తయారుచేయిద్దాం. అవి తెలుగుజాతి చరిత్రకు, సంప్రదాయాలకు, ఆచారాలకు అద్దం పట్టాలి" అన్నారు ఎన్టీఆర్. వెంటనే విద్యామంత్రి ఇంద్రారెడ్డిని పిలిచి "కొత్త వాచకాలను రాయించండి. ముందు సిలబస్ కమిటీని వేయండి" అని చెప్పారు ఎన్టీఆర్.

మధురాంతకం రాజారాం, నాగభైరవ కోటేశ్వరరావు, గుంటూరులో బాలకుటీర్ నడుపుతున్న విద్యావేత్త డా.ఎన్.మంగాదేవి, కేతవరపు రామకోటిశాస్త్రి, హిందీ రచయిత వేమూరి రాధాకృష్ణమూర్తిలతో విద్యాశాఖ సెక్రటరీ కె.సుజాతారావు అధ్యక్షతన ఒక కమిటీ ఏర్పాటయింది. ఆ కమిటీ ముందుగా బాపు–రమణలు రూపొందించిన వీడియో పాఠాలను చూసింది. 1931 నుండి ప్రచురించిన తెలుగు వాచకాలను పరిశీలించింది. ఆ తరువాత వందమందికి పైగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, మేధావులు, విద్యావేత్తలు, జర్నలిస్టుల అభిప్రాయాలు సేకరించింది. తెలుగు వాచకాలు వాడుకభాషలో ఉండాలని, మన సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టాలని, మతసామరస్యాన్ని, దేశభక్తిని, దేశం పట్ల ప్రేమను పిల్లల్లో పాతుకుపోయేట్లు చేయాలని అందరి అభిప్రాయం. ఒక నెల వ్యవధిలో ఆ కమిటీ సిలబస్ తయారుచేసి ముఖ్యమంత్రికి సమర్పించింది. వాచక రచనకు వర్క్‌షాప్ పద్ధతి మంచిదని ఎన్‌టీఆర్ చెప్పారు. డాక్టర్ వెలగా వెంకటప్పయ్య, గొల్లపూడి ప్రకాశరావు, కలువకొలను సదానంద, దీవి రంగాచార్యులు, ఎన్.ఆదినారాయణలను వాచకాలు రాయడానికి పిలిచారు. ఇరవై రోజుల్లో వాచకాలు తయారయ్యాయి. "రామారావుగారు ఆ పుస్తకాలకు 'తెలుగు భారతి' అని నామకరణం చేశారు. బాపు ముఖచిత్ర రచన చేసారు. రామారావుగారు ప్రతి తరగతి వాచకానికి విద్యార్థుల స్థాయికి దిగి ముందుమాట రాశారు" అన్నారు నాగభైరవ కోటేశ్వరరావు.

మచ్చుకు రెండవ తరగతి వాచకానికి ఆయన రాసిన సందేశం –


యన్. టి. రామారావు
ముఖ్యమంత్రి

హైదరాబాదు
తేది 18–3–1988.

సందేశం

చిరంజీవులారా !

మీరు మా జాతి పండించుకొన్న అదృష్టఫలాలు

చదువుతో జ్ఞానం వస్తుంది. జ్ఞానం మనిషికి మేలు చేస్తుంది. బాగా చదివి విజ్ఞానం పొందాలి. మంచి పౌరులుగా దేశాన్ని దిద్దితీర్చాలి. ఇది నా ఆశ. ఇవి నా ఆశీస్సులు.

నందమూరి తారక రామారావు

ఆ వాచకాలు 1988 విద్యాసంవత్సరం నుంచి వాడుకలోకి వచ్చాయి. "సంప్రదాయ విరుద్ధంగా ఒక కుర్రాడు రాసిన ఉత్తరం తెలుగుజాతి బాలల విద్యా చరిత్రలో ఒక మైలురాయిలా నిలిచింది" అని నాగభైరవ కోటేశ్వరరావు గారు చెప్పారు.

ఎన్‌టీఆర్ ముఖ్యమంత్రి అయిన తరువాత తెలుగును అధికారభాషగా ప్రకటించారు. అధికారభాష అమలు తీరుతెన్నులు గురించి జరిగే సమీక్షా సమావేశాల్లో ప్రతి అంశాన్నీ కూలంకషంగా అర్థం చేసుకోవడానికి ఎన్టీఆర్ ప్రయత్నించేవారు. అలాంటి ఒక సమావేశంలో కోర్టుల్లో వాదనలు తెలుగులో జరిగితే సామాన్య జనానికి కూడా విషయాలు అర్థమవుతాయని ఒక సభ్యుడు ప్రతిపాదించాడు. ఆ ప్రతిపాదనకు మిగతా సభ్యులు మద్దతు తెలిపారు. అందరూ చెప్పింది విన్న తరువాత "కాలేజీల్లో చట్టాల్ని ఏ భాషలో బోధిస్తున్నారు?" అని ఎన్టీఆర్ అడిగారు. దానికి సమాధానం:'ఇంగ్లీష్'. అప్పుడు ఆయన చెప్పిన మాట ఆయనలోని పరిపక్వతకు అద్దం పడుతుంది. "ఇంగ్లీషులో చట్టాల్ని బోధించి, వకీళ్ళని తెలుగులో వాదించమంటే ఎలా కుదురుతుంది? ముందు చట్టాల్ని తెలుగులోకి అనువాదం చేయించండి" అని చెప్పి ఎన్టీఆర్ సమీక్షా సమావేశాన్ని ముగించారు.

షెడ్యూల్డ్ కులాలు, తెగలు, ఇతర బలహీన వర్గాలకు చెందిన విద్యార్థుల కోసం గురుకులం పేరుతో ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు నెలకొల్పాలన్న ఆలోచన ఎన్టీఆర్‌దే. చక్కని వసతులతో, ఆహ్లాదకరమైన వాతావరణంలో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో గురుకుల్ స్కూళ్ళు నెలకొల్పారు. ఒకరకంగా నాణ్యమైన విద్యకు నోచుకోని గ్రామీణ విద్యార్థులకు గురుకులాలు దేవాలయాలతో సమానం.

ఉన్నతవిద్యకు ప్రభుత్వం అందిస్తున్న నిధులు ఏమాత్రం సరిపోవని ఎన్టీఆర్‌కు స్పష్టంగా తెలుసు. విద్యావ్యవస్థలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రవేశపెట్టడానికి ప్రయత్నించిన తొలితరం నాయకులలో ఆయన ఒకరు. ఆయన ఆలోచనల ఫలితంగా ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంలో ఉన్నతవిద్యను అందించేందుకు కో-ఆపరేటివ్ కాలేజీలు వెలిశాయి. వృత్తివిద్యను అందించేందుకు మోడల్ ఇనిస్టిట్యూట్లు వెలిశాయి. దరిమిలా అవి డీమ్డ్ యూనివర్సిటీలుగా మారాయి. విద్యారంగాన్ని ప్రైవేటీకరణ చేయడం వల్ల వచ్చే దుష్పరిణామాలు ఆయనకు తెలుసు. అందుకే ఆయన ట్యూషన్ ఫీజును ప్రవేశపెట్టారు. గ్రేడెడ్ ఫీజు పద్ధతిని అనుమతించడం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులకు అదనపు సబ్సిడీ అందేలా వెసులుబాటు కల్పించారు.

సమాజంలో చైతన్యానికి, ఆర్థికాభివృద్ధికి విద్య ఆలంబన అని ఎన్‌టీఆర్ నమ్మారు. "విద్య, ఆరోగ్యం మాత్రమే ప్రత్యేకంగా చర్చించడానికి దేశంలో జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్సు ఏర్పాటు చేసిన మొట్టమొదటి ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్" అని జయప్రకాష్ నారాయణ చెప్పారు.

విద్య విలువ తెలిసిన మహనీయుడు ఎన్‌టీఆర్. కాకపోతే విద్యారంగంలో ఆయన ప్రవేశపెట్టిన బృహత్తర సంస్కరణలు ఆయన అమలుచేసిన సంక్షేమ పథకాల వెల్లువలో అంతగా గుర్తింపుకు నోచుకోలేదు.

# బుద్ధ విగ్రహం

హైదరాబాద్‌లోని హుస్సేన్ సాగర్ తటాకం మధ్య ప్రతిష్ఠించిన బుద్ధుని విగ్రహం ఎన్టీఆర్‌కు ప్రీతిపాత్రమైనది. తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే ఆ విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని ఆయన ఉవ్విళ్లూరారు. స్వతహాగా బొమ్మలు గీయడంలో ప్రావీణ్యమున్నవారు కావడం వల్ల విగ్రహం తయారవుతున్న సమయంలో అప్పుడప్పుడూ అక్కడకు వెళ్లి రాతిలోనుండి బయటికి తీస్తున్న విగ్రహం రూపురేఖలు గమనించేవారు. శిల్పులతో మాట కలిపేవారు. విగ్రహం ఆవిష్కరణకు జపాన్ చక్రవర్తిని ప్రత్యేక అతిథిగా పిలవాలని ఆశపడ్డారు. కాని విగ్రహం రూపుదిద్దుకోవడంలో ఆలస్యమైంది. ఆ కారణంగా ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో విగ్రహావిష్కరణ జరుగలేదు.

ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ 1984లో అమెరికా పర్యటించిన సమయంలో న్యూయార్క్‌లోని స్టాట్యూ ఆఫ్ లిబర్టీని చూసినప్పుడు, అలాంటిది హైదరాబాదులో ఎందుకు ఉండకూడదు అన్న ఆలోచన ఆయన మదిలో మెదిలింది. కాకతాళీయంగా, సుప్రసిద్ధ శిల్పి గణపతి స్థపతి కూడా అప్పుడు అమెరికాలో ఉన్నారు. అంతటి అనన్య సామాన్యమైన కట్టడం నిర్మించగలరా అని ఎన్‌టీఆర్ ఆయనను అడిగారు. అదీ హుస్సేన్ సాగర్ మధ్యలో 58 అడుగుల ఎత్తైన బుద్ధుని విగ్రహాన్ని ప్రతిష్ఠించడానికి ప్రేరణ. గణపతి స్థపతిని ప్రధాన శిల్పిగానూ, నిర్వాహకునిగానూ నియమిస్తూ ఎన్టీఆర్ ఆ ప్రాజెక్టును ప్రారంభించారు. 1931లో జన్మించిన గణపతి స్థపతి సాధారణ శిల్పి కారు.

కల్లూరి చంద్రమౌళి 1960 జనవరి 11న ఆంధ్రప్రదేశ్ దేవాదాయశాఖ మంత్రిగా పదవీ స్వీకారం చేశారు. ఆ తర్వాత 14వ తేదీన భద్రాచల రామాలయ పునరుద్ధరణ కమిటీని వేశారు. దానికి ఆయన అధ్యక్షులు. కార్యవర్గ సభ్యులలో జలగం వెంగళరావు, పైడి లక్ష్మయ్య ఉన్నారు. ఆ కమిటీ నిర్ణయం ప్రకారం తమిళనాడులోని రామనాథపురం వాస్తవ్యులు, శిల్పాచార్యులుగా చిన్నవయసుకే ప్రసిద్ధికెక్కిన గణపతి స్థపతిని ఆహ్వానించి దేవాలయ జీర్ణోద్ధరణ, కల్యాణ మంటపం, భక్తుల వసతికోసం సత్రాలను నిర్మించమని కోరింది. ఆ ప్రాజెక్టు కోసం గణపతి స్థపతి ఆధ్వర్యంలో ఐదు వందల మంది శిల్పులు మూడేళ్ళకు పైగా నిర్విరామంగా పనిచేశారు. అలా ఆ మహాశిల్పి గణపతి స్థపతిని ఆంధ్రప్రదేశ్‌కు తీసుకువచ్చిన ఘనత కల్లూరి చంద్రమౌళిగారికి దక్కుతుంది. చంద్రమౌళి నిజమైన గాంధేయవాది. 1955 నుంచి రెవెన్యూ శాఖమంత్రిగా, దేవాదాయ శాఖమంత్రిగా పనిచేసిన ఆయన శ్రీశైలంతో సహా ఎన్నో ప్రాచీన దేవాలయాలను సముద్ధరించారు. వారు భద్రాచలం దేవాలయ బోర్డు చైర్మన్‌గా పనిచేసిన కాలంలో భద్రాచలం దేవస్థానం తిరుమల

వేంకటేశ్వరస్వామికి బాకీ ఉన్న ఎనిమిది లక్షల రూపాయలను మాఫీ చేయించారు.

శ్రీశైలం దేవాలయం జీర్ణోద్ధరణ కూడా గణపతి స్థపతి ఆధ్వర్యంలోనే జరిగింది. ఆనకట్ట నిర్మిస్తున్న సమయంలో ముంపుకు గురయ్యే 102 గ్రామాలలో ఉన్న 108



దేవాలయాలను, ఆయన ఒక్కొక్క రాయినీ జాగ్రత్తగా తీసి వేరే ప్రాంతాలలో యథాతథంగా పునః ప్రతిష్ఠాపన చేయించారు. ఆయన శిల్పకళా నైపుణ్యాన్ని గుర్తించి హిమాలయ పర్వతాల్లో ఉన్న బదరీనాథ్ దేవాలయం మహామండపం నిర్మించమని అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధి ఆయనను కోరారు. బదరీనాథ్ మహామండపం భాగాలన్నింటినీ ఆయన విడివిడిగా హైదరాబాదులో చెక్కించి వాటిని బదరీనాథ్ తీసుకువెళ్లి మండపంగా నిర్మాణం చేశారు. ఆయన పనితనాన్ని కొనియాడుతూ ఒక బంగారు గొలుసు, 60 తులాల బంగారపు డాలర్ బహూకరించి ఆయనను ఇందిరాగాంధి సత్కరించారు. తిరుమలలోని వసంతరాయ మండపాన్ని కూడా ఆయన పునర్నిర్మించారు. తిరుమల తిరుపతి దేవస్థానానికి ఆస్థాన స్థపతి (చీఫ్ ఆర్కిటెక్ట్)గా నియమితులయ్యారు. అమెరికాలో పిట్స్‌బర్గ్ నగరంలోని బాలాజీ ఆలయం కూడా ఆయన సారథ్యంలోనే రూపుదిద్దుకుంది.

అటువంటి గొప్పశిల్పికి బుద్ధ విగ్రహం నిర్మాణ బాధ్యతలను ఎన్టీఆర్ అప్పగించారు. బుద్ధ పూర్ణిమ ప్రాజెక్టులో భాగంగా హైదరాబాదులోని హుస్సేన్ సాగర్ చెరువు మధ్యలో జిబ్రాల్టర్ రాతిపై బుద్ధుని గ్రానైట్ విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని నిర్ణయించారు.


గణపతి స్థపతి ఆధ్వరంలోని శిల్పుల బృందం విగ్రహానికి అనువైన రాయికోసం చాలాచోట్ల వెతికారు. హైదరాబాదులోని జూబిలీ హిల్స్‌తో ప్రారంభించి నరసరావుపేట వరకు అన్వేషించారు. చివరకు నల్గొండ జిల్లాలోని రాయగిరి గ్రామంలో ఒక తెల్లని ఏకశిలను ఎంపిక చేసుకున్నారు.

1985 అక్టోబర్ 2వ తేదీ. ఆరోజు రామగిరి కొండ మీద బుద్ధ విగ్రహం రూపుదిద్దే కార్యక్రమానికి ప్రారంభ ముహూర్తం. నిటారుగా ఉండే కొండపైకి ఎన్‌టీఆర్ నడిచి చేరుకున్నారు. శిలపై తొలిసారిగా ఉలిని తాటించడం, చెక్కడం ఆయన చేతులమీదుగా జరిగింది. ఉలిని పట్టుకొని ఒడుపుగా వంచి తలపై సుతారంగా సుత్తితో మోదారు ఎన్టీఆర్. అది గమనిస్తున్న గణపతి స్థపతి ఎన్టీఆర్‌కు నమస్కరించి “అయ్యవారు ఎన్నో ఏళ్ళ అనుభవం ఉన్న మహాశిల్పిలా ఉలిని చేతపట్టారు” అని మెచ్చుకున్నారు. బి.ఎన్.రెడ్డి గారి దర్శకత్వంలో నిర్మించిన మల్లీశ్వరి చిత్రంలో ఎన్టీఆర్ ఒక శిల్పి. “ఆ పాత్రకు న్యాయం చేయటం కోసం

పదిహేను రోజులు మద్రాసు నుండి మహాబలిపురం వెళ్ళి అక్కడ శిల్పుల వద్ద శిష్యునిగా తొలిపాఠాల్ని నేర్చుకున్నాను" అన్నారు ఎన్టీఆర్.

30 మంది శిల్పుల బృందం 8,000 టన్నుల బరువైన రాయిని కొండనుంచి వేరు చేయడానికి శ్రమించింది. గణపతి స్థపతి ఊహలకు అనుగుణంగా బుద్ధ విగ్రహం రూపుదిద్దుకుంది. శిల్పం తయారీకి మూడేళ్లు పట్టింది. నిలుచున్న భంగిమలో, పైనుంచి క్రిందికి చుట్టబెట్టుకున్న ఒకే వస్త్రంతో, జ్ఞానముద్ర ధరించిన బుద్ధుని విగ్రహం దాదాపు 800 టన్నుల బరువుతో తయారైంది.

రాయగిరిలో ప్రాథమికంగా చెక్కడం పూర్తయిన శిల్పాన్ని 60 కిలోమీటర్ల దూరం ఉన్న హైదరాబాదుకు చేర్చడం చాలా కష్టమైన వ్యవహారంగా తేలింది. 60 టన్నుల వరకు బరువును మోయగల వాహనాలు అందుబాటులో ఉన్నాయి. కానీ 800 టన్నుల బరువైన విగ్రహాన్ని హైదరాబాద్‌కు చేర్చాలంటే ప్రత్యేక వాహనాన్ని తయారుచేయాలి. అంత బరువును రోడ్డు తట్టుకోగలదన్న నమ్మకం లేదు. కొన్నిచోట్ల రోడ్డు కుంగిపోవచ్చు. ఒకటి రెండు వంతెనలు బలహీనంగా ఉండి బరువును మోయలేక కూలిపోయే ప్రమాదం ఉంది.




శిల్పాన్ని హుస్సేన్ సాగర్ ఒడ్డుకు చేర్చడానికి ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఒక సంస్థ రెండు కోట్ల రూపాయలకు టెండర్ గెల్చుకుంది. రోడ్డును, వంతెనలను బరువు తట్టుకునే విధంగా బలంగా తయారుచేయడం కూడా కాంట్రాక్టులో భాగమే. 192 చక్రాలు, 24 ఇరుసులు గల ఒక ప్రత్యేక వాహనం తయారైంది. దాంట్లో రాయగిరి నుంచి హైదరాబాదుకు శిల్పాన్ని విజయవంతంగా చేర్చారు.

హైదరాబాదు చేరిన తరువాత శిల్పాన్ని పంట్లల్లోనూ, లాంచీలపైనా విగ్రహాన్ని హుస్సేన్

సాగర్ మధ్యకి చేర్చవలసి ఉంది. పంట్ల బదులు, చెరువు మధ్యవరకు రోడ్డును వేస్తే బాగుంటుందని ఒక ఇంజినీర్ మంచి సలహా ఇచ్చారు కాని ఆ సూచనకు ఆమోదం లభించలేదు. బుద్ధుడి విగ్రహం చేరవేతకు భారీ క్రేన్లు, ఇతర పరికరాలు ఒక సంస్థ నుంచి అద్దెకు తెచ్చారు. కొందరు అధికారులు సమయం వృథా కాకుండా పని పూర్తిచేయాలని ఉత్సాహపడ్డారు. పంట్లలో చేరివున్న నీటిని ఇతర సమస్యల్ని సరిగ్గా అంచనా వెయ్యలేకపోయారు. ఫోటిల్లా ఉన్నట్టుండి తలకిందులైంది. వీడియోగ్రాఫర్లు పరికరాలతో సహా మునిగిపోయారు. కాంట్రాక్టర్ కంపెనీ మేనేజర్, కొందరు కార్మికులు కూడా నీట మునిగారు. వారిని రక్షించడం సాధ్యపడలేదు.

ప్రమాదం జరిగిన రోజు ముఖ్యమంత్రి చెన్నారెడ్డి బెంగళూరులో ఉన్నారు. దుర్వార్త వినగానే తన పర్యటనను రద్దుచేసుకుని ప్రత్యేక విమానంలో హైదరాబాదు తిరిగి వచ్చారు. హైదరాబాదులో విగ్రహాన్ని ప్రతిష్ఠించడంపై మొదటినుంచి బహిరంగంగా విమర్శించిన చెన్నారెడ్డి విగ్రహం ముంపుకు తనే కారణమంటారేమోనని ఇబ్బందిపడి హడావిడిగా హైదరాబాద్ వచ్చారు కానీ ప్రమాదానికి ఆయననే తప్పుపట్టారు. ఎన్టీఆర్‌పై ఉన్న పగను చెన్నారెడ్డి అలా తీర్చుకున్నారని చాలామంది అన్నారు.

ఆ ఘటనను గురించి అసెంబ్లీలో వేడివేడి చర్చలు జరిగాయి. విగ్రహం మునిగిపోవడం బుద్ధుని పట్ల అపచారం చేయడమే అని ఎన్టీఆర్ ఆరోపించారు. ప్రపంచవ్యాప్తంగా బౌద్ధులంతా ఈ సంఘటనతో దిగ్భ్రాంతికి లోనయ్యారని అన్నారు. "ప్రభుత్వ అసమర్థత కారణంగా తాను ఎన్నాళ్లగానో కలలు గని, ఎంతో శ్రమకోర్చి రూపొందించిన బుద్ధవిగ్రహం నీటమునిగి పోయింది" అని ఆయన ఆవేదనతో మాట్లాడారు. ఆయన భావోద్వేగంతో ప్రసంగిస్తుండగా కాంగ్రెస్ సభ్యులు ఆయన ప్రసంగాన్ని అడ్డుకున్నారు. కళ్లు చెమర్చితే వేళాకోళం చేశారు. "నా బాధను, ఆవేదనను వ్యక్తీకరిస్తుంటే మీరు నన్నిలా వెక్కిరిస్తారా?" అంటూ వారి ప్రవర్తనను ఈసడించుకుని కోపంతో ఎన్టీఆర్ శాసనసభ నుంచి వాకౌట్ చేశారు.

బుద్ధుని విగ్రహం చాలాకాలం జలవాసం చేసింది.

బుద్ధ విగ్రహం ముంపు ఎన్టీఆర్‌కు సానుకూలంగా మారడం కాంగ్రెస్‌ను ఆశ్చర్యానికి గురిచేసింది. అంతకు ముందు టాంక్‌బండ్ రోడ్డుపై ముప్ఫైమూడు మంది తెలుగు మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేసినందుకు ఎన్టీఆర్ విమర్శలు ఎదుర్కొన్నారు. కానీ ఇప్పుడు బుద్ధవిగ్రహం విషయంలో కాంగ్రెస్ పార్టీ విమర్శలపాలయింది. ప్రజల్లో ప్రభుత్వంపై ఆగ్రహం, వ్యతిరేకత పెల్లుబికింది. ఈ పరిణామాన్ని గుర్తించి తమ ప్రభుత్వం విగ్రహ ప్రతిష్ఠాపన కోసం అన్నివిధాల ప్రయత్నాలు చేస్తుందని చెన్నారెడ్డి ప్రకటించారు.

ఎటువంటి కష్టనష్టాలు ఎదురైనా విగ్రహాన్ని తటాకం మధ్యకి చేరుస్తామని కాంట్రాక్టర్

కంపెనీ హామీ ఇచ్చింది.

ఎట్టకేలకు విగ్రహాన్ని బయటకు తీశారు.

అదృష్టవశాత్తూ విగ్రహం చెక్కుచెదరలేదు. దాన్ని సురక్షితంగా తటాకం మధ్యకి చేర్చారు. అక్కడ పూర్తిస్థాయిలో విగ్రహాన్ని చెక్కడానికి, మెరుగులు దిద్దడానికి కొంత సమయం పట్టింది. చివరకు విగ్రహ ప్రతిష్ఠాపన చెన్నారెడ్డిగారి హయాంలో జరగలేదు కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగానే జరిగింది. నిర్మాణం పూర్తయ్యేసరికి 350 టన్నుల బరువుతో, 57.9 అడుగులు ఎత్తు, 21 అడుగులు వెడల్పుతో బుద్ధవిగ్రహం శోభాయమానంగా రూపుదిద్దుకుంది.

1990లో భారత ప్రభుత్వం గణపతి స్థపతిని పద్మశ్రీ బిరుదుతో సత్కరించింది.

గణపతి స్థపతి కంచి పరమాచార్య చంద్రశేఖరస్వామికి పరమభక్తుడు. చివరిరోజుల్లో కాంచీపురం దగ్గర శంకర శిల్పశాలను నిర్మించి, అందులో వాస్తు, శిల్ప, ఆగమ శాస్త్రాల్లో విద్యార్థులకు శిక్షణనిస్తూ, అక్కడే 2017 ఏప్రిల్ 7వ తేదీన తుదిశ్వాస విడిచారు. భౌతికదేహాన్ని విడిచిపెట్టినా, ఆయన రూపొందించిన శిల్పాలు అజరామరంగా నిలుస్తాయి. భాగ్యనగరానికి బుద్ధవిగ్రహం శోభస్కరంగా, స్ఫూర్తిదాయకంగా నిలిచింది. హుస్సేన్ సాగర్ మధ్యలో నిలబడి ఉండే విగ్రహం ప్రత్యేక సందర్భాల్లో రాత్రిపూట విద్యుద్దీపాల మధ్య వెలిగిపోతూ ఆ మహోన్నత కళాకారుడి నైపుణ్యానికి, ఎన్టీఆర్ నిబద్ధతకు తార్కాణంగా కాంతులీనుతుంటుంది.



# ఆధిపత్యం కోసం పోరాటం

ఎన్టీఆర్‌తో కలిసి అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో రాష్ట్రమంతా తిరిగి, సభల్లో అనర్గళంగా ఉపన్యసించిన లక్ష్మీపార్వతి, విజయంలో తన పాత్ర గణనీయమని అనుకున్నారు. అది కొంతవరకు నిజం కూడా. ఆమె సహకారం లేకపోతే ఎన్‌టీఆర్ అంత విస్తృతంగా ప్రచారం చేసేవారు కాదేమో. ఎన్నికల్లో తన విజయంలో ఆమె పాత్ర గణనీయమని ఎన్‌టీఆర్ కూడా ఉదారంగా అంగీకరించారు.

ఎన్‌టీఆర్ అండతో లక్ష్మీపార్వతి ప్రభ దేదీప్యమానంగా వెలుగుతోంది. ఎన్‌టీఆర్ తిరిగి శక్తి పుంజుకోవడానికి లక్ష్మీపార్వతి కారణమని ఆమె చుట్టూ చేరినవారు భజనచేశారు. అది తెలుగుదేశం పార్టీలోని సీనియర్ నాయకులకు, ఎన్టీఆర్ కుటుంబసభ్యులకు రుచించేది కాదు. ఆమెపట్ల అవసరాన్ని మించిన ఔదార్యాన్ని ఎన్‌టీఆర్ చూపిస్తున్నారని వారు భావించారు. ఆయన మంచితనాన్ని ఆమె తన స్వార్థానికి వాడుకుంటోందని వారు ఆరోపించారు.

1995 జనవరి 8న జింఖానా మైదానంలో ఎన్‌టీఆర్ దంపతులను చిత్రసీమ ఘనంగా సన్మానించింది. ఆనాటి సభకు నటులు మోహన్‌బాబు, రాజశేఖర్, కృష్ణ, చిరంజీవి, వెంకటేష్, నాగార్జున, జగపతిబాబు, రజనీకాంత్, అనిల్ కపూర్, సునీల్ దత్, జమున, జయసుధ, జయచిత్ర, రమ్యకృష్ణ, రోజా, విజయనిర్మల, జీవిత వంటి వారంతా హాజరయ్యారు. కార్యక్రమానికి శివాజీ గణేశన్ అధ్యక్షత వహించారు. "వచ్చేసారి నేను మిమ్మల్ని కలుసుకునేటప్పటికి మీరు ప్రధానమంత్రి కావాలి. అది నా ఆకాంక్ష" అని ఆయన అన్నారు. ఆ సభలో బియ్యం సబ్సిడీ పథకానికి రాజశేఖర్ రెండు లక్షల రూపాయల చెక్కును అందించారు. ఈ కార్యక్రమానికి గైర్హాజరైన ప్రముఖుల్లో ఏఎన్నార్ ఒకరు. తమను సన్మానించి గౌరవించిన సినీ కళాకారులకు ఎన్‌టీఆర్ కృతజ్ఞతలు తెలిపారు. సభలో తన మిత్రులు ఏఎన్నార్ లేని లోటును గుర్తుచేసుకుని "ఆయనకు నామీద కోపమెందుకో నాకు తెలియదు. తెలియక నేనేదైనా అపకారం చేసివుంటే నన్ను మన్నించమని కోరుతున్నాను" అని వాపోయారు ఎన్‌టీఆర్.

ఎన్‌టీఆర్ తొలిసారి ముఖ్యమంత్రి అయినప్పుడు హైదరాబాదులో ఫిల్మ్ స్టూడియో నిర్మాణానికి ప్రభుత్వం ఏఎన్నార్‌కు కేటాయించిన భూమి ఉపయోగంపైన వివాదం తలెత్తింది. అనేక సంవత్సరాల స్నేహాన్ని కాలరాచి ఎన్‌టీఆర్ తనను దొంగదెబ్బ కొట్టారని ఏఎన్నార్ తీవ్రంగా విరుచుకుపడ్డారు. కడదాకా పోరాడుతానని శపథం చేశారు. ఆనాటి నుంచి వారిద్దరి మధ్య రాకపోకలు లేవు. మాటలూ లేవు. ఈ నేపథ్యంలో ఆయన సన్మాన సభకు రాలేదు.

సన్మానోత్సవం పూర్తయిన తరువాత లక్ష్మీపార్వతి రంగంలోకి దిగారు. ఏఎన్నార్

కుమారుడు నాగార్జున సాయంతో ఎన్‌టీఆర్, ఏఎన్నార్‌ల మధ్య సయోధ్య కుదిర్చేందుకు మధ్యవర్తిత్వం వహించి విజయం సాధించారు. ఎన్‌టీర్‌ను కలుసుకోవడానికి ఆయన ఇంటికి ఏఎన్నార్ వచ్చారు. వారి మధ్య మళ్లీ పాతరోజుల సుహృద్భావ వాతావరణం నెలకొంది. పంతాన్ని, వైరాన్ని మరచిపోయారు. ఆరోజు తరువాత వాళ్లిద్దరూ తరచుగా కలిసి, తాము సినీరంగంలోకి ప్రవేశించిన తొలిరోజులను, వారి చిత్రవిజయాలను నెమరేసుకునేవారు. చాలా ఏళ్ళ తరువాత తామిద్దరినీ మళ్లీ దగ్గరకు చేర్చినందుకు లక్ష్మీపార్వతికి ఎన్‌టీఆర్ ధన్యవాదాలు చెప్పారు. అలాగే గానగంధర్వుడు మంగళంపల్లి బాలమురళీకృష్ణ, ఎన్‌టీఆర్ మధ్య ఏర్పడిన అసంకల్పిత వైరాన్ని తొలగించేందుకు కూడా లక్ష్మీపార్వతి కృషి చేశారు. ఎన్‌టీఆర్ తొలిసారి ముఖ్యమంత్రిగా ఉండగా అకస్మాత్తుగా సంగీతకళా అకాడమీని రద్దుపరిచారు. అప్పుడు ఆ అకాడమీకి గౌరవ అధ్యక్షులు మంగళంపల్లి బాలమురళీకృష్ణ. అకాడమీ రద్దును నిరసిస్తూ తాను ఇక ఆంధ్రప్రదేశ్‌లో పాడనని శపథం చేశారు. ఐఏయస్ అధికారి రమణాచారి సహాయంతో ముఖ్యమంత్రి ఎన్‌టీఅర్, బాలమురళీకృష్ణల మధ్య రగిలిన మంటను లక్ష్మీపార్వతి చల్లార్చారు. ఒక సభలో అపూర్వమైన రీతిలో ఎన్‌టీఆర్ ఆయన ముంజేతికి కంకణం తొడిగి, కైమోడ్పులర్పించి సత్కరించారు. దాంతో పుష్కరకాలంగా వారిద్దరి మధ్య ఏర్పడ్డ అపోహకు తెరపడింది.

ఎన్‌టీఆర్ జీవితంలో ఇలాంటి చిన్నచిన్న సమస్యలను లక్ష్మీపార్వతి చాకచక్యంతో పరిష్కరించి ఆయన మన్ననకు పాత్రురాలయ్యారు.

ఎన్‌టీఆర్ ఆరోగ్యం నిలకడగా లేదు. ఆ విషయం లక్ష్మీపార్వతి కంటే తెలిసినవారు మరొకరు లేరు. చంద్రబాబు గానీ, ఎన్‌టీఆర్ కుటుంబసభ్యులు గానీ తనను గౌరవంగా చూడరనే శంక సహజంగానే ఆమెను ఎప్పుడూ పీడించేది. ఆమె వయసు కూడా ఏమీ ఎక్కువ కాదు. వయసు దృష్ట్యా ఎన్‌టీఆర్ తోడులేకుండా తాను గడపవలసిన ముందు జీవితాన్ని గురించి ఆమెకు అవగాహన ఉంది. ఎన్టీఆర్‌తో బంధం వల్ల రాజకీయాల్లో ఆమె అట్టడుగు నుండి ఒక్కసారిగా పైస్థాయికి చేరుకుంది. వర్గ రాజకీయాలు ఎన్‌టిఆర్‌కు గిట్టవు. అది తెలిసి కూడా తన పరిస్థితుల నేపథ్యంలో ఆమె తన సొంత వర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. తన పట్ల విశ్వాసం వ్యక్తం చేసిన నాయకులకు తన వర్గంలో చోటిచ్చారు. తన ఇల్లు కేంద్రంగా ఏర్పడ్డ వర్గం గురించీ, కొత్తగా తన ఇంటిచుట్టూ మూగుతున్న నాయకుల గురించీ ఎన్‌టీఆర్‌కు తెలిసినా ఆ విషయంలో ఆయన లక్ష్మీపార్వతిని ప్రశ్నించలేదు.

లక్ష్మీపార్వతి రాజకీయ ఆశయాలను శ్రద్ధగా గమనించిన చంద్రబాబు, ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు ఆమెనూ, ఆమె బృందాన్నీ తప్పు పట్టారు. ఆమెకు కొండంత అండ ఎన్‌టీఆర్. ఎన్‌టీఆర్ ఆమెకు వత్తాసు పలకకపోతే ఆమెను లెక్క చేయాల్సిన పనిలేదు. రాజకీయ ఎత్తుగడల విషయంలో చంద్రబాబుకు, ఆమెకు సామ్యం లేదు. కానీ

ఇచ్చకాలమారులైనవారి మాటలు విని ఆమె చంద్రబాబునూ, ఆయన యుక్తినీ గుడ్డిగా తక్కువ అంచనా వేశారు. అధికారం కోసం తన చుట్టూ జరుగుతున్న పోరాటాన్ని ఎన్‌టీఆర్ సీరియస్‌గా పట్టించుకోలేదు. ఆయన మహానాయకుడే కానీ రాజకీయ నాయకుడిగా అమాయకులు. పోరు లక్ష్మీపార్వతికి చంద్రబాబుకు మధ్య మాత్రమే అని భావించారు.

లక్ష్మీపార్వతిని రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషించమని ఎన్‌టీఆరే ప్రోత్సహించినప్పటికీ, పాలనా సంబంధమైన వ్యవహారాలకు వచ్చేసరికి ఆయన అనుభవజ్ఞులైన వ్యక్తులమీదనే ఆధారపడ్డారు. ఎన్‌టీఆర్‌కు చంద్రబాబు సామర్థ్యం బాగా తెలుసు. ఎన్‌టీఆర్ దృష్టిలో పరిపాలన అంటే తక్షణ న్యాయం, సమస్యలకు తక్షణ పరిష్కారం. ఆయన నైజానికి రాజకీయ జీవితం పొసగని విషయం. కానీ ప్రజలు తనకు పట్టం కట్టిన తరువాత తన ప్రభుత్వం చక్కటి పరిపాలనా విధానంతో ప్రజలకు సేవ చేయడమే ముఖ్యమని ఆయన భావించారు. ఈ ఎజెండా ఎన్టీఆర్‌లో చివరివరకు స్థిరంగా ఉండేది. ఆకట్టుకునేలా ప్రసంగించే నేర్పుగల భార్య పట్ల మక్కువ పెంచుకున్నప్పటికీ, ప్రభుత్వాన్ని సమర్థవంతంగా నడపాలంటే చంద్రబాబు మాత్రమే దానికి అర్హుడని ప్రభుత్వంలో అతి ముఖ్యమైన ఆర్థిక, రెవిన్యూ శాఖలను ఆయనకు అప్పచెప్పారు. కాకపోతే లక్ష్మీపార్వతి ఈ విషయాన్ని కూడా తన ఖాతాలో వేసుకున్నారు. చంద్రబాబుకు జోడు మంత్రిత్వ శాఖలు దక్కడంలో తన ప్రమేయం ఉందని చెప్పారు. కాని ఆమె ప్రగల్భాలను ఎవరూ నమ్మలేదు.

పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ తనకంటూ ఓ స్థానాన్ని ఏర్పరుచుకోవాలని లక్ష్మీపార్వతి ప్రయత్నించారు.ఎన్‌టీఆర్ భార్యగా ఆమె హోదా అసామాన్యం. కాని ఆమె దాంతో తృప్తి చెందలేదు. తన ఆశయాన్ని వీలైనంత త్వరగా నెరవేర్చుకోవాలనే తొందరలో ఆమె ఉన్నారు. ఆమె చుట్టూ పోగైన నాయకులు ఆలస్యం చేయకుండా అధికారపు పగ్గాలు చేపట్టమని కందిరీగల్లాగా రొద చేస్తున్నారు.

తెలుగుదేశం పార్టీలో ముసలం గురించి తొలిసారిగా నన్నపనేని రాజకుమారి హెచ్చరించారు. ఎన్‌టీఆర్ ఆరోగ్యం గురించి లక్ష్మీపార్వతి తప్పుడు ప్రచారం చేస్తోందని ఆమె బహిరంగంగా ఆరోపించారు. రాష్ట్ర ప్రజలంతా తమ ముఖ్యమంత్రి సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారని భావిస్తున్న తరుణంలో ఆయన భార్య అందుకు విరుద్ధంగా ప్రచారం చేస్తున్నారని ఆమె అరోపించారు. ఆయన తన కాళ్లను తాను కడుక్కునే స్థితిలో లేరని, తనే ఆయన కాళ్ళు కడుగుతున్నానని, ఆయన చెయ్యి చచ్చుబడటంతో తానే చెంచాతో ఆయనకు ఆహారం తినిపిస్తున్నానని లక్ష్మీపార్వతి చెబుతోందని నన్నపనేని రాజకుమారి ఆగ్రహించారు. తెలుగుదేశం పార్టీ అపూర్వ విజయానికి తానే కారణమనుకుంటున్న లక్ష్మీపార్వతి నమ్మకాన్ని ఎండగడుతూ ఆమె తీవ్రమైన ప్రశ్నలు సంధించారు. లక్ష్మీపార్వతి మంత్రులను వెంటబెట్టుకుని జిల్లాలను సందర్శిస్తోందని, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆమె మెప్పుపొందడం కోసం

ఖరీదైన చీరలు, నగలు కానుకలుగా సమర్పిస్తున్నారని ఆమె చెప్పారు. లక్ష్మీపార్వతి ఆ విమర్శలను పెడచెవిన పెట్టారు. కాని ఆమె అనుయాయులు ఆమె తరఫున వకాల్తా పుచ్చుకుని ఆమె పర్యటనలని, మంత్రులు ఆమెను అనుసరించడం సమర్థించారు. ముద్దుకృష్ణమ నాయుడు ఆమెను తన నాయకురాలిగా అభివర్ణించారు. పార్టీలో ఏ పదవిలో లేనప్పటికీ ఆమెను నాయకురాలిగా ఎలా గుర్తించారని ఆయనను ప్రశ్నించినప్పుడు ఏమాత్రం సంకోచం లేకుండా "ఎన్నికల సమయంలో ఆమె 23 జిల్లాల్లో ఎన్‌టీఆర్‌తో కలిసి పర్యటించి ఎన్నో ప్రసంగాలు చేశారు. ప్రజలు ఎన్‌టీఆర్ తరువాత ఆమెనే నాయకురాలిగా ఆమోదించారు" అని ఆయన చెప్పారు.

క్రమేణా లక్ష్మీపార్వతి ఎన్‌టీఆర్ భార్యగా మాత్రమే కాక ఆమె ముఖ్యమంత్రిని శాసించే రాజ్యాంగేతరశక్తిగా పేరు పొందారు. పరిపాలనలో ఆమె జోక్యాన్ని శాసనసభలో కూడా లేవనెత్తి, శృతిమించకముందే వ్యవహారాన్ని అదుపులోకి తెచ్చుకోమని భారతీయ జనతా పార్టీ ఎన్‌టీఆర్‌కు సలహా ఇచ్చింది. కానీ ఎన్‌టీఆర్ దీనికి స్పందించలేదు.

మంత్రులు, ఎమ్మెల్యేలు, పారిశ్రామిక వేత్తలు, అధికారులు కూడా లక్ష్మీపార్వతి పెత్తనాన్ని గుర్తించారు. ఆమె దృష్టిలో పడడానికి ఎవరికివారే తమవంతు ప్రయత్నాలు చేసేవారు. అన్ని రకాల ఉత్సవాలకూ ఆమెకు ఆహ్వానాలు అందేవి. షోరూంలు, ఫ్యాక్టరీలు ఆమె చేతుల మీదుగా ప్రారంభమవుతున్నాయి. ఒకసారి ఒక షోరూంను రిబ్బన్ కట్ చేసి ప్రారంభం చేస్తే ఆమెకు తోడుగా నలుగురు మంత్రులు కూడా ఆ ప్రోగ్రాముకు వెళ్ళారు. అలా రిబ్బన్ కత్తిరించే కార్యక్రమాలకు వెళ్ళడానికి లక్ష్మీపార్వతి చాలా పెద్దమొత్తంలో డబ్బు వసూలు చేస్తోందని నన్నపనేని రాజకుమారి ఆరోపించారు.


భజనపరులు తెలివైనవాళ్ళు. తమ లక్ష్యసాధనకు వారు కొత్తదారులు కనిపెట్టగలరు. కొత్త పద్ధతులు సృష్టించగలరు. ఉదాహరణకు ధూల్‌పేట ప్రాంతంలో ఒక నాటుసారా దుకాణానికి లక్ష్మీపార్వతి పేరుపెట్టారు. ఎక్సైజ్ అధికార్లు దాని వంక చూడడానికి కూడా జంకారు. ఫిల్మ్ నగర్ సమీపంలో అనుమతి లేకుండా కట్టిన సుమారు వెయ్యి ఇళ్ళున్న ఒక లేబర్ కాలనీకి శ్రీమతి లక్ష్మీపార్వతమ్మ నగర్ అని పేరు పెట్టుకున్నారు. అకస్మాత్తుగా కాలనీలోని నాలుగు కూడళ్లలోనూ ఆ పేరుతో బోర్డులు వెలిశాయి. ఆ పేరు కాలనీకి ఉపయుక్తమైంది. ప్రభుత్వం కాలనీకి ప్రాధాన్యతనిచ్చింది. హైదరాబాద్ వాటర్ సప్లయ్ బోర్డు రంగంలోకి దిగి కాలనీకి త్రాగునీరు నిరవధికంగా సరఫరా చేసింది. పక్క కాలనీలో కుళాయిల్లో చుక్కనీరు రాకపోయినా పట్టించుకోలేదు.

ప్రజల మధ్య ఆమె నిర్వహించే కార్యక్రమాల సంఖ్య పెరిగింది. ఒకసారి ఆమె అభిమానులు ఆమెకు రూపాయి నాణేలతో తులాభారం కార్యక్రమం ఎన్‌టీఆర్ సమక్షంలో నిర్వహించారు. ఆర్థికమంత్రి చంద్రబాబును కూడా ఆ కార్యక్రమానికి ఆహ్వానించారు.

తులాభారం వేయగా వచ్చిన పన్నెండువేల రూపాయలను ఆమె ఎన్‌టీఆర్ సాక్షిగా చంద్రబాబుకు అందచేసి బియ్యం సబ్సిడీ పథకానికి ఉపయోగించమని కోరారు.

ఫిబ్రవరిలో వేలంపాటలాంటి మరో సంఘటన అన్నిటికీ తలమానికమై నిలిచింది. దాసరి నారాయణరావు నిర్మించిన మాయాబజార్ సినిమా ఆడియో విడుదల కార్యక్రమంలో చిత్రం ఆడియో క్యాసెట్‌ను ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్ లాంఛనంగా విడుదల చేసి, తొలి క్యాసెట్టును లక్ష్మీపార్వతికి అందచేశారు. దాసరి నారాయణరావుకి మెరుపులా ఒక ఆలోచన తట్టింది. లక్ష్మీపార్వతి చేతిలోని క్యాసెట్టును వేలం వేసి, వేలంపాట డబ్బును బసవరామ తారకం క్యాన్సర్ ఆసుపత్రికి విరాళంగా అందిస్తామని ప్రకటించారు. వేలంపాట మొదట ఒక వెయ్యి రూపాయలతో ప్రారంభమైంది. దాసరి పాట ఒక లక్ష. రాజశేఖర్ పాట రెండు లక్షలు. ఆయన పాట విన్న ఆయన భార్య జీవిత మూర్ఛబోయినంత పనిచేసి నెత్తీనోరూ బాదుకున్నారు. తరువాత జి.వి.కృష్ణారెడ్డి కుమారుడు సంజయ్‌రెడ్డి మూడులక్షల రూపాయలకు పైపాట పాడడంతో ఆమె ఊపిరి పీల్చుకున్నారు. ఆ తర్వాత నటుడు సుమన్ పాట ఐదులక్షల రూపాయలు. చివరి పాట ఆరు లక్షలు. సంజయ్‌రెడ్డి క్యాసెట్టును కైవసం చేసుకున్నారు. ఈ సంఘటనతో లక్ష్మీపార్వతి పులకరించి పోయారు. ఆమె మెప్పు పొందడం కోసం కొందరు నేలవిడిచి సాము చేయడానికి సిద్ధపడుతున్నారని దీంతో మరోసారి రుజువయింది. లక్ష్మీపార్వతి హోదా శిఖరస్థాయికి చేరుకుంది. అన్ని వర్గాలవారూ చిన్నాపెద్దా పనులకోసం ఆమెను ఆశ్రయించారు. పై ఆరులక్షల వేలంపాట వల్ల పాడినవారికి వేరే రూపంలో ఉపయోగపడిందో లేదో తెలియదు కాని కొన్నాళ్ళకు జి.వి.కృష్ణారెడ్డి తనకు పవర్ ప్రాజెక్టు అనుమతులు ఇప్పించడంలో ఎన్‌టీఆర్ వద్ద మాటసాయం చేయమని లక్ష్మీపార్వతిని కోరారనీ, నేరుగా ఎన్‌టీఆర్ వద్దకు వెళ్ళి సమస్యను పరిష్కరించుకోమని, మధ్యవర్తుల వద్దకు వెళ్లి సమయాన్ని, డబ్బును వృథా చేసుకోవద్దని ఆమె సలహా ఇచ్చినట్లు లక్ష్మీపార్వతి చెప్పారు.

లక్ష్మీపార్వతి గౌరవార్థం ఒక మహిళా సంఘం రవీంద్రభారతిలో నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత సమక్షంలో లక్ష్మీపార్వతిని ప్రజల ప్రతినిధిగా చూడాలని ఉందని ఎన్‌టీఆర్ చెప్పారు. ఆమెకు అధికారికంగా ఒక పెద్ద పదవి లభిస్తోందని ఇంటిగుట్టు తెలిసినవారు ఎన్‌టీఆర్ పలుకులకు భాష్యం చెప్పారు.



ఈ కార్యక్రమం జరిగిన కొద్దిరోజుల్లోనే తెలుగుదేశం జిల్లా కన్వీనర్లు ఎన్‌టీఆర్ దంపతులకు సన్మానం చేశారు. "నా చుట్టూ అనుమానాలు ముసురుకున్న సమయంలో, నేను ఈ విధంగా మళ్లీ మాట్లాడగలనా అని అనుమానం పొడజూపిన వేళ, ఆమె నాకు అండగా నిలిచి, సపర్యలు చేసి, నాలో స్ఫూర్తిని నింపింది. ఆ కృతజ్ఞతతోనే ఆమెను నేను పెళ్లి చేసుకున్నాను. నాలో సగం ఆమె. అందుకే ఆమె తన జీవితాన్ని ప్రజాసేవకు అంకితం చేయాలి" అని ఎన్‌టీఆర్ లక్ష్మీపార్వతికి మార్గనిర్దేశం చేశారు.

ఎన్‌టీర్‌ను లక్ష్మీపార్వతి బాగా ప్రభావితం చేసిందన్న విషయాన్ని ఈ సంఘటన రుజువు చేసింది. చంద్రబాబు ప్రత్యర్థులు పరిస్థితిని తమకు అనుకూలంగా మార్చుకున్నారు. సాయం కోసం లక్ష్మీపార్వతి ముంగిట బారులు తీరారు. తమ అవసరాలకు ఆమె పేరును వాడుకున్నారు. ఆమె కూడా తన బలాన్ని పెంచుకోవడానికి వారికి తోడ్పడింది. ఎన్టీఆర్‌తో ముఖాముఖి చెప్పుకోలేని తమ విషయాలను ఆమె ద్వారా ఆయనకు చేర్చేవారు. ఆమె చెప్పిందే తారకమంత్రమన్నంతగా ఎన్‌టీఆర్ నమ్మారు. క్రమక్రమంగా ఏపనికైనా లక్ష్మీపార్వతిని కలిస్తే చాలు, ఎన్‌టీఆర్‌ను కలవాల్సిన అవసరం లేదని మంత్రుల చుట్టూ తిరిగే జనం భావించడం మొదలుపెట్టారు. పదవులు, బదిలీలు కోరుకునేవారు ఆమెకు సన్నిహితులైన మంత్రుల వద్దకే వెళ్ళేవారు. పార్టీ కార్యకర్తలు కూడా ఆమె ఇంటి చుట్టూతా కాపు కాసేవారు. రాజకీయపరమైన, పాలనాపరమైన నిర్ణయాలకు ఆమె నివాసం కేంద్రబిందువుగా మారింది. లక్ష్మీపార్వతి డబ్బు పోగేస్తోందని వార్తలు సర్వత్రా గట్టిగా వినిపించాయి. లక్ష్మీపార్వతి కార్యకలాపాల గురించి దినపత్రికలు కోడై కూసాయి. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి వెలువడే ఇంగ్లీషు దినపత్రిక డెక్కన్ క్రానికల్ ఆమె గురించి రకరకాల కథనాలు ప్రచురించేది. ఆ విమర్శలను ఆమె ఖాతరు చెయ్యలేదు. ఆ అబద్ధపు వార్తలను లక్ష్యపెట్టకూడదని ఆమె చెబితే ఎన్‌టీఆర్ ఆమెతో ఏకీభవించారు.

1996 పార్లమెంట్ ఎన్నికల తరువాత ఎన్‌టీఆర్ ప్రధానమంత్రి కాబోతున్నారని విలేకరులతో ఏర్పాటు చేసిన ఒక ఇష్టాగోష్ఠిలో ముద్దుకృష్ణమ నాయుడు ప్రకటించి తేనె తుట్టెను కదిలించారు. ప్రతిపక్షాలను ఏకతాటిపైకి తీసుకురావడానికి ఎన్‌టీఆర్ కృషి చేస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో అధికశాతం రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఓడిపోబోతోందని ఆయన చెప్పారు. తమ అధినాయకుడైన ఎన్‌టీఆర్‌పైన గౌరవంతోనో, లక్ష్మీపార్వతి మెప్పుకోసమో ఆయన అలా చెప్పి ఉండవచ్చు. కారణం ఏదైనా ఆయన ప్రకటన వల్ల ఎన్‌టీఆర్ ప్రధానమంత్రి అయితే ముఖ్యమంత్రి ఎవరు అన్న చర్చ మొదలైంది. ముద్దుకృష్ణమ నాయుడు లక్ష్మీపార్వతికి ఆంతరంగికుడు. ఆ పదవి లక్ష్మీపార్వతిదే అని ఆయన చెప్పకనే చెప్పారు.

లక్ష్మీపార్వతి అధికారం కోసం అస్త్రులు సాచారు. ఆమె గతజీవితం, ఎన్‌టీఆర్ వయస్సు, భరోసాలేని ఆయన ఆరోగ్యం నేపథ్యంలో దీపముండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న

చందాన అధికారం తొందరగా హస్తగతం చేసుకోవాలని ఆమె ఆరాటపడుతున్నారు. చంద్రబాబు ప్రత్యర్థులను ఆమె ఏరికోరి చేరదీసింది. ఊరూపేరూ లేనివాళ్లు, మోసగాళ్లు, కలుపుమొక్కలు ఆమె చుట్టూ చేరి కీచురాళ్ళలాగా రొద పెడుతున్నారు. ఏళ్ళ తరబడి ఎన్‌టీఆర్ అల్లుళ్లను, ముఖ్యులైన ఇతర మంత్రులను, నాయకులను నమ్ముకున్నవాళ్లకు కొత్త పరిస్థితులు అసంతృప్తికి గురిచేశాయి. చంద్రబాబు వద్ద, సీనియర్ మంత్రుల వద్ద వాళ్ళు తమ సమస్యను చెప్పుకున్నారు. కానీ చంద్రబాబు సైతం ఏమీ చేయలేని స్థితిలో ఉన్నారు. ఆయనను లక్ష్యంగా చేసుకునే వైరిపక్షం పావులు కదుపుతోంది. నిజానికి ఇప్పుడు ఆయనకే ఆసరా కావాలి. లక్ష్మీపార్వతి సన్నిహితులంతా చంద్రబాబు గురించి ఎన్‌టీఆర్‌కు చాడీలు చెప్పడమే తమ దినచర్యగా మార్చుకున్నారు. చంద్రబాబు వర్గం తమ స్వంత బలంమీదనే ఆధారపడింది. లక్ష్మీపార్వతి వర్గానికి ఎన్‌టీఆర్ ఒక్కరే పెద్దదిక్కు. లక్ష్మీపార్వతికి చంద్రబాబుకు మధ్య సయోధ్య కుదరదు.

పార్టీ, పాలనా వ్యవహారాలు రెండు వర్గాల మధ్య నలిగి కుంటుబడ్డాయి.

లక్ష్మీపార్వతికి అధికారం అడ్డుగోడలు లేవు. అందువల్ల ఆమెని కలవడం చాలా సులువు. ఏదైనా పనిని సామాన్యులు ఎన్‌టీఆర్ ద్వారా చేయించుకోవడం కష్టసాధ్యం. మరోపక్క ఎంతటి గడ్డు సమస్య అయినా లక్ష్మీపార్వతి ప్రమేయంతో సాధ్యమౌతోంది. అందువల్ల ఆమె వర్గం సంఖ్యాబలాన్ని సమకూర్చుకుంది.

చంద్రబాబు, దగ్గుబాటి, మిగతా పార్టీ నాయకుల ప్రమేయం లేకుండా ఎన్‌టీఆర్, లక్ష్మీపార్వతి కలిసి స్థానిక సంస్థల ఎన్నికలకు అభ్యర్థులను ఎంపికచేశారు. 98 మున్సిపాలిటీలకు, 5 కార్పొరేషన్లకు 1995 మార్చి 5న ఎన్నికలు ప్రకటించారు. ఎన్‌టీఆర్ మున్సిపల్ ఎన్నికలకు ప్రచారం చేయడానికి సుముఖంగా లేరు. ఈ అవకాశాన్ని తన బలం నిరూపించుకోవడానికి ఉపయోగించుకోవాలని లక్ష్మీపార్వతి భావించింది. ప్రజల మద్దతు ఉన్నవారినే అధికారం వరిస్తుంది. ఆ విషయాన్ని ఎన్‌టీఆర్ పదేపదే ఎన్నికలలో నిరూపించారు. చంద్రబాబులో వక్తృత్వ నైపుణ్యం, సమ్మోహన శక్తి తక్కువ. లక్ష్మీపార్వతి ఆ బలహీనతపైనే ఆయనను దెబ్బకొట్టదలుచుకున్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు మే నెలలో ఎన్నికలు నిర్వహించారు. అన్నిచోట్లా తెలుగుదేశం అభ్యర్థులు గెలిచే అవకాశం ఉంది. అక్కడ ఎన్నికైన అధ్యక్షులు జిల్లా కో–ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకులకు 10 నుంచి 12 మంది డైరెక్టర్లను ఎన్నుకుంటారు. వాళ్లందరూ తిరిగి రాష్ట్ర కో–ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు అధ్యక్షుడిని ఎన్నుకుంటారు.

చంద్రబాబు సొంత జిల్లాలోనే లక్ష్మీపార్వతి బలప్రదర్శనకు నడుం బిగించింది. దానికి ఎన్‌టీఆర్ మద్దతు పలికారు. ఆమె కార్యక్రమం పెట్టుకున్న రోజున తిరుపతికి వెళ్లే విమాన సర్వీసు అనుమానమని తెలిసిన వెంటనే ఏ ప్రోగ్రామూ లేకున్నా ఆమెకోసమని ఎన్‌టీఆర్

హెలికాప్టర్‌లో తిరుపతి వెళ్ళారు. ఆమె కూడా ఆయనతో ప్రయాణం చేశారు. ఆయన తిరుపతిలో దిగి తిరుమల వెళ్ళారు. చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో లక్ష్మీపార్వతి కార్యక్రమాలకు ప్రాముఖ్యత లభించాలని ఆయన కోరుకున్నారు. అందుకే చుట్టుపక్కల ఏదైనా కార్యక్రమం ఏర్పాటుచేస్తానని చంద్రబాబు అడిగితే దానికి ఆయన ఒప్పుకోలేదు. లక్ష్మీపార్వతి సభల్లో ఆమె మద్దతుదారులు రెచ్చిపోయి, ఆమెను మరో జయలలితగా అభివర్ణించారు. కాబోయే ముఖ్యమంత్రిగా కీర్తించారు. చంద్రబాబుకు వ్యతిరేకంగా ప్రచారం ఉధృతం చేశారు.

జిల్లా కో-ఆపరేటివ్ బ్యాంకుల ఎన్నికలు నిర్ణయాత్మకంగా మారాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికారాన్ని కైవసం చేసుకున్న లక్ష్మీపార్వతి వర్గం తమ గెలుపును అనుకూలంగా మలుచుకోవడానికి ఉత్సాహం చూపించింది. చంద్రబాబు తాలుకు అభ్యర్థులను ఓడించడమే లక్ష్మీపార్వతి పథకం. నిజానికి ఆ ఎన్నికలు పార్టీల పరంగా జరగలేదు. అయినా జిల్లాల్లో స్థానికంగా ఎవరికి ఎక్కువ మద్దతు ఉంటే వారినే అధ్యక్షులుగా ఎంపిక చేయాలని చంద్రబాబు వర్గం ప్రతిపాదిస్తే అందుకు ఎన్టీఆర్ అంగీకరించారు. కానీ ఆమె తన అభ్యర్థులు, ముఖ్యంగా చంద్రబాబు వర్గానికి చెందిన మంత్రుల జిల్లాల్లో, ఎంపిక కావాలని పట్టుబట్టారు. ఆయా జిల్లాల్లో ఎంపిక చేయాల్సిన తనకనుకూలమైన వారి పేర్లు సీల్డ్ కవర్లలో వెళ్లాయి. కాని కరీంనగర్, నల్గొండ, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్, కడప, విజయనగరం జిల్లాల్లో సీల్డ్ కవర్ అభ్యర్థులు ఓడిపోయారు. స్థానికంగా ఎవరు బలమైనవారో వారే గెలుపొందారు. లక్ష్మీపార్వతి వర్గానికి ఇది ఊహించని దెబ్బ. పార్టీ ఆదేశాలను పాటించలేదని ఎన్టీఆర్ ఆగ్రహం వెళ్లగక్కారు. ఈ రకమైన అవిధేయతకు కారణాలేమిటో వినడానికి కూడా ఆయన ఇష్టపడలేదు. పార్టీ ఆదేశాలను ఎవరైతే పాటించలేదో వారిపై క్రమశిక్షణా చర్య తప్పదన్నారు.

కడియం శ్రీహరి, జి.నగేష్ అనే ఇద్దరు మంత్రులను ఎన్టీఆర్ హెచ్చరించి వదిలేశారు. పార్టీ విప్‌ను ధిక్కరించి క్రమశిక్షణారాహిత్యానికి పాల్పడినందుకు తెలంగాణ ప్రాంతానికి చెందిన ఎనిమిది మంది ఎమ్మెల్యేలను సస్పెండ్ చేశారు. వారిలో అయిదుగురు కరీంనగర్ ప్రాంతానికి చెందినవారు. కాకపోతే వారంతా చంద్రబాబుకు సన్నిహితులు.

హిందూపురం స్థానాన్ని తనకోసం అట్టే పెట్టుకుని ఎన్టీఆర్ టెక్కలి అసెంబ్లీ స్థానానికి రాజీనామా చేసారు. మే 27వ తేదీన టెక్కలి నియోజక వర్గంలో ఉపఎన్నిక. టెక్కలి సీటు లక్ష్మీపార్వతిదే అని ఆమె అనుయాయులు విశ్వసించారు. ఎన్టీఆర్ కూడా ఆ సీటు ఆమెకు ఇవ్వాలనుకున్నారు. ఆమెలో ఉత్సాహం ఉరకలు వేసింది. తన కల పండబోతోందని మురిసిపోయారు. కాని ఆమె ఎమ్మెల్యే అయితే ప్రమాదమని ఎన్టీఆర్ కుటుంబసభ్యులు పసిగట్టారు. ఎమ్మెల్యేగా ఎన్నికైతే మంత్రి కావడం తేలిక. ఎమ్మెల్యే అయితే ఎన్టీఆర్ వారసురాలి అర్హతకు ఆమె కూతవేటు దూరానికి చేరిపోతుందని వారు అంచనా వేశారు. ఆమె కల నిజం కాకుండా చేసింది హరికృష్ణ. లక్ష్మీపార్వతికి టిక్కెట్ ఇస్తే టెక్కలిలో స్వతంత్ర

అభ్యర్థిగా పోటీ చేస్తానని హరికృష్ణ ప్రకటించారు. ఏప్రిల్ 13వ తేదీ నవీకరించిన తారకరామ థియేటర్ ప్రారంభోత్సవం జరగాలని కుటుంబసభ్యులు నిశ్చయించారు. అదేరోజు బాలకృష్ణ కొడుకును ఉయ్యాలలో పరుండబెట్టే కార్యక్రమం పెట్టుకున్నారు. రెండింటికీ ఇంటికి పెద్ద అయిన ఎన్‌టీఆర్ ముఖ్య అతిథి. ఆ సందర్భంగా కుటుంబసభ్యులంతా ఒక్కచోట సమావేశమవుతున్నారు. ఏప్రిల్ 13వ తేదీ నాటికి నిర్ణయం తెలియచేయమని హరికృష్ణ తండ్రికి శ్రీముఖం పంపారు. హరికృష్ణ హెచ్చరికతో ఎన్‌టీఆర్ సందిగ్ధంలో పడ్డారు. తన కుటుంబసభ్యులతో ఘర్షణ అవాంఛనీయమనుకుని టెక్కలిటికెట్ వేరొకరికి కేటాయించారు. లక్ష్మీపార్వతి హతాశులయ్యారు.

మొదట్లో ఎన్‌టీఆర్ రెండు వర్గాలను సమదృష్టితో చూసేవారు. కాని టెక్కలి టికెట్టు వ్యవహారం తరువాత ఆయనలో మార్పు వచ్చింది. సమతూకం మరచి లక్ష్మీపార్వతి వర్గం వైపు మొగ్గు చూపారు. లక్ష్మీపార్వతి తన ప్రత్యర్థులపై పగ పట్టారు. “రోజూ ఏదో ఒక నియామకం. అది చంద్రబాబుకు వ్యతిరేకం... టెక్కలి పరాభవానికి ప్రతీకారంగా లక్ష్మీపార్వతి కార్పొరేషన్లు, పార్టీ పదవుల నియామకాలలో విశ్వరూపం ప్రదర్శించారు” అని ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు అన్నారు. టెక్కలి విషయంలో మొండిచెయ్యి చూపారు కనుక ఆమెకు పార్టీ ప్రధాన కార్యదర్శి పదవి ఇవ్వమని ఆమె వర్గానికి చెందిన తొమ్మిదిమంది మంత్రులు ఎన్‌టీఆర్‌కు విజ్ఞప్తి చేసారు. ఎన్‌టీఆర్ ఆ ప్రతిపాదనను మన్నించనూలేదు తిరస్కరించనూ లేదు. కాకపోతే ఆ మరునాడే హిందూపురం పర్యటనలో హరికృష్ణకు పార్టీ పదవి ఇచ్చే విషయం పరిశీలిస్తానని ఎన్‌టీఆర్ పార్టీ కార్యకర్తలకు చెప్పారు. పర్యటనలో పాల్గొన్న లక్ష్మీపార్వతి కోపం కట్టలు తెంచుకుంది. ఆమె అలక పోయి అతిథిగృహంలో ఉండిపోతే ఎన్టీఆర్ ఆమెను సముదాయించారు. అదే పర్యటనలో హిందూపురంలో పాలిటెక్నిక్ భవన నిర్మాణానికి శంకుస్థాపన సభలో ఆమె మాట్లాడుతూ “భవిష్యత్తులో శాసనాధికారం మహిళలదే” అని ఆవేశంగా చెప్పారు. అది విన్న చంద్రబాబు వర్గానికీ, ఎన్టీఆర్ కుటుంబసభ్యులకూ ఆమె మహిళల గురించి కాక ఒకానొక మహిళ గురించే అలా మాట్లాడారని అర్థం చెప్పుకుని భయకంపితులయ్యారు.

ప్రజానాయకురాలిగా తన స్థాయిని నిరూపించదలచి లక్ష్మీపార్వతి జిల్లాల్లో పర్యటించడం ప్రారంభించింది. చాలాచోట్ల జిల్లాస్థాయి నాయకులు ఆమెకు విధేయత ప్రకటించారు. పొగడ్తల్లో ముంచెత్తారు. కానీ ఆమె పర్యటనలు అసలు లక్ష్యాన్ని సాధించడంలో విఫలమయ్యాయి. ఆమె సభలకు ఎక్కువమంది ప్రజలు వచ్చేవారు కాదు. ఎన్‌టీఆర్ పక్కన లేకుండా ఆమె మాట్లాడితే వినేవాళ్ళు కరువయ్యారు. ఒంటరిగా ఆమెకు ప్రజల దగ్గర గుర్తింపు లేదు.

మున్సిపల్ ఎన్నికల ఫలితాలు తెలుగుదేశం పార్టీకి వ్యతిరేకంగా వచ్చాయి. 91

స్థానాలకు పోటీ జరిగితే కాంగ్రెస్ పార్టీ 41 స్థానాలు గెలుచుకుంది. కార్పొరేషన్లలో కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు తలా రెండు స్థానాలు దక్కించుకోగా, అయిదవ స్థానాన్ని సిపిఐ గెలుచుకుంది. ఎన్నికల్లో ఓటమికి లక్ష్మీపార్వతినే అందరూ తప్పుపట్టారు. ఆమె మాత్రం ఓటమికి బాధ్యత స్వీకరించలేదు.

ఆశ్చర్యకరంగా క్రమేణా లక్ష్మీపార్వతి కాంగ్రెస్ నాయకులతో సంధి చేసుకున్నారు. ఆమె పి.వి.నరసింహారావుని తమ ఇంటికి భోజనానికి పిలిచింది. 1984లో నాదెండ్లకు మద్దతునిచ్చినందుకు పి.వి.నరసింహారావును ఎన్‌టీఆర్ తప్పుబట్టారు. ప్రధానమంత్రి అయిన తరువాత ఆయన లోక్‌సభలో తెలుగుదేశం పార్టీలో చీలిక తెచ్చారు. పి.వి.నరసింహారావుని విందుకు పిలవడంలో తప్పులేదన్నారు ఎన్‌టీఆర్. తమ చర్యను సమర్థించుకుంటూ "ఉగాది పర్వదినాన ఆయన నగరంలోనే ఉన్నప్పుడు ఆయనను అతిథిగా భోజనానికి పిలవడం మన సంస్కారంలో భాగం" అన్నారు ఎన్‌టీఆర్. ఈ పరిణామాలు తెలుగుదేశం కార్యకర్తలకు మింగుడుపడలేదు.

1991 తరువాత ఎన్‌టీఆర్ ఛైర్మన్‌గా ఉన్న నేషనల్ ఫ్రంట్ మనుగడ ప్రశ్నార్థకంగా తయారయింది. ఢిల్లీలోని నేషనల్ ఫ్రంట్ ఆఫీసు అద్దె, టెలిఫోన్ బిల్లులు సైతం చెల్లించలేని పరిస్థితి. 1995లో ఎన్‌టీఆర్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఎన్నిక కావడంతో జాతీయ రాజకీయాల్లో ప్రతిపక్షాల ఐక్యత గురించి మళ్ళీ చర్చ మొదలైంది. ఏప్రిల్ 1995లో బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో లాలూ ప్రసాద్ యాదవ్ గెలుపొందారు. దీంతో నేషనల్ ఫ్రంట్ అవసరాన్ని అన్ని పార్టీలూ గుర్తించాయి. తదుపరి కార్యాచరణను నిర్ణయించడానికి ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్‌లో ఎన్టీఆర్ అన్ని పార్టీల నాయకులతో బ్రేక్‌ఫాస్టు మీటింగ్ నిర్వహించారు. దేవెగౌడ, బిజూ పట్నాయక్, వి.పి.సింగ్, రాం విలాస్ పాశ్వాన్, శరద్ యాదవ్, ఎస్.ఆర్.బొమ్మై, రామకృష్ణ హెగ్డే తదితర నాయకులు ఆ మీటింగుకు హాజరయ్యారు. కరుణానిధి ఆరోగ్య కారణాల రీత్యా రాలేకపోయారు. ఎన్.డి.తివారీ, అర్జున్ సింగ్ తిరుగుబాటు బావుటా ఎగరేయడంతో కాంగ్రెస్ చిక్కుల్లో పడింది. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బలహీనపరిచేందుకు వారిద్దరినీ కూడా కలుపుకోగలమా అని సమావేశానికి వచ్చినవారు ఎన్‌టీర్‌ను అడిగారు. "దేశ ప్రయోజనాలు నాకు ముఖ్యం. ఒకరినొకరు మోసపుచ్చుకోవడం కాదు" అంటూ ఎన్‌టీఆర్ అప్పటికప్పుడే ఆ ప్రతిపాదనను తిరస్కరించారు.

లాలూ ప్రసాద్ యాదవ్ ఢిల్లీలోని తన నివాసంలో ఒక విందు ఏర్పాటు చేశారు. ప్రతిపక్ష నాయకులందరూ ఆ విందుకు వచ్చారు. ఆయన ఇల్లు, లాన్ అంతా ఢిల్లీ, బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలనుంచి వచ్చిన సుమారు వెయ్యి మంది నాయకులతో నిండిపోయింది. బల్లలపై వేడివేడి వంటకాలు సిద్ధం చేశారు. సాధారణంగా అటువంటి సందర్భాల్లో ఎన్‌టీఆర్ మితంగా భోంచేసేవారు. కానీ ఆరోజు లక్ష్మీపార్వతి పళ్లెంలో ఆహారం పెట్టుకుని వచ్చి

అందరి ముందూ ఎన్టీఆర్‌కు చెంచాతో తినిపించడం మొదలుపెట్టారు. అకస్మాత్తుగా అందరి కళ్లూ ఎన్టీఆర్‌వైపే తిరిగాయి. ఫోటోగ్రాఫర్లు తమ కెమెరాలను క్లిక్ చేశారు. పత్రికలకు కావలసినంత మేత దొరికింది అని అక్కడ విందుకు హాజరైన దగ్గుబాటి వెంకటేశ్వరరావు చెప్పారు. ఆ విషయం మర్నాడు పత్రికలకెక్కింది. భార్య తినిపిస్తే తప్ప తినలేని పరిస్థితి ఎన్టీఆర్‌ది అని అందరికీ అర్థమయింది. ప్రధానమంత్రి పదవికి ఆయన ఆరోగ్యం సహకరించదు అన్న సందేశం ఆ వార్తలో ఇమిడి ఉంది. ఆ నేపథ్యంలో నేషనల్ ఫ్రంటు ఛైర్మన్‌గా ఎన్‌టీఆర్ నిర్వహించిన సమావేశానికి పత్రికలు ప్రాధాన్యం ఇవ్వలేదు. ఒకవేళ ఎన్టీఆర్‌కు ఆరోగ్యపరంగా ఇబ్బంది ఉన్నా, లక్ష్మీపార్వతి దాన్ని అలా బహిర్గతం చేయాల్సిన అవసరం లేదు. ఆమె చర్య ఎన్‌టీఆర్ ఇమేజికి విఘాతం కలిగించింది.

దగ్గుబాటి అభిప్రాయం ప్రకారం ఎన్‌టిఆర్‌కు సొంతంగా భోజనం చేయడంలో సమస్యలేమీ లేవు. కొన్నాళ్ళ ముందు తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత తెలుగుగంగ ప్రాజెక్టు గురించి చర్చలు జరపడానికి హైదరాబాదుకు వచ్చినప్పుడు ఎన్‌టీఆర్ తన నివాసంలో ఆమె గౌరవార్థం విందు ఏర్పాటు చేశారు. ఆ సమయంలో ఆయన తమ స్వహస్తాలతో భోజనం వడ్డించుకున్నారు. ప్రతి వంటకాన్ని వేళ్లతో బాగా కలుపుకుని, శుభ్రంగా ఎవరి సాయం లేకుండానే తిన్నారు.

ఏప్రిల్ నెలలో కాంగ్రెస్ పార్టీ అసమ్మతి నేత రంగరాజన్ కుమారమంగళం లోక్‌సభలో ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. తమ ఎంపీల మద్దతు ఆయనకే ఉంటుందని ఎన్‌టీఆర్ ప్రకటించారు. అవిశ్వాస తీర్మానం నెగ్గి కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతే ప్రత్యామ్నాయం ఏమిటి అని విలేకరులు అడిగినప్పుడు నేషనల్ ఫ్రంట్ ఛైర్మన్‌గా తానే బలమైన ప్రత్యామ్నాయమని ఎన్‌టీఆర్ చెప్పారు.

కేంద్రంలో త్వరత్వరగా మారుతున్న వాతావరణం గమనించిన లక్ష్మీపార్వతి ఆంధ్రప్రదేశ్‌లో తన స్థానం సుస్థిరం చేసుకునే దిశగా అడుగులు వేశారు. ఆమె పురోగమనానికి ప్రధాన అడ్డంకి చంద్రబాబు. ఆయనను ప్రత్యర్థి స్థానం నుంచి తొలగించాలని రకరకాల పథకాలు ఆమె వర్గం రచించింది. లక్ష్మీపార్వతి వర్గం అల్లుతున్న పథకాలను ఎన్టీఆర్ కుటుంబసభ్యులు అర్థం చేసుకున్నారు. ఆయన కుమారులు, కూతుళ్లు, అల్లుళ్లు, కోడళ్లు ఒక వేడుకలో కలిసినప్పుడు ఈ విషయం చర్చించుకున్నారు. పరస్పరం పోట్లాడుకుంటున్న ఇద్దరు తోడల్లుళ్ల మధ్య సయోధ్య కుదర్చడానికి కుటుంబసభ్యులు ప్రయత్నించారు. వారి ప్రయత్నం ఫలించింది. లక్ష్మీపార్వతిని సమిష్టిగా ఎదుర్కోవాలని వారు నిర్ణయం తీసుకున్నారు.

మునిసిపల్ ఎన్నికల్లో ఓటమికి లక్ష్మీపార్వతిని బాధ్యురాలిని చేయడం సమంజసం కాదని ఎన్‌టీఆర్ అన్నారు. పరాజయానికి, పార్టీలో అసంతృప్తికి ఆమె ఎలా కారణమని ప్రశ్నించారు. ఆమెను విమర్శించేవారి పట్ల ఎన్‌టీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఆమె నా

భార్య. ఆమె నా కనుసన్నల్లో నడుస్తోంది. ఇది నా పార్టీ. నేను మిమ్మల్ని గెలిపించాను. మీరు నా మాట ఎందుకు వినరు?" అంటూ తెలుగుదేశం నాయకులపై ఎన్‌టీఆర్ దురుసుగా విరుచుకు పడ్డారు. ఆమెను సత్యభామతో పోల్చారు. నరకాసురయుద్ధంలో శ్రీకృష్ణుడు స్పృహతప్పి పడ్డప్పుడు సత్యభామ ధనుస్సు చేతబట్టి యుద్ధంచేసి నరకాసురుణ్ణి హతమార్చింది. "సత్యభామలాగా నాకు ఆరోగ్యం కుదురుగా లేనప్పుడు లక్ష్మీపార్వతి నాకు సపర్యలు చేసి, ఎన్నికల్లో నాతో పాటు ప్రచారం చేసి నా విజయానికి దోహదం చేసింది. ప్రస్తుతం ఆమె నా సలహాదారుగా ఉంది. అందులో తప్పేముంది?" అని ఆయన అడిగారు.

ఎన్‌టీఆర్ లక్ష్మీపార్వతిని ఎంత వెనకేసుకొస్తే అంతే కటువుగా హరికృష్ణ ఆమెపై విమర్శనాస్త్రాలు సంధించారు. గుంటూరు జిల్లాలో హరికృష్ణ సభలు నిర్వహించి ఆమెను ఎండగట్టితే తెలుగుదేశం కార్యకర్తలు పెద్దఎత్తున ఆయనకు మద్దతుగా పోగయ్యారు. గుంటూరు ఆమె సొంత జిల్లా. హరికృష్ణ సభలకు కార్యకర్తలు వెళ్ళకుండా ఆపలేకపోయారని స్థానిక నాయకులపై లక్ష్మీపార్వతి విరుచుకుపడ్డారు. చంద్రబాబుకు లక్ష్మీపార్వతికి మధ్య అంతర్యుద్ధం చెలరేగినప్పుడు దేవినేని నెహ్రూ ఆమె వర్గంలో సభ్యులు.

హరికృష్ణ రాష్ట్రవ్యాప్త పర్యటనలు చేస్తున్నప్పుడు తెలుగుదేశం స్థానిక నాయకులు, కార్యకర్తలు ఎలా స్పందించాలో చెప్పండంటూ దేవినేని నెహ్రూ ఎన్‌టీర్‌ను అడిగారు. ఆ సభలకు జనసమీకరణ చేయమని, హరికృష్ణ వెనుక కార్యకర్తలు ఉండేట్లు చూడమని ఎన్‌టీఆర్ ఆయనకు స్పష్టంగా చెప్పారు. దీంతో ఎన్‌టీఆర్ పరస్పర విరుద్ధమైన సంకేతాలు అందించినట్లయింది. ''ఆమెది అధికారదాహం. కావల్సింది అసలైన, నిజమైన ప్రత్యక్ష్యాధికారం. డబ్బు కాదు. డబ్బు ఆశిస్తే కోరినంత మొత్తం ఇంకోమాట మాట్లాడకుండా ఆమెకు చేరేది. కానీ అధికారం లక్ష్యంగా మారినప్పుడు పోట్లాట అనివార్యమైంది" అని దేవినేని నెహ్రూ అన్నారు.

లక్ష్మీపార్వతి అర్హతను గుర్తించి, ఆమె గౌరవానికి భంగం కలుగకుండా, ఆమెను పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమించమని ఆమె అనుయాయులు, ఆమెకు మద్దతుగా నిలిచిన మంత్రులు ఎన్టీఆర్‌పై విపరీతమైన ఒత్తిడి తెచ్చారు. కాని హరికృష్ణ పరుష పదజాలంతో లక్ష్మీపార్వతిని విమర్శిస్తున్న నేపథ్యంలో ఆమెకు పార్టీ పదవి ఇవ్వడానికి ఎన్‌టీఆర్ సంకోచించారు.

రాష్ట్రంలో రాజకీయ పరిస్థితిలో ఉత్కంఠభరితమైన పరిణామాలు చోటు చేసుకుంటున్న సమయంలో ఎన్‌టీఆర్ జూన్ నెలలో బ్రిటన్ పర్యటన చేపట్టారు. లక్ష్మీపార్వతి కూడా ఆయనతో వెళ్ళారు. వారికి బ్రిటన్‌లో ఉన్న తెలుగువారు సాదర స్వాగతం పలికారు. బర్మింగ్‌హాం నగరంలో ఎన్‌టీఆర్ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. మెదడులో రక్తం గడ్డకట్టడం వల్లనే 1993లో ఆయనకు పక్షవాతం సోకిందని పరీక్షలు తేల్చిచెప్పాయి. ఆ

గడ్డకట్టిన భాగం మెదడులో అలాగే ఉండిపోయింది. వైద్య రిపోర్టులు వారిని బాధపెట్టాయి. అది మినహా బ్రిటన్ పర్యటన ఆనందంగా నడిచింది. లండన్‌లో ఉల్లాసంగా తిరిగి రకరకాల దొరల టోపీలు, కోట్లు కొన్నారు. థియేటర్‌కు వెళ్లి వరుసగా షేక్స్పియర్ నాటకాలు చూశారు.

ఎన్‌టీఆర్ ఆనందహేలకు డిస్టిల్లరీల లైసెన్సు పునరుద్ధరణ వ్యవహారం అడ్డం వచ్చింది. రాష్ట్రంలో సంపూర్ణ మద్యనిషేధం అమలు చేస్తున్న సందర్భంలో మద్యం ఉత్పత్తి సమంజసం కాదని, మద్యం ఉత్పత్తిదారుల లైసెన్సులను పునరుద్ధరించలేదు. బ్రూవరీలు, డిస్టిల్లరీలు హైకోర్టుకు వెళ్ళాయి. రాష్ట్రంలో మద్యనిషేధం అమలులో ఉన్నా మద్యం ఉత్పత్తిపై చట్టపరంగా నిషేధం లేదు. అందువల్ల హైకోర్టు ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పునిచ్చింది. ఆ తీర్పుపై ప్రభుత్వం సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వెయ్యలేదు. దానికి కారణం తెలియదు. బ్రిటన్ పర్యటనకు వెళ్ళే ముందు మద్యం ఉత్పత్తికి వీలుగా బ్రూవరీలు, డిస్టిల్లరీల లైసెన్సుల పునరుద్ధరణకు అనుమతిస్తూ సంబంధిత ఫైలుపై ఎన్‌టీఆర్ సంతకం చేశారు. సంపూర్ణ మద్యనిషేధం పట్ల తన చిత్తశుద్ధిని శంకించరాదని పదేపదే చెప్పిన ఎన్‌టీఆర్, లైసెన్సుల పునరుద్ధరణకు అంతవరకూ అంగీకరించని ఎన్‌టీఆర్, విదేశ పర్యటన వెళ్తున్న సమయంలో గుట్టుగా ఆఘమేఘాల మీద పర్మిషన్ ఇవ్వడం అనుమానాలకు తావిచ్చింది. ఈనాడు దినపత్రిక ఈ నిర్ణయంపై పెద్ద ఎత్తున విమర్శకు దిగి రభస చేసింది. నిర్ణయం వెనుక ఎవరి హస్తం ఉందని సూటిగా ప్రశ్నించింది. లక్ష్మీపార్వతి వర్గంలో ముఖ్యుడు గాలి ముద్దుకృష్ణమ నాయుడు లైసెన్సుల పునరుద్ధరణ నిర్ణయాన్ని సమర్థించారు. పత్రికలలో వచ్చిన విమర్శలు, ప్రతిపక్షాల స్పందనతోబాటు ఆ నిర్ణయం వల్ల ఉత్పన్నమయ్యే కష్టనష్టాలు చంద్రబాబు, సెక్రెటరీలు టెలిఫోన్లో రెండు దఫాలుగా ఎన్‌టీఆర్‌కు వివరించారు. నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే తీవ్రతరమైన ఇబ్బందులను ప్రభుత్వం ఎదుర్కోవలసి వస్తుందని చెప్పారు. చివరకు సంబంధిత ప్రభుత్వ నిర్ణయాన్ని రద్దు చేయడానికి ఎన్‌టీఆర్ అనుమతి ఇచ్చారు. ఈ విషయంలో చంద్రబాబు ఎన్‌టీర్‌ను అప్రతిష్టపాలు చేశారని లక్ష్మీపార్వతి, ఆమె మద్దతుదారులు కన్నెర్ర చేశారు.

పార్టీలో పైచేయి సాధించడం కోసం జరుగుతున్న పోట్లాట తీవ్రమవుతున్న కొద్దీ రాష్ట్రంలో పాలనావ్యవహారాలు కుంటుపడ్డాయి. పాలనను వెనక్కు నెట్టి రాజకీయాలు ప్రధానస్థానం ఆక్రమించాయి. ఈ అంతర్యుద్ధానికి ముగింపు పలుకుతూ పాలనలో లక్ష్మీపార్వతి ప్రమేయం లేకుండా చూడాలని కమ్యూనిస్టు పార్టీలు ఎన్‌టిఆర్‌కు సూచించాయి. ఎన్‌టిఆర్‌కు వారి సలహా రుచించలేదు. తమ సొంత వ్యవహారాల్లో ఇతరుల జోక్యం సహించబోమని తేల్చిచెప్పారు. చంద్రబాబును ఒక మంత్రిత్వ శాఖకు పరిమితం చేయాలని లక్ష్మీపార్వతి శక్తివంచన లేకుండా ప్రయత్నించారు. అలా జరిగితే మొహం చెల్లక ఆయన మంత్రిపదవికి రాజీనామా చేస్తారని ఆమె భావించారు. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఎంత ఒత్తిడి చేసినా,

ఎందరితో చెప్పించినా ఎన్‌టీఆర్ ఆ చర్యను తీసుకోలేదు. చంద్రబాబును తప్పించడానికి ఎన్‌టీఆర్ ఎందుకు వెనుకాడుతున్నారో ఆమెకు అంతుబట్టలేదు.

జూలై 3న ఎన్‌టీఆర్ పార్టీ నాయకుల నడవడికపై భగ్గుమన్నారు. ముఠా విధానాలకు స్వస్తి చెప్పకపోతే అసెంబ్లీని రద్దు చేయడానికి కూడా వెనుకాడనని హెచ్చరించారు. ఈ హెచ్చరిక చంద్రబాబు వర్గం ఎమ్మెల్యేలను విపరీతంగా కలవరపరచింది.

ఆధిపత్య పోరులో చంద్రబాబు ఉదాసీనంగా ఉన్నారు. కానీ ఆయన అనుచరులు ఆయనపై ఒత్తిడి పెంచారు. వారిని ఎలా సముదాయించాలో ఆయనకు అర్థం కాలేదు. చంద్రబాబుకు గానీ, ఆయన అనుచరులకు గానీ లక్ష్మీపార్వతి వర్గంపై పైచేయి సాధించడం ఎలాగో తెలియలేదు. ప్రస్తుత పరిస్థితులలో ఆమెతో కయ్యం అంటే ఎన్‌టీఆర్ ఆధిపత్యాన్ని ప్రశ్నించడమే అని వారికి తెలుసు. అది చంద్రబాబు చేయలేరు. ప్రత్యర్థి వర్గం ఎంత బలమైనదైనా వారు ఎన్టీఆర్‌పై కత్తిదూసే సాహసం చేయరని లక్ష్మీపార్వతికి గట్టి నమ్మకం. కాని ఏదీ చెయ్యకపోతే చంద్రబాబు, ఆయన సన్నిహితులు రాజకీయ సన్యాసం తీసుకోవలసిన పరిస్థితి ఎంతో దూరం లేదు.

నల్గొండ, నిజామాబాద్, ఖమ్మం, విజయనగరం జిల్లాల్లో సీల్డ్ కవర్ అభ్యర్థులు ఓడిపోయిన దృష్ట్యా, నాయకులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నారన్న వార్తలు చంద్రబాబు వర్గంలో కలకలం సృష్టించాయి. క్రమశిక్షణారాహిత్యం కింద ఎనిమిది మంది శాసనసభ్యులను సస్పెండు చేసినప్పుడు అదే శిక్ష మంత్రి మాధవరెడ్డికి కూడా వేయాలని లక్ష్మీపార్వతి వర్గం పట్టుబట్టింది. మాధవరెడ్డి చంద్రబాబుకు సన్నిహితుడు. ఆయనపై వేటుపడితే ఇక చంద్రబాబే తర్వాతి టార్గెట్. "చంద్రబాబును, ఆయన నమ్మకస్తులైన సీనియర్ నాయకులను వెంటాడి రాజకీయంగా నాశనం చెయ్యడమే వారి ఉద్దేశం" అని ఉమ్మారెడ్డి అన్నారు. చంద్రబాబును నమ్ముకున్న వారికి భయం పట్టుకుంది. లక్ష్మీపార్వతి మాటలను నమ్మి ఎన్‌టీఆర్ నిప్పులు చెరుగుతుండటం గమనించి చంద్రబాబు ఆశ్చర్యపోయారు.

చంద్రబాబు ఆఫీసు గదికి ఎమ్మెల్యేలు వెల్లువెత్తారు. ఎనిమిది మంది ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ వేటును ఎత్తివేయమని కోరుతూ ఒక అర్జీపై వారంతా సంతకాలు చేశారు. అది చంద్రబాబు సత్తాను చాటింది కానీ ఎన్‌టీఆర్ ఆ పిటిషన్‌ను పట్టించుకోలేదు.

ఆగస్టు నెలలో ప్రజాదర్బార్లను నిర్వహించడానికి ఎన్‌టీఆర్ సన్నద్ధమయ్యారు. ప్రజల ముంగిట ప్రభుత్వం నినాదంతో రాష్ట్రమంతటా పర్యటించాలని ఎన్‌టీఆర్ ఉద్దేశం. ఆ తర్వాత నవంబరులో దేశంలోని మిగతా రాష్ట్రాలలో పర్యటించాలని, జాతీయ రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషించాలని ఆయన అనుకున్నారు.

ప్రజాదర్బార్ కార్యక్రమం ఉత్తరాంధ్ర జిల్లాలతో మొదలైంది. ఆ కార్యక్రమాల్లో మంత్రులందరూ హాజరవుతారు. ఈ పర్యటనలు చిన్న చిన్న ప్రజా సమస్యలను తక్షణం

పరిష్కరించడానికి ఉపయుక్తమయ్యాయి కానీ రాజకీయంగా అవి జిల్లాల వారీగా రెండు వర్గాల బలప్రదర్శనకు కూడా వేదికలయ్యాయి.

1995 ఆగస్టు 20వ తేదీన పార్వతీపురంలో ఎన్‌టీఆర్ ఒక ర్యాలీలో ప్రసంగించారు. ఆ తరువాత ఆయన హెలికాప్టర్ వద్దకు నడిచి వెళుతున్నప్పుడు ఒక యువకుడు పాదాభివందనం చేయాలనే సత్సంకల్పంతో ఎన్‌టీఆర్ కాళ్ళు పట్టుకున్నాడు. అనుకోని ఈ చర్యతో నడుస్తున్న ఎన్‌టీఆర్ బేలెన్సు తప్పి, తూలి కిందకు పడ్డారు. ఆయన కళ్లజోడుకు ఉన్న స్టీల్ ఫ్రేమ్ ముక్కులో గుచ్చుకోవడంతో నెత్తురు కారింది. లక్ష్మీపార్వతి ఆయన వెనుక కొద్ది దూరంలో ఉన్నారు. ఈ సంఘటనను ఎన్‌టీఆర్ అశుభసూచకంగా భావించారు.

లక్ష్మీపార్వతి వర్గం అశోక గజపతిరాజుని, మాధవరెడ్డిని సస్పెందు చేయాలని నిర్ణయం తీసుకుంది. వారిపై చర్య తీసుకోవడానికి ముహూర్తం కూడా పెట్టారు. క్రమశిక్షణా సంఘం సభ్యడొకరు సెంట్రల్ బ్యాంకుల అధ్యక్షుల ఎన్నికలో అదనంగా ముప్ఫై అయిదుమంది ఎమ్మెల్యేలు కూడా పార్టీ వ్యతిరేక చర్యలకు పాల్పడ్డారని, వారిని కూడా సస్పెండ్ చేయవలసి ఉందని నిర్ధారించని ఒక జాబితా తొందరపాటులో విడుదల చేశారు. ఈ చర్య వల్ల వర్గపోరాటం తారాస్థాయికి చేరుకుంది.

విజయనగరం నుంచి జిల్లాలకు ఎమ్మెల్యేలకు టెలిఫోన్లు వెళ్ళాయి. చంద్రబాబు వర్గంలోని నాయకులు, మంత్రులు రంగంలోకి దిగి ఎమ్మెల్యేలకు సంక్షోభం తీరుతెన్నులు వివరించారు. బలసమీకరణ మొదలైంది.

ప్రజాదర్బార్లో చివరి మజిలీ విశాఖపట్నం. అక్కడ జరిగిన ఒక సంఘటన రెండు వర్గాల మధ్య అగాథాన్ని మరింత పెరగడానికి దోహదం చేసింది. పబ్లిక్ మీటింగుకోసం గెస్టుహౌసు నుంచి ఎన్‌టీఆర్ బయటికి వచ్చారు. పోలీసులు ఆయనను కొద్దిసేపు ఆగమని కోరారు. కారణం? చంద్రబాబు తన మద్దతుదారులతో సభాస్థలికి ఊరేగింపుగా అసాధారణ రీతిలో 40 కార్ల కాన్వాయ్‌లో అభిమానులతో కలిసి వెళ్లారు. ర్యాలీ అనుకున్న దానికంటే పెద్దది కావడంతో కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించింది. ఆ కారణంగా పోలీసులు ఎన్‌టీఆర్‌ను ఆపివేశారు. అది ప్రొటొకాల్‌కు విరుద్ధం. ఎన్‌టిఆర్‌కు కోపం పెల్లుబికింది. లక్ష్మీపార్వతి ఆగ్రహం వెళ్లగక్కారు. ఆమె వర్గం మంత్రులు అగ్నికి ఆజ్యం పోసారు. చంద్రబాబు వెనక్కు తగ్గి, ఎన్‌టిఆర్‌కు దారి ఇచ్చి ఉండాల్సిందన్నారు. పోలీసులు కూడా చంద్రబాబు ఆజ్ఞలనే పాటిస్తున్నారని ఎన్‌టిఆర్‌కు వారు ఫిర్యాదు చేశారు. ఎన్‌టీఆర్ నిప్పుల కొలిమిలా మారారు. చంద్రబాబు తరువాత 15 నిముషాలకు ఆయన వేదిక వద్దకు చేరుకున్నారు. ఆయన చంద్రబాబు వంక చూడడానికి కూడా ఇష్టపడలేదు. వేదికమీద ఎన్‌టిఆర్‌కు చెరోవైపు చంద్రబాబు, లక్ష్మీపార్వతి కూర్చుకున్నారు. ఆ సమయంలో అనుకోకుండా చంద్రబాబు

చేయి ఎన్‌టిఆర్‌కు తగిలింది. ఎన్‌టీఆర్ ఆ స్పర్శను సైతం సహించలేదు. తెలియకుండా తప్పు జరిగిందని చంద్రబాబు చెబితే ఎన్‌టీఆర్ ఆయన మాటల్ని వినిపించుకోలేదు. ఎన్‌టిఆర్‌లో రాజీపడే ధోరణి కనిపించలేదు. ఆయన తన వివరణను వినిపించుకునే స్థితిలో లేరని చంద్రబాబుకు అర్థమైంది.

లక్ష్మీపార్వతి కథనం ప్రకారం ఎన్‌టీఆర్ ఆగ్రహంగా ఉన్నారు. "ఈ డ్రామాను చంద్రబాబు, రామోజీరావు కలిసి నడిపించారు. దీనికి చరమగీతం పాడాలి. మనం ఇప్పుడు ప్రజా సమస్యలను గురించి చర్చించడానికి వచ్చాం. దానికి అంతరాయం ఏర్పడకూడదు. అందుకే ఇప్పుడు మిన్నకుండిపోయాను. హైదరాబాద్ చేరిన తరువాత ఆయనను క్యాబినెట్ నుంచి తొలగిస్తాను. ఆ తరువాతే మంత్రివర్గ విస్తరణ చేపడతాను. అంతవరకు ఈ విషయం రహస్యంగా ఉంచు" అని ఎన్‌టీఆర్ ఆమెతో చెప్పారని ఆమె అన్నారు.


సమస్య జటిలమయిందని గ్రహించిన చంద్రబాబు విశాఖపట్నం నుంచి హరికృష్ణతో మాట్లాడారు. ఒక స్నేహితుని ఇంట్లో బాలకృష్ణను కలుసుకున్నారు. పరిస్థితిని సమీక్ష చేశారు. విశాఖపట్నంలో వీలైనంతమంది ఎమ్మెల్యేలను పోగుచేసి ఎన్‌టీర్‌ను కలిసి లక్ష్మీపార్వతిపై ఆయనకు ఫిర్యాదు చేయాలని చంద్రబాబు అనుకున్నారు. కానీ తొందరగానే ఆ ఆలోచన విరమించుకున్నారు. దానికి బదులుగా అశోక గజపతిరాజు, దేవేందర్ గౌడ్, ఎస్.వి.సుబ్బారెడ్డి ఎన్‌టీర్‌ను కలిసి పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ లక్ష్మీపార్వతి ప్రమేయం లేకుండా చేయాలని, పార్టీకి తిరిగి పునర్వైభవం తీసుకురావాలని కోరాలని అనుకున్నారు. ఒకవేళ ఆ ప్రయత్నం కూడా అనుకున్న ఫలితాన్ని రాబట్టడంలో విఫలమైతే అందరూ ఎన్‌టీఆర్ నివాసం వద్ద గుమికూడి ధర్నా చేయాలని నిర్ణయించుకున్నారు.

రాజకీయమైన నిర్ణయాలు తీసుకోవడంలో ఎన్‌టీఆర్ నిష్ణాతులు కాదు. రాజకీయ ఎత్తుగడలు ఆయనకు తెలియవు. అన్ని విషయాలనూ క్రోడీకరించుకుని వాటివల్ల రాబోయే పరిణామాలను అంచనా వేయడం ఆయనకు చేతకాదు. తన గొప్ప వక్తృత్వ పటిమతో భారీ ప్రజాసమూహాలను ఆకట్టుకునే ప్రసంగాలు చేయగలరు. ఆవేశం ఆయన సహజ గుణం. అనుకున్నది, మనసుకు తోచింది వెంటనే చెయ్యడం ఆయన నైజం. సమయానుకూలంగా ప్రవర్తించడం ఆయనకు తెలియదు. అందుకే సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కోవడంలో ఆయన విఫలమయ్యేవారు. చంద్రబాబు నైజం అందుకు వ్యతిరేకం. దేనికీ తొందరలేదు. ఆచితూచి అడుగు వేసేవారు. దూరదృష్టి ఎక్కువ. ఆలోచనా విధానంలో భావోద్వేగాలకు తావులేదు. అనేక విషయాలను ఒకేసారి ఆకళింపుచేసుకుని, ఆలోచనకు పదునుపెట్టి, తన గమనాన్ని నిర్దేశించుకునేవారు.

రెండు వర్గాల మధ్య పరస్పర నిందారోపణలు ఉధృతమయ్యాయి. రాష్ట్రంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఎన్‌టీఆర్ నివాసం వద్ద క్రమశిక్షణాచర్య అన్న విషయమే

నలుగుతోంది. చంద్రబాబు క్యాంపులో ఎమ్మెల్యేలను సమీకరించి కలిసికట్టుగా ఏదైనా చేయాలని సమాలోచనలు సాగుతున్నాయి. వివిధ అంశాలు, విభిన్న కోణాలు చర్చకు వస్తున్నాయి కానీ ఒకరోజుకు పైబడి మల్లగుల్లాలు పడ్డా ఏ విషయమూ తేలలేదు. కాకపోతే తనకేమీ పట్టనట్లు, జరుగున్నదానితో తనకు సంబంధం లేనట్లు, ఎన్‌టీఆర్ విరాగిగా ఉండిపోయారు. రకరకాల మాటలు వినబడుతున్నాయి. తిరుగుబాటు చెలరేగిందనే వార్త దావానలంలా వ్యాపించింది. చంద్రబాబుకు సైతం ఎప్పుడు, ఏది ఎలా జరుగుతుందో తెలియదు. సంఘర్షణకు ముగింపు ఎలా పలకాలో అంతుచిక్కడం లేదు. సమస్యకు పరిష్కారం ఆయనకూ తెలియదు.

***




ఎన్‌టీఆర్ సమగ్ర జీవితచరిత్ర (ఇంగ్లీషు) 27.1.2019న శ్రీ పూసపాటి అశోక్ గజపతిరాజు గారు ఆవిష్కరించారు. శ్రీ నందమూరి రామకృష్ణ గారు మొదటి కాపీని అందుకున్నారు.